www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గుల్జార్, రామభద్రాచార్యకు జ్ఞానపీఠ్ 2



- ఉర్దూ, సంస్కృత సాహితీవేత్తలకు పురస్కారం
- 2023 ఏడాదికి ప్రకటించిన ఎంపిక కమిటీ
- జ్యూరీలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి, కవి కృష్ణారావు
- పసితనంలోనే కంటిచూపు కోల్పోయినా
- సాహితీ రంగంలో రామభద్రాచార్య అసాధారణ కృషి
- ఉర్దూ సాహితీ జగత్తులో గుల్జార్ ధృవతార
- బాలీవుడ్‌లో అనేక సూపర్‌హిట్ పాటలు ఆయన రాసినవే

ఆదివారం | 18-2-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 321 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 8.17 తదుపరి దశమి; నక్షత్రం: రోహిణి ఉ. 9.24 తదుపరి మృగశిర; వర్జ్యం: మ.3.16-4.57; దుర్ముహూర్తం: సా.4.43-5.29; అమృతఘడియలు: శేషం.7.45, రా.1.20-3.01; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.45; సూర్యాస్తమయం: 6.15 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కారు, కమలం కలిస్తే..!

తెలంగాణలో 39 సీట్లు గెలుచుకొని ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో 151 సీట్లు గెలుచుకున్న వైసీపీ కూడా బీజేపీ అండ కోసం అల్లాడిపోవడం వర్తమాన రాజకీయాలను ఆశ్చర్యపరిచే పరిణామం.

గత పదేళ్లుగా అధికారం చెలాయించడానికి అలవాటుపడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఇమడలేకపోతున్నారు. అదే సమయంలో, రెండు మాసాల తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికల్లో గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు గెలుచుకోలేని పక్షంలో తమ భవిష్యత్తు ఏమిటి? అన్న బెంగ కూడా వారిని పట్టి పీడిస్తున్నది. దీంతో బీజేపీతో చేతులు కలిపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కట్టడి చేయాలని వారు కేసీఆర్ వద్ద మొరపెట్టుకుంటున్నారు. కమలం పార్టీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆలోచనను ప్రారంభంలో తిరస్కరించిన కేసీఆర్ ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు.



కొత్త పలుకు!

లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకొనే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలని, కుదిరితే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోసి, తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని బీజేపీకి చెందిన కొందరు ఆలోచన చేస్తున్నారు. ఆ పార్టీ కేంద్ర నాయకత్వం కూడా తెలంగాణపై దృష్టి పెట్టింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో బీజేపీకి లభించే సీట్లు, ఎన్డీయే బలం ఏ మేరకు పెరగనున్నదన్న దానిపై స్పష్టత వచ్చాక బీజేపీ పెద్దలు తెలంగాణలో తమ వ్యూహాన్ని అమలుచేసే అవకాశం ఉంది.

తెలంగాణలో బీఆర్‌ఎస్ అస్తిత్వం పోవాలని బీజేపీ కోరుకుంటోంది. అప్పుడు రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్-బీజేపీ మధ్య కేంద్రీకృతం అవుతాయి. కేసీఆర్‌కు కూడా ఈ విషయం తెలుసు. తన పార్టీ పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని ఆయన గ్రహించారు. అందుకే బీజేపీతో పొత్తు గురించి మాట్లాడే వారిని గట్టిగా నిరోధించలేక పోతున్నారు. కాకపోతే పొత్తులకు సంబంధించిన చాయిస్ తన చేతుల్లో లేదని ఆయనకు తెలుసు.

సీఎంగా రేవంత్ పనితీరుకు మంచి మార్కులే లభిస్తున్నప్పటికీ ఆయన ప్రభుత్వ స్థిరత్వంపై ఎవరి సందేహాలు వారికి ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత పరిస్థితి ఎలా ఉండబోతుందన్న దానిపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్-బీజేపీ-మజ్లిస్‌కు కలిపి 54 మంది శాసనసభ్యులు ఉన్నారు. ఆరుగురు కాంగ్రెస్ సభ్యులు పక్కచూపులు చూసినా ప్రభుత్వం పడిపోయే ప్రమాదం ఉంది.

బీఆర్‌ఎస్‌తో పొత్తు వద్దని ప్రస్తుతం భావిస్తున్న బీజేపీ కేంద్ర నాయకత్వం చివరి క్షణంలో మనసు మార్చుకుంటే మాత్రం రేవంత్‌కు కష్టాలు మొదలవుతాయి.

లోక్‌సభ ఎన్నికలు భారత రాష్ట్ర సమితికి మాత్రమే కాదు- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా పరీక్షగా నిలవబోతున్నాయి.

ఎన్నికల అనంతరం కేంద్రంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడితే ఎదురయ్యే సవాళ్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా కంటి మీద కునుకు లేకుండా చేస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో కొనసాగడం బీఆర్‌ఎస్‌కు మాత్రమే కాదు - బీజేపీకి కూడా ఇష్టం ఉండదు. ఈ కారణంగా గుర్రం ఎగరావచ్చు అన్నట్టుగా బీఆర్‌ఎస్-బీజేపీలు ఎన్నికల నాటికి చేతులు కలిపినా ఆశ్చర్యపోవాల్సింది లేదు. పొత్తు ప్రతిపాదనలను బీజేపీ కేంద్ర నాయకత్వం తిరస్కరిస్తున్నప్పటికీ బీఆర్‌ఎస్ మాత్రం తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. 4

ఎన్నికల్లో ఓటమి తర్వాత గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి ఎంతగా చెప్పినా ప్రజల చెవికెక్కదు. అధికారంలో ఉన్న వారి పనితీరునే ప్రజలు గమనిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు నాటి సీఎం కేసీఆర్ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనేక విధాలుగా వేధించారు. అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని ఇప్పుడు రేవంత్ రెడ్డి భావిస్తే ఉపయోగం ఉండదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి ఎగబాకడానికి కేసీఆర్ అదేపనిగా వేధించడం కూడా ఒక కారణం. గత పాలకుల పాపాలను ప్రజలు ఇట్టే మరచిపోతారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభకు రాకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఈ సమయంలో రేవంత్ రెడ్డి అండ్ కో దెప్పిపొడిచినంత మాత్రాన అదనంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదు. అధికారం తలకెక్కడం వల్లే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి. ఈ నేపథ్యంలో కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందా? ఉండదా? అని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచించుకోవాలి. ప్రస్తుతానికి లోక్‌సభ ఎన్నికల గండం దాటడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి కేంద్రీకరించడం మంచిది.

కాళేశ్వరం కళంకం!



తెలంగాణకు ప్రాజెక్టు వరప్రదాయని కాదు

- తుమ్మిడిహెట్టి వద్దే కట్టాలని ఇంజనీర్లు చెప్పారు.. మేడిగడ్డ బ్యారేజీ కేసీఆర్ పుర్రెలో పుట్టిన బుద్ధి
- మామా, అల్లుడు కలిసి రాష్ట్రానికి ద్రోహం చేశారు.. ఖజానాను దోచుకొనేందుకే దుర్మార్గానికి ఒడిగట్టారు
- ఎవరి ఒత్తిడితో సంతకం పెట్టారో హరీశ్‌రావు చెప్పాలి.. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీయే
- విభజన బిల్లు పెట్టినప్పుడు కేసీఆర్ ఎక్కడ?.. శ్వేతపత్రంపై చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



అన్నారం బ్యారేజీకి బుంగలు పడి వృథాగా పోతున్న నీరు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి వరప్రదాయని కాదు... తెలంగాణ సమాజానికి కళంకంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తుమ్మిడిహెట్టి వద్దే బ్యారేజీ కట్టాలని ఇంజనీర్లు చెప్పినా కేసీఆర్ వినలేదన్నారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టాలన్నది అప్పటి సీఎం పుర్రెలో పుట్టిన బుద్ధేనని చెప్పారు. మామా అల్లుడు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. దోచుకోవాలని, దాచుకోవాలనే ఆలోచనతోనే ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై సిటింగ్ లేదా రిటైర్డ్ జడ్జి విచారణకు వచ్చినప్పుడు ఎవరి ఒత్తిడి మేరకు ఈ పనులు చేశారో హరీశ్‌రావు చెప్పాల్సి ఉంటుందన్నారు. విచారణ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నీటి పారుదల రంగంపై తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో

మిగతా 13వ పేజీలో...

అన్నారంలోనూ లీకేజీ



- బ్యారేజీలో భారీ బుంగలు
- మేడిగడ్డ తరహాలో ఇదీ ప్రమాదంలో ఉంది 12
- కమీషన్లకు కక్కుర్తి పడ్డారు
- వందేళ్లు ఉండే బ్యారేజీలు మూడేళ్లకే కుంగాయి
- పంప్‌హౌస్‌లు, సబ్ స్టేషన్లు తప్ప నిర్మించిందేముంది?
- కాల్వలు నిర్మించాలన్న ఆలోచన లేకుండా పనులు
- ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- ఎన్‌డీఎస్‌ఏ, కాగ్ నివేదికల ప్రకారం చర్యలు: ఉత్తమ్

తెలంగాణను నట్టేట ముంచారు

- గత ప్రభుత్వానివి తప్పుడు విధానాలు.. నీటిపారుదల రంగంలో విధ్వంసక ధోరణి
- రూ.1.81 లక్షల కోట్ల ఖర్చు.. 15.81 లక్షల ఎకరాలకే నీళ్లు 12
- కాళేశ్వరంలో పంపులన్నీ తిప్పితే 220 మిలియన్ యూనిట్ల కరెంట్ కావాలి
- రాష్ట్ర వినియోగమే 196 మి.యూ.. నీటిపారుదల శాఖపై శ్వేతపత్రంలో ప్రభుత్వం

శ్వేతపత్రం కాదు.. తప్పుడు పత్రం

- ఇది గోబెల్స్ ప్రచారంలా ఉంది
- తప్పు ఎవరు చేసినా తప్పే.. బాధ్యులెవరైనా శిక్షించాలి
- మేడిగడ్డ కూలిపోవాలనే పునరుద్ధరణ పనులు జాప్యం
- కాంగ్రెస్ సర్కారులో కడెం, తాలిపేరు కొట్టుకుపోలేదా?
- దురదృష్టవశాత్తు ఇలాంటి ఘటనలు జరుగుతాయి
- కాగ్ నివేదికను కాంగ్రెస్ సీఎంలే కొట్టిపడేశారు కదా..
- మీ ప్రభుత్వాలే ఉన్నా ప్రాణహితకు అనుమతులు తేలేదే?
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సాగు నీటి రంగంపై ప్రభుత్వం ప్రవేశపెట్టింది శ్వేతపత్రం (వైట్ పేపర్) కాదని, తప్పుడు పత్రమని (ఫాల్స్ పేపర్) అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అభివర్ణించారు. ఇది ఎన్నికల ప్రచారంలో గోబెల్స్ ప్రచారంలాగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని సీఎం అన్నారని.. నాలుగు ఎంపీ సీట్ల కోసం భూతద్దం పెట్టి చూపించే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తమను ఇరికించబోయి సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారని.. గ్యారెంటీలు అమలు చేయలేక మేడిగడ్డ

మిగతా 12వ పేజీలో...



గఘన విజయం

- నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్14
- 18.46 నిమిషాల్లో విజయవంతంగా కక్ష్యలోకి ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహం
- ఇస్రోకు ఈ ఏడాది వరుసగా 2వ విజయం
- 'వాతావరణం'పై ఎప్పటికప్పుడు సమాచారం
- జూన్‌లో 'నిసార్' ప్రయోగం: సోమనాథ్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17: అంతరిక్ష రంగంలో మన శాస్త్రవేత్తలు సత్తా చాటారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మరో ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం చేపట్టిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగం విజయకేతనం ఎగురవేసింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 ఉపగ్రహ వాహకనౌక శనివారం సాయంత్రం 5.35 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో మిషన్ కంట్రోల్ సెంటర్‌లో రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న శాస్త్రవేత్తల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ ఏడాది ఇస్రో వరుసగా రెండో

మిగతా 2వ పేజీలో...

బాణసంచా కర్మాగారంలో పేలుడు

పది మంది మృతి

- మృతుల్లో నలుగురు మహిళలు
- మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- తమిళనాడులో ఘోర ప్రమాదం 2

ఔను.. రిగ్గింగ్ జరిగింది!

- చీఫ్ జస్టిస్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పాత్ర ఉంది
- ఓడిపోవాల్సిన 13మంది అభ్యర్థులను 'గెలిపించా..'
- దీనికి బాధ్యతగా ఉద్యోగం నుంచి వైదొలగుతున్నా
- రావల్పిండి చీఫ్ కమిషనర్ లియాఖత్ వెల్లడి
- ఇమ్రాన్ పార్టీ నిరసనల ముంగిట కీలక పరిణామం
- అవకతవకల ఆరోపణలను తోసిపుచ్చిన పాక్ ఈసీ
- ఐఎస్ఐతో ఇమ్రాన్ డీల్.. పీపీపీతో కలిసి ప్రభుత్వం? 2

బీజేపీలోకి కమల్‌నాథ్?

- తనయుడితో ఢిల్లీ చేరిన కాంగ్రెస్ ముఖ్యనేత
- రాజ్యసభ సీటు ఇవ్వకపోవడంపై తీవ్ర ఆగ్రహం
- బీజేపీలో చేరితే మీడియాకు చెబుతానని వ్యాఖ్య
- నకుల్‌నాథ్ ఎక్స్ ఖాతాలో 'కాంగ్రెస్' తొలగింపు

7



కేసీఆర్‌కు ఎర్రవల్లి ఎంపీటీసీ సభ్యురాలి శుభాకాంక్షలు

ఘనంగా కేసీఆర్ జన్మదినం

- ఆటోడ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలిచ్చిన కేటీఆర్
- కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్ శుభాకాంక్షలు

వరంగల్ మంత్రి పీఏపై వేటు!

- ఇటీవల భద్రాచలం వద్ద పట్టుకున్న ఇసుక లారీలను వదిలేయాలని అధికారులకు ఫోన్లు
- సర్కారు సీరియస్.. మంత్రి పీఏ సస్పెన్షన్
- మరో మంత్రి అనుచరుడిపైనా ఆరోపణలు
- రంగంలోకి ఇంటెలిజెన్స్.. సీఎంకు నివేదిక 14

370 నంబరు కాదు.. సెంటిమెంట్!

- శ్యామ ప్రసాద ముఖర్జీకి నివాళిగా 370 సీట్లు సాధిద్దాం
- ఆర్టికల్ 370 రద్దు కోసం ఆయన జీవితాన్నే త్యాగం చేశారు
- వచ్చే వంద రోజులపాటు పోలింగ్ బూత్‌లపైనే కార్యకర్తలు దృష్టి పెట్టాలి
- ప్రతి బూత్ నుంచి గతంలో కన్నా 370 ఓట్లు ఎక్కువ వచ్చేలా చూడాలి
- బీజేపీ జాతీయ సమావేశాల్లో పార్టీ శ్రేణులకు ప్రధాని మోదీ పిలుపు
- 11,500 మంది ప్రతినిధులు హాజరు
- మోదీ సర్కార్ హ్యాట్రిక్ పక్కా: నడ్డా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని నిర్దేశించుకున్న 370 సీట్లు.. ఒక సంఖ్య మాత్రమే కాదని, అదొక సెంటిమెంటు కూడా అని ప్రధాని మోదీ చెప్పారు. దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడే లక్ష్యంతో ఆర్టికల్ 370 రద్దు కోసం (జనసంఘ్ వ్యవస్థాపకుడు) శ్యామ ప్రసాద్ ముఖర్జీ తన జీవితాన్నే త్యాగం చేశారని, ఆయనకు నివాళిగా 370 సీట్లు గెలవాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఢిల్లీలో బీజేపీ జాతీయ సమావేశాల ప్రారంభానికి ముందు పార్టీ ఆఫీస్ బేరర్లను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. పార్టీ గుర్తయిన కమలం పువ్వే వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ పడుతుందని, దాని కోసం శక్తివంచన లేకుండా పని చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే 100 రోజుల్లో ప్రతి కార్యకర్త పోలింగ్ బూత్‌లపైనే దృష్టి పెట్టాలని, 2019లో వచ్చినదానికన్నా ఈసారి ప్రతి పోలింగ్ బూత్‌లో 370 ఓట్లు

మిగతా 2వ పేజీలో...

తమిళనాడులో పీచు మిఠాయిపై నిషేధం



చెన్నై, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ కారక పదార్థాలున్నట్లు నిర్ధారణ కావడంతో పీచు మిఠాయి విక్రయాలపై తమిళనాడు ప్రభుత్వం నిషేధం విధించింది. ఆహార భద్రతా శాఖ సిఫారసులతో ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల పుదుచ్చేరి బీచ్‌లో విక్రయిస్తున్న పీచు మిఠాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న అధికారులు.. వాటి శాంపిళ్లను పరిశోధనల కోసం ల్యాబ్‌కు పంపించారు. క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే 'రొడమైన్ బి' అనే రసాయనం కలుపుతున్నట్లు పరీక్షలో నిర్ధారణ అయింది. దీంతో, పీచు మిఠాయి విక్రయాలపై పుదుచ్చేరి ప్రభుత్వం తాత్కాలిక నిషేధం విధించింది. ఈ నేపథ్యంలోనే చెన్నై మెరీనా బీచ్‌లో విక్రయిస్తున్న పీచు మిఠాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న తమిళనాడు అధికారులు, వాటి నమూనాలను పరిశోధనలకు పంపగా అందులో కూడా 'రొడమైన్ బి' రసాయనం ఉన్నట్లు నిర్ధారణ అయింది.తమిళనాడులో పీచు మిఠాయి అమ్మకాలపై పూర్తిగా నిషేధం విధించారు.

బీజేపీలోకి కమల్‌నాథ్ జంప్?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కాంగ్రెస్ ముఖ్యనేత కమల్‌నాథ్ బీజేపీలో చేరే అవకాశం ఉంది. ఆయనతో పాటు తనయుడు, చింద్వారా ఎంపీ నకుల్‌నాథ్, మరో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరతారని సమాచారం. ప్రస్తుతం వీరంతా భోపాల్ నుంచి ఢిల్లీకి వచ్చారు. బీజేపీలో చేరే అవకాశాలను కమల్‌నాథ్ తోసిపుచ్చడం లేదు. అదే సమయంలో తాను మోదీని కానీ అమిత్‌షాను కానీ కలవలేదని స్పష్టం చేస్తున్నారు. విలేకరులు ఊహాగానాలు చేస్తున్నారని, చేరేది ఉంటే తప్పకుండా చెబుతానని కమల్‌నాథ్ స్పందించారు. నకుల్‌నాథ్ ఇప్పటికే తన ట్విటర్ ఖాతాలో కాంగ్రెస్ గుర్తును తొలగించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తన ట్విటర్ ఖాతాలో కమల్‌నాథ్, నకుల్‌నాథ్‌ల ఫోటో పెట్టి జైశ్రీరామ్ అని రాశారు. ఇటీవల రాజ్యసభ ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వకపోవడంపై కమల్‌నాథ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.

చిన్నయ్య జంగంకు రామానుజన్ అవార్డు

▸ గుర్రం జాషువా 'గబ్బిలం' కావ్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన చిన్నయ్య



సీటెల్, ఫిబ్రవరి 17: గుర్రం జాషువా రచించిన ప్రసిద్ధ కావ్యం 'గబ్బిలం'ను ఇంగ్లీషులోకి అనువదించిన చిన్నయ్య జంగం.. ఏకే రామానుజన్ అవార్డుకు ఎంపికయ్యారు. అసోసియేషన్ ఫర్ ఏషియన్ స్టడీస్ ఏటా ప్రదానం చేసే ఈ అవార్డును 2024కు గాను చిన్నయ్యను ఎంపిక చేసింది. మార్చి 16న అమెరికాలోకి సీటెల్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డుతోపాటు వెయ్యి డాలర్ల(సుమారు రూ.83 వేల) నగదు పురస్కారం కూడా చిన్నయ్యకు అందజేయనున్నారు. సమాజంలో ఆనాడు దళితులు ఎదుర్కొంటున్న వివక్ష ప్రధానాంశంగా 1941లో గుర్రం జాషువా 'గబ్బిలం'ను రచించారు. ఆనాటి పరిస్థితులకు అద్దం పట్టే ఈ కావ్యాన్ని నేటి ఇంగ్లీష మీడియం తరం దరికి చేర్చేలా చిన్నయ్య ఇంగ్లీషులోకి అనువదించారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం: సీఈసీ రాజీవ్‌కుమార్

భువనేశ్వర్, ఫిబ్రవరి 17: దేశంలో లోక్‌సభ ఎన్నికలతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంసిద్ధంగా ఉన్నామని కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈసీ) రాజీవ్‌కుమార్ తెలిపారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోసం ఏర్పాట్లన్నీ దాదాపుగా పూర్తి చేశామని తెలిపారు. ఒడిశాలోని 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో మొత్తం 37,809 పోలింగ్ కేంద్రాలుండగా, 22,685 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కేరళ పాఠశాలల్లో ఇక నుంచి 'వాటర్ బ్రేక్'

తిరువనంతపురం, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో 'వాటర్ బ్రేక్' అమలు చేయాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం పాఠశాలల్లో ఉదయం 10.30, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండుసార్లు వాటర్ బెల్ మోగించి, విద్యార్థులు నీరు తాగేందుకు 5 నిమిషాల చొప్పున విరామం ఇవ్వనున్నట్లు కేరళ విద్యాశాఖ తెలిపింది. ఈ నెల 20 నుంచి ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. 2019లో మొదటిసారిగా కేరళలోని ఈ విధానాన్ని అమలు చేశారు.

'ఎమ్మెస్పీ'పై కమిటీ.. కేంద్రప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కు చట్టబద్ధత కల్పించాలంటూ రైతులు ఆందోళనకు దిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్చించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ప్రభుత్వ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన చేయనున్నట్లు తెలుస్తోంది. కమిటీలో సభ్యుల పేర్లను కూడా రైతు సంఘాలే సూచించాలని కేంద్రం కోరనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, ఆదివారం కేంద్ర మంత్రులు రైతు సంఘాల నేతలతో నాలుగో విడత చర్చలు జరపనున్నారు. రైతులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 21న యూపీ, హరియాణా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ధర్నా చేయనున్నట్లు టికాయత్ చెప్పారు.

సర్కారు, కోర్టుల మధ్య కాస్త ఘర్షణ మంచిదే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థల మధ్య కాస్త ఘర్షణ ఉండడం మంచిదేనని, అది ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కౌల్ అన్నారు. వివిధ వ్యవస్థల మధ్య సమతౌల్యం ఉండాలన్న రాజ్యాంగ లక్ష్య సాధనకు ఇలాంటి ఘర్షణ ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ఘర్షణ ముదిరితే మాత్రం ప్రమాదమని అన్నారు. 17వ లోక్‌సభ కాలంలో ఉత్తమ సేవలు అందించిన పార్లమెంటు సభ్యులకు సన్సద్ రత్న అవార్డులను శనివారం ఇక్కడ బహూకరించిన సందర్భంగా ఏర్పాటయిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. చెన్నైకు చెందిన ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ అవార్డులను నెలకొల్పింది. ఈ ఏడాదికి గాను మొత్తం 12 మందికి వీటిని ప్రకటించింది.

సుపీరియర్లకు నేరుగా విన్నవించారని సర్వీసు నుంచి తొలగించలేరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: తన సమస్యపై నేరుగా ఉన్నతాధికారులకు వినతి పత్రం పంపించారన్న కారణం చూపి ప్రభుత్వ ఉద్యోగిని విధుల నుంచి తొలగించలేరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్థికపరమైన ఇక్కట్లు ఎదురైనప్పుడు తొలుత తనపై ఉండే అధికారులకు కాకుండా నేరుగా సుపీరియర్ అధికారులకు వినతి పత్రం సమర్పించడం సహజమేనని తెలిపింది. దాన్ని క్రమశిక్షణ రాహిత్యంగా పరిగణించి ఉద్యోగం నుంచి తీసివేయలేరని పేర్కొంది. జిల్లా కోర్టులో పనిచేస్తున్న ఉద్యోగిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఛత్రపాల్ అనేవ్యక్తి శాశ్వత ప్రాతిపదికన ఆర్డర్లీగా నియమితులయ్యారు. తర్వాత నజరత్ విభాగానికి ప్రాసెస్ సర్వర్‌గా బదిలీ అయ్యారు. మొదటిదాని కన్నా ఇది పెద్ద పోస్టే అయినప్పటికీ అంతకుతగ్గ జీతం రాకపోవడంతో నేరుగా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు పంపించారు. ఇది క్రమశిక్షణరాహిత్యమేనని భావించి 2003లో సంబంధిత అధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.

మెదడు క్యాన్సర్ మెడలు వంచాడు!

▸ చరిత్ర సృష్టించిన 13 ఏళ్ల బెల్జియం బాలుడు లూకాస్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: వైద్య చరిత్రలోనే అద్భుతం. బెల్జియం దేశానికి చెందిన 13ఏళ్ల చిన్నారి లూకాస్ అరుదైన బ్రెయిన్ క్యాన్సర్‌ను జయించాడు. ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన డిఫ్యూజ్ ఇంట్రిన్సిక్ పాంటిన్ గ్లియోమా(డీఐపీజీ) వ్యాధిని ఓడించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. దాదాపు ఏడేళ్లపాటు చికిత్స తర్వాత లూకాస్ మెదడులో క్యాన్సర్ కణితి జాడ లేకుండాపోయింది. ఈ విషయాన్ని అతనికి చికిత్స అందించిన వైద్యనిపుణులు ధ్రువీకరించారు. డీఐపీజీ నివారణలో వాడే ఔషధాల పరీక్షకు ఫ్రాన్స్‌లో ఇటీవల బయోమెడ్ ట్రయల్ నిర్వహించారు. దీనిలో భాగంగా తనపై ప్రయోగించిన ఎవెరోలిమస్ డ్రగ్‌కు లూకాస్ శరీరం సానుకూలంగా స్పందించింది. అతడి మెదడులోని కణితి పూర్తిగా మాయమైపోయింది.

గ'ఘన' విజయం



నింగిలోకి దూసుకెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్

(మొదటి పేజీ తరువాయి)

విజయాన్ని సొంతం చేసుకొన్నట్లయింది. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ రైతులకు విలువైన సమాచారం అందించేందుకు ఉద్దేశించిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగాన్ని ఇస్రో చేపట్టింది. ఈ ఏడాది ఇది రెండో ప్రయోగం కాగా జీఎస్ఎల్వీ-మార్క్2 ప్రయోగాల్లో 16వది కావడం గమనార్హం. శుక్రవారం మధ్నాహ్నం 2.05 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించి 27.30 గంటల కౌంటౌడౌన్ కొనసాగిన తరువాత శనివారం సాయంత్రం 5.35 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ నింగిలోకి పయనమైంది. 18.46 నిమిషాల పాటు సాగిన ప్రక్రియను మూడు దశల్లో పూర్తి చేశారు. రాకెట్ తన మూడు దశలను సునాయాసంగా పూర్తి చేసుకొన్న తరువాత శిఖర భాగాన ఉన్న 2,275 కిలోల బరువు గల ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ప్రస్తుతం సేవలందిస్తున్న ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్‌లకు కొనసాగింపుగా ఇన్‌శాట్-3డీఎస్ వాతావరణ సేవలను మెరుగుపరచనుంది. ప్రయోగం విజయవంతమైన అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ మాట్లాడారు. ఇస్రోకు ఇది అద్భుత విజయమని పేర్కొన్నారు. రాకెట్‌లో అన్ని దశలు అనుకొన్న ప్రకారం పనిచేసి నిర్దేశిత సమయంలో కక్ష్యలోకి విజయవంతంగా చేర్చామని ప్రకటించారు. జూన్‌లో జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఇస్రో, నాసా సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహ ప్రయోగం ఉంటుందని సోమనాథ్ తెలిపారు.

ఉపయోగాలు ఎన్నెన్నో...

ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగంతో మెరుగైన వాతావరణ సమాచారం అందుతుంది. ఇది భూమి, సముద్ర ఉపరితలాలను నిరంతరాయంగా పరిశీలిస్తుంది. ఈ ఉపగ్రహంలో పొందుపరిచిన అత్యాధునిక పేలోడ్ సాయంతో ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని వెంటనే తెలుసుకోవచ్చు. ఇన్‌శాట్-3డీఎస్ మూడో తరం వాతావరణ ఉపగ్రహానికి తదుపరి మిషన్‌గా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వాతావరణ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయడం

విపత్తు హెచ్చరికలు నిమిషాల వ్యవధిలోనే అందుబాటులోకి రావడం

భూమి, సముద్ర ఉపరితలాలను నిరంతరాయంగా పర్యవేక్షించడం

వాతావరణంలోని వివిధ పరిస్థితుల ప్రొఫైల్‌ను అత్యంత వేగంగా అందించడం

ఇవీ ప్రత్యేకతలు...

జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ పొడవు 51.7 మీటర్లు

ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహం బరువు 2,275 కిలోలు

ప్రయోగానికి అయిన ఖర్చు రూ.500 కోట్లకు పైగా

దాదాపు పదేళ్ల పాటు సేవలు అందించేలా రూపకల్పన

సమష్టి విజయం: ఇస్రో ఛైర్మన్

ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగ విజయం శాస్త్రవేత్తల సమష్టి విజయమని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ అన్నారు. ప్రయోగానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది ఇస్రో వరుసగా రెండో విజయాన్ని అందుకోవడంలో శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందని చెప్పారు. ఈ విజయంతో దేశం నలుమూలల జరిగే వాతావరణ మార్పులపై కచ్చితమైన సమాచారాన్ని అందుకోవచ్చని వివరించారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు పవన్ అభినందనలు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిశోధనలకు దోహదపడే ఆధునాతన ఉపగ్రహాన్ని విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ విజయం భారతదేశానికి మరో గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. అంతరిక్ష యువనికపై భారత జైత్రయాత్ర కొనసాగించాలని, మరిన్ని ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

370 నంబరు కాదు.. సెంటిమెంట్!



(మొదటి పేజీ తరువాయి)

అధికంగా వచ్చేలా కృషి చేయాలన్నారు. బీజేపీ 370 సీట్లను, ఎన్‌డీఏ కూటమి 400 సీట్లను గెల్చుకుంటుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రతిపక్షాలు అనవసర, భావోద్వేగపూరిత అంశాలను లేవనెత్తుతాయని కానీ వాటి వలలో పడవద్దని బీజేపీ నేతలు, కార్యకర్తలకు ప్రధాని సూచించారు. దేశంలో జరిగిన అభివృద్ధి, ప్రజానుకూల విధానాలు, ప్రపంచంలో భారత్‌కు పెరుగుతున్న కీర్తి ప్రతిష్ఠలు.. ఈ అంశాల గురించే మాట్లాడాలని చెప్పారు. ఇప్పుడున్నదంతా 'ఆరోప్ ముక్త్, వికాస్ యుక్త్' (ఆరోపణలే లేని అభివృద్ధి విధానాల) కాలమని మోదీ పేర్కొన్నారు. ప్రధాని ప్రసంగం వివరాలను బీజేపీ నేత వినోద్ తావ్డే విలేకర్లకు వెల్లడించారు. భారత్ మండపంలో రెండు రోజులపాటు బీజేపీ జాతీయ సమావేశం జరగనుంది. 11,500 మంది పార్టీ ప్రతినిధులు పాల్గొంటున్నారు. సదస్సును ప్రారంభిస్తూ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రసంగిస్తూ.. వరుసగా మూడోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి రానుందన్నారు. దక్షిణాదిలో బీజేపీకి పట్టు లేదన్న వాదన వాస్తవం కాదని, ఆ ప్రాంతంలో కాంగ్రెస్‌కు 28 లోక్‌సభ ఎంపీలు, ఏడుగురు రాజ్యసభ ఎంపీలు ఉంటే బీజేపీకి 29 మంది లోక్‌సభ ఎంపీలు, 8 మంది రాజ్యసభ ఎంపీలున్నారన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయిన 161 సీట్లలో దాదాపు ఏడాదిన్నరగా పార్టీ నేతలు 430 సార్లు పర్యటించారని, ప్రతి కేంద్ర మంత్రీ ఒక్కో ఓడిపోయిన సీటులో 3 సార్లు పర్యటించారని.. ఈ సీట్లు కూడా గెలుచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జాతీయ సమావేశంలో మొదటిరోజు వికసిత్ భారత్, మోదీకీగ్యారంటీ, ఫిర్ ఏక్ బార్ మోదీసర్కార్ అనే అంశాలపై చర్చలు జరిగాయి. ఈ మేరకు రాజకీయ తీర్మానాన్ని ఆమోదించారు. రామాలయ నిర్మాణం సాకారం కావడమే కాదు.. దేశంలో రామరాజ్యమే ఏర్పడిందని తీర్మానంలో పేర్కొనడం విశేషం.

ఒక్కో కార్యకర్తకు 20 లబ్ధిదారుల కుటుంబాల బాధ్యత

కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను బీజేపీ కార్యకర్తలు కలిసే కార్యక్రమం ఇప్పటికే కొనసాగుతుండగా.. ఎన్నికల దృష్ట్యా దీనిని మరింత వేగవంతం చేయాలని బీజేపీ అధిష్ఠానం నిర్ణయించింది. ఈ మేరకు కార్యకర్తలకు ఈ నెల 24 వరకూ శిక్షణ ఇచ్చి దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల వివరాలు అందజేస్తారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 5వ తేదీ వరకూ ఒక్కో కార్యకర్త బూత్ స్థాయిలో 20 లబ్ధిదారుల కుటుంబాలను కలుస్తారు. పోలింగ్ జరిగే రోజు వరకూ వారితో నిత్యం అందుబాటులో ఉంటారు. లబ్ధిదారుల అభిప్రాయాలను కార్యకర్తలు సేకరించి పార్టీకి ఎప్పటికప్పుడు అందజేస్తారు. వీటి ఆధారంగా పార్టీ నాయకత్వం ఎన్నికల వ్యూహాలను రూపొందించుకుంటుంది. ఈ మొత్తం కార్యక్రమాన్ని బీజేపీ ప్రధాన కార్యదర్శి సునిల్ బన్సల్ నేతృత్వంలోని 17 మంది సభ్యుల జాతీయ కమిటీ పర్యవేక్షిస్తుంది.

లోకం తీరు



బాణసంచా పేలుడుకు పదిమంది బలి

తమిళనాడులోని విరుదునగర్‌లో ప్రమాదం

చెన్నై, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని విరుదునగర్ జిల్లా ఆలంకుళంలోని బాణసంచా కర్మాగారంలో శనివారం భారీ పేలుడు సంభవించి నలుగురు మహిళలు సహ పదిమంది కార్మికులు దుర్మరణం చెందారు. మరో ఎనిమిదిమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. శివకాశి కార్పేశన్ ప్రాంతానికి చెందిన విఘ్నేష్ అనే వ్యక్తి నడుపుతున్న ఆ కర్మాగారంలో రోజుకు 150 మందికి పైగా కార్మికులు చేస్తుంటారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఓ గదిలో ఫ్యాన్సీరకం టపాసులకు కార్మికులు పేలుడు మందును కలుపుతుండగా ఉన్నట్టుండి నిప్పురవ్వలు వెలువడి గదిలో ఉన్న టపాసులపై పడ్డాయి. దీంతో అక్కడున్న బాణసంచా మొత్తం పెద్ద శబ్దంతో పేలిపోవడంతో ఆ గదితో పాటు పక్కనే ఉన్న మరో మూడు గదులు కూడా కుప్పకూలాయి. దుర్ఘటనపై ప్రధాని మోదీ, తమిళనాడు సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబీకులకు స్టాలిన్ రూ.3లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.లక్ష చొప్పున సాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు మోదీ రూ.2లక్షల చొప్పున సాయం ప్రకటించారు.

వృత్తి నిపుణులకు యూకే చాన్స్

లండన్, ఫిబ్రవరి 17: యూకే హోం కార్యాలయం భారతీయ యువ వృత్తి నిపుణుల పథకం కింద కొత్త బ్యాలెట్‌ను ప్రకటించింది. ఈ పథకం కింద మొత్తం 3వేల మందికి యూకే వెళ్లడానికి అవకాశం లభిస్తుంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈ పథకానికి అర్హులు. దరఖాస్తుదారులు తమ బ్యాంకు ఖాతాలో కనిష్ఠంగా 2,530 బ్రిటీష్ పౌండ్లు కలిగి ఉండాలి. వయస్సు 18-30 ఏళ్లలోపు ఉండాలి. ఆసక్తి కలవారు ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 2.30 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఈసారి బీజేపీ ఓడిపోకపోవచ్చు! కానీ, 2029లో మాత్రం రానివ్వం

▸ వాళ్లకి మేమే పెద్ద సవాల్.. అందుకే అన్ని వైపుల నుంచీ దాడి: కేజ్రీవాల్

▸ రాష్ట్ర అసెంబ్లీలో విశ్వాస తీర్మానం.. మూజువాణి ఓటుతో నెగ్గిన సర్కార్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: "2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోకపోతే.. ఓడిపోక పోవచ్చు. కానీ, 2029లో మాత్రం ఆ పార్టీని అధికారంలోకి రాకుండా మేం అడ్డుకుంటాం" అని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విశ్వాస తీర్మానంపై శనివారం ఆయన మాట్లాడారు. బీజేపీకి తాము పెద్ద సవాల్‌గా మారామని, అందుకే అన్ని వైపుల నుంచి తమపై దాడి చేస్తోందని అన్నారు. "బీజేపీ ప్రస్తుతం ఎవరి గురించైనా భయపడుతోందంటే.. అది ఆప్ గురించే" అని వ్యాఖ్యానించారు. ఆప్ ఎమ్మెల్యేలను బీజేపీ వశపరుచుకుంటోందని, తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకే కమలనాథులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన, సభలో సంపూర్ణ మెజారిటీ ఉన్నప్పటికీ విశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. దీనిని మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. ఓటింగ్ నిర్వహించిన సమయంలో 62 మంది ఆప్ ఎమ్మెల్యేలో 54 మంది సభకు హాజరయ్యారు. దీంతో విశ్వాస తీర్మానం సునాయాసంగా విజయం సాధించింది. అనంతరం కేజ్రీవాల్ మాట్లాడుతూ.. "మాకు మెజారిటీ ఉంది. అయినా.. బీజేపీ కుయుక్తులను తిప్పికొట్టాలనే ఉద్దేశంతోనే విశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సిన అవసరం వచ్చింది" అని తెలిపారు. ఆప్ ఎమ్మెల్యేలు ఎవరూ ఫిరాయించలేదన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు జైల్లో ఉన్నారని, మరికొందరికి ఆరోగ్యం బాగోలేదని, ఇంకొందరు ప్రస్తుతం ఢిల్లీలో అందుబాటులో లేరని సీఎం వెల్లడించారు. "వాళ్లు రామభక్తులమని ప్రకటించుకుంటారు. కానీ, పేదలకు ఉచితంగా ఇచ్చే మందులను అడ్డుకుంటున్నారు. పేదలకు మందులు పంపిణీ చేయకుండా అడ్డుకోవాలని ఆ రాముడు వీరిని కోరాడా?" అని ప్రశ్నించారు. కాగా, ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరయ్యారు. నిజానికి ఆయన స్వయంగా కోర్టుకు రావాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు, విశ్వాస తీర్మానంపై చర్చను కారణాలుగా చూపించి కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కాలేనని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. దీంతో కోర్టు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యేందుకు అనుమతి ఇచ్చింది.

ఔను.. రిగ్గింగ్ జరిగింది!



ఓడిపోవాల్సిన 13మందిని 'గెలిపించా..'

▸ రావల్పిండి చీఫ్ కమిషనర్ లియాఖత్ వెల్లడి

ఇస్లామాబాద్, లాహోర్, ఫిబ్రవరి 17: రాజకీయ అస్థిరతకు పేరుగాంచిన పాకిస్థాన్‌లో మరో కలకలం. ఇటీవలి ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ రావల్పిండి డివిజన్ చీఫ్ కమిషనర్ లియాఖత్ అలీ ఛత్తా బాంబు పేల్చారు. ఇందులో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ఖాజీ ఫయాజ్ ఐసా, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సికిందర్ రజా పూర్తిస్థాయి పాత్ర పోషించారని ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమాలకు నిరసనగా ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ ఆందోళనలకు పిలుపునిచ్చిన సమయంలోనే ఇలా జరగం గమనార్హం. శనివారం ఉద్యోగానికి రాజీనామా అనంతరం రావల్పిండి క్రికెట్ స్టేడియంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ వివరాలు వెల్లడించారు. పాక్‌లో ఈ నెల 8న ఎన్నికల్లో లియాఖత్ పోలింగ్ అధికారిగా వ్యవహరించారు. కౌంటింగ్ సందర్భంగా.. తమ రీజియన్‌లో ఓటమి దిశగా ఉన్న 13 మంది అభ్యర్థులను ఒక్కొక్కరు 50 వేల ఓట్ల మెజారిటీతో గెలిచినట్లు ప్రకటించామని తెలిపారు. దేశానికి ద్రోహం చేశానని.. మనశ్శాంతిగా ఉండలేనని వ్యాఖ్యానించారు. విధి నిర్వహణలో భరించలేనంత ఒత్తిడిని ఎదుర్కొన్నానని.. అక్రమాలకు బాధ్యతగా ఉద్యోగం నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఆత్మహత్య ఆలోచన కూడా వచ్చిందని.. వాస్తవాలు తెలియజేయాలనే మీడియా ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. అనంతరం లియాఖత్‌ను పోలీసులు అరెస్టు చేసి గుర్తుతెలియని ప్రదేశానికి తరలించారు. ఛత్తా వ్యాఖ్యలను పాక్ ఎన్నికల సంఘం ఖండించింది. విచారణ జరుపుతామని తెలిపింది.

మా సీట్లు దోచుకున్నారు: ఇమ్రాన్

లియాఖత్ ఆరోపణలపై ఇమ్రాన్ ట్వీట్ చేశారు. తాము గెలవాల్సిన సీట్లను దోచుకున్నారని ఆరోపించారు. ఒక్క రావల్పిండిలోనే 13 సీట్లను కోల్పోయామన్నారు. దేశమంతా ఇంకెన్ని అక్రమాలు జరిగాయో అని పేర్కొన్నారు.

ఆంక్షలు.. అరెస్టులు

"రికార్డు స్థాయిలో రిగ్గింగ్" అంటూ ఎన్నికల ఫలితాలపై ఇమ్రాన్ పార్టీ ఆందోళనలకు పిలుపునివ్వడంతో శనివారం పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో కఠిన ఆంక్షలు విధించారు. దేశంలోనూ నిరసనలకు దిగిన నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. పార్లమెంటులో ప్రతిపక్షంలో కూర్చోవాలని పీటీఐ నిర్ణయించినా.. జైలులో ఉన్న ఇమ్రాన్‌ను పాక్ నిఘా సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) ప్రతినిధి కలిసినట్లుగా కథనాలు వస్తున్నాయి. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)తో కలిసి పీటీఐ సర్కారు ఏర్పాటు దీని వెనుక ఉద్దేశమని పేర్కొంటున్నారు. పీటీఐ నిరసనలను ఎదుర్కొంటూ అధికారంలో కొనసాగడం కష్టమనే భావనలో నవాజ్ ఉన్నట్లు చెబుతున్నారు. అంతర్జాతీయ ఒత్తిడిని తట్టుకోవడమూ అసాధ్యమని.. దీనికంటే ప్రతిపక్షంలో ఉండడమే మేలన్నది ఆయన ఆలోచనగా తెలుస్తోంది. కాగా, పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం మరింత పతనమైంది. ఆసియా, ఆస్ట్రేలియా ప్రాంతానికి సంబంధించి ఈఐయూ(ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్) రూపొందించిన ప్రజాస్వామ్య సూచీ-2023లో పాకిస్తాన్ 11 స్థానాలు దిగజారి 118వ స్థానానికి పడిపోయింది. ప్రజాస్వామ్య స్కోరు పరంగా 0.88 పాయింట్లు కోల్పోయి 3.25 పాయింట్లకు పాకిస్థాన్ పడిపోయింది.

గుల్జార్, రామభద్రాచార్యలకు జ్ఞానపీఠ్



జ్యూరీ సమావేశంలో కృష్ణారావు తదితరులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఉర్దూ కవి, పాటల రచయిత గుల్జార్, సంస్కృత పండితుడు, చిత్రకూట్‌లోని తులసీపీఠ్ వ్యవస్థాపకుడు జగద్గురు రామభద్రాచార్య 2023 సంవత్సరానికి జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రముఖ ఒడియా రచయిత్రి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత ప్రతిభా రే అధ్యక్షతన 11 మంది సాహితీవేత్తలతో కూడిన ఎంపిక కమిటీ ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకొని శనివారం ప్రకటించింది. గుల్జార్, రామభద్రాచార్య.. తమ తమ రంగాల్లో అసాధారణమైన సాహితీ సేవ చేశారని ఎంపిక కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. 'సినీరంగంలో సుదీర్ఘ ప్రయాణంతోపాటు, కవిత్వంలో మూడు లైన్లతో కూడిన త్రివేణి అనే కొత్త రూపాన్ని గుల్జార్ సృష్టించారు' అని పేర్కొంది.

శ్రోతలకు వీనులవిందు ఆయన పాటలు

గుల్జార్ అసలు పేరు సంపూరణ్ సింగ్ కల్రా. ఆయన వయసు 89 ఏళ్లు. సమకాలీన చరిత్రలో అత్యుత్తమ ఉర్దూ కవుల్లో ఆయన ఒకరు. హిందీ సినిమాల్లో ఆయన రాసిన పాటలు అనేకం విశేష ఆదరణ పొందాయి. పంజాబీతోపాటు పలు ఇతర భాషల్లోనూ ఆయన రచనలు చేశారు. 2002లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం, 2004లో పద్మభూషణ్, 2013లో దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాలు ఆయనకు లభించాయి. కనీసం ఐదు జాతీయ ఫిల్మ్ అవార్డులు గుల్జార్ రచనలకు దక్కాయి. 2009లో ఆస్కార్ పురస్కారం పొందిన స్లమ్‌డాగ్ మిలియనీర్ సినిమాలో జై హో అనే పాట గుల్జార్ కలం నుంచి జాలు వారిందే. కాగా, 1944లో జ్ఞానపీఠ్ పురస్కారాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ప్రకటించినది 58వ పురస్కారం. అవార్డు కింద గ్రహీతకు రూ.21 లక్షల నగదు, వాగ్దేవి విగ్రహం, సన్మానపత్రం అందజేస్తారు. సంస్కృత భాషకు జ్ఞానపీఠ్ లభించటం రెండోసారి కాగా, ఉర్దూకు ఇది ఐదోసారి.

గంటలో 100 సంస్కృత పద్యాలు

రామానంద సంప్రదాయానికి చెందిన నలుగురు జగద్గురు రామానందచార్యులలో రామభద్రాచార్య ఒకరు. 1982 నుంచి ఆయన జగద్గురుగా ఉన్నారు. ఆయన అసలు పేరు గిరిధర్ మిశ్రా. వయసు 74 ఏళ్లు. రెండు నెలల పసితనంలోనే అనారోగ్యంతో కంటి చూపు కోల్పోయినప్పటికీ సంస్కృతంలో అపారమైన పాండిత్యం సంపాదించారు. ఆయన 22 భాషల్లో మాట్లాడగలరు. సంస్కృతంతోపాటు హిందీ, అవధ్, మైథిలీ తదితర భాషల్లో అనేక కవితలు, రచనలు చేశారు. రామభద్రాచార్య గంటకు 100కు పైగా సంస్కృత పద్యాలను రచించగలరని, ప్రస్తుత కాలంలో సంస్కృత పాండిత్యానికి సంబంధించి ఆయనకు దరిదాపుల్లో ఎవరూ లేరని జ్ఞానపీఠ్ కోసం ఆయన పేరు ప్రతిపాదించిన న్యాయనిర్ణేతలు భావించారు.

జ్యూరీలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి, కవి కృష్ణారావు

జ్ఞానపీఠ్ జ్యూరీలో ప్రతిభా రేతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్, కొంకణి రచయిత దామోదర్ మౌజో, బెంగాలీ రచయిత సురంజన్ దాస్, కన్నడ రచయిత పురుషోత్తమ్ బిలిమలే, మరాఠీ కవి ప్రఫుల్ షిలేదార్, మలయాళీ రచయిత ప్రభావర్మ, హిందీ రచయితలు హరీశ్ త్రివేది, మధుసూధన్ ఆనంద్, జానకీ ప్రసాద్ శర్మతో పాటు తెలుగు కవి, ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో చీఫ్ ఎ.కృష్ణారావు ఉన్నారు.

3వేల కోట్ల ఫైన్

▸ ట్రంప్‌నకు విధించిన న్యూయార్క్ కోర్టు



న్యూయార్క్, ఫిబ్రవరి 17: రానున్న ఎన్నికల్లో మళ్లీ పోటీ చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తన రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని మూసివేయాల్సి వస్తుందా అన్న పరిస్థితి ఎదురయింది. ఆస్తుల విషయంలో బ్యాంకులు, బీమా కంపెనీలు, ఇతరులతో అబద్ధం చెప్పినందుకు తప్పు పట్టి 355 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,000 కోట్లు) జరిమానా విధించింది. వడ్డీతో కలుపుకొంటే 450 మిలియన్ డాలర్లు (సుమారు 4,000 కోట్లు) చెల్లించాల్సి ఉంటుంది. చెల్లింపు ఆలస్యమయ్యే కొలది వడ్డీ భారం కూడా పెరగనుంది. ఆస్తుల విలువను ఎక్కువగా చూపించి ఏళ్ల తరబడి బ్యాంకుల నుంచి రుణాలు పొందారని ఆరోపిస్తూ న్యూయార్క్ కోర్టులో అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ కేసు పెట్టారు. దీనిపై జడ్జి ఆర్థర్ ఎన్‌గోరన్ విచారణ జరిపారు. ఆర్థిక సంస్థలను మోసగించే ప్రయత్నాలు చేశారంటూ ట్రంప్‌తో పాటు, ఆయన ఇద్దరు కుమారులు, కంపెనీ ఎగ్జిక్యూటివ్స్‌ను తప్పుపట్టింది. ట్రంప్ ఆర్గనైజేషన్‌లో సంపూర్ణంగా మార్పులు చేయాలని ఆదేశించింది. ఆ సంస్థ కార్యకలాపాలపై ఆంక్షలు విధించింది.

పైసా ఖర్చులేని దర్శనం మేడారంలోనే

» ఈసారి అత్యధికంగా 6వేల ఆర్టీసీ బస్సులు: సీతక్క

» మేడారంలో ఆర్టీసీ బేస్‌క్యాంపును ప్రారంభించిన మంత్రి



ములుగు, ఫిబ్రవరి 17: నయా పైసా ఖర్చు లేని దర్శనం ఒక్క మేడారంలోనే సాధ్యం అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో శనివారం ఆమె పర్యటించారు. సమ్మక్క, సారలమ్మ మహాజాతర కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసిన బేస్‌క్యాంపును మంత్రి ప్రారంభించారు. మేడారంలో 55 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్టాండును, టికెట్ కౌంటర్లు, విశ్రాంతి గదులను ఏర్పాటు చేశామని, ఈసారి అత్యధికంగా 6 వేల బస్సులు నడిపిస్తున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో భక్తులకు వైద్య సౌకర్యాలపై మంత్రి సమీక్షించారు. 40 బైక్ అంబులెన్స్‌లను ప్రారంభించారు. 50 పడకల తాత్కాలిక ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిందని, 24 గంటలు మెరుగైన అత్యవసర వైద్యసేవలను అందిస్తామని మంత్రి చెప్పారు. కాగా మేడారం జాతర నిర్వహణ కోసం ఐదుగురు ఐఏఎస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మేడారం జాతర ప్రత్యేకాధికారిగా పనిచేసిన అనుభవం ఉన్న ఆర్వీ కర్ణన్‌ను.. ములుగు కలెక్టర్‌గా రెండు మహాజాతరలు నిర్వహించిన అనుభవం ఉన్న ఎస్.కృష్ణ ఆదిత్యను.. గతంలో ములుగు అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ఆదర్శ్ సురభిని.. హనుమకొండ, రంగారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, ప్రతిమాసింగ్‌ను నియమించారు. శనివారం వారు మేడారం వచ్చి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 3 లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నారు. ఆదివారం నుంచి ఆర్టీసీ పూర్తిస్థాయిలో సర్వీసులను అందుబాటులోకి తేనుండగా ప్రస్తుతం ఆయా డిపోల నుంచి వందలాది ప్రత్యేక బస్సులు మేడారానికి నడుస్తున్నాయి. దేవాదాయ శాఖ అధికారులు మేడారంలో హుండీలను ఏర్పాటు చేస్తున్నారు.


మేడారంలో తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మేడారం జాతరకు 30 ప్రత్యేక రైళ్లు!

» 21 నుంచి 25 వరకు రాకపోకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు వెళ్లి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల నుంచి 30 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు సికింద్రాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్-వరంగల్ మధ్య 10 రైళ్లు, సిర్పూర్‌కాగజ్‌నగర్-వరంగల్‌లమధ్య 8 రైళ్లు, నిజామాబాద్-వరంగల్ మధ్య 8, ఆదిలాబాద్-వరంగల్ మధ్య 2, ఖమ్మం-వరంగల్ మధ్య 2 రైళ్లను నడుపుతున్నట్లు పేర్కొన్నారు.

సీబీఐ దర్యాప్తుతో కేసీఆర్ సేఫ్

» అందుకు ఎత్తులు వేస్తున్న బీజేపీ : సీపీఐ నేత నారాయణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌ను కాపాడేందుకే కాళేశ్వరం అవినీతిపై బీజేపీ కుటిల బుద్ధితో సీబీఐ దర్యాప్తును కోరుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. కేసీఆర్ అవినీతిపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తే కేసీఆర్ సేఫ్ అవుతారని అన్నారు. శనివారం ఇక్కడ తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య సయోధ్య ఉందని, అందువల్లే లిక్కర్ స్కాంలో కవిత జైలుకెళ్లలేదని ఆరోపించారు. గత రెండేళ్లుగా కవితను ఎందుకు అరెస్టు చేయలేదని బీజేపీ నేతలను ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు సీబీఐ దర్యాప్తు వేయలేకపోయారని నిలదీశారు. కేసీఆర్ జుట్టును తమ చేతిలో పెట్టుకోవాలని బీజేపీ చూస్తోందన్నారు. రూ. 100 కోట్ల లిక్కర్ స్కాంకు వైసీపీ, ఎమ్మెల్సీ కవిత సూత్రధారులని ఆరోపించారు. రూ. వేల కోట్ల అవినీతికి పాల్పడిన ఏపీ సీఎం జగన్ 11 కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే సెక్యులర్ వ్యవస్థ ఉండదన్నారు. రైతులకి ఇచ్చిన హామీలను మోదీ నెరవేర్చడం లేదని, మోదీ గ్యారెంటీ అదానికీ మాత్రమేనని ఎద్దేవా చేశారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగులివ్వాలి: చాడ

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 2008 డీఎస్సీ నోటిఫికేషన్‌లో మెరిట్ సాధించిన అభ్యర్థులు సుదీర్ఘకాలంగా ఉద్యోగాల కోసం ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నారని, వారిని సెకండరీ టీచర్లుగా గుర్తించి ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి శనివారం లేఖ రాశారు. 2008 డీఎస్సీ మెరిట్ అభ్యర్థులను సెకండరీ టీచర్లుగా నియమించాలని 2024 ఫిబ్రవరి 8న హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను గౌరవిస్తూ మానవతా దృక్పథంతో వారికి టీచర్ ఉద్యోగాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

బకాయిలు విడుదల చేయాలి

» ప్రభుత్వానికి ఏఐఎస్ఎఫ్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్య చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందించే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఏఐఎస్ఎఫ్ విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వం ఈ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు. 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు సంబంధించి రూ.5,500 కోట్లకు పైగా ఫీజు రీఇయింబర్స్, ఉపకారవేతనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వారు పేర్కొన్నారు.

మునిగే నావతో బీజేపీకి పొత్తా?

» బీఆర్ఎస్‌తో బీజేపీ కలవడం అసాధ్యం: బూర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావ అని, అన్నీ తెలిసి మునిగే నావతో బీజేపీ పొత్తు ఎందుకు పెట్టుకుంటుందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌తో బీజేపీ కలవడం అసాధ్యమని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు బీజేపీ, కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి 14% ఓట్లు వచ్చాయని, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో తమ పార్టీకి 10 స్థానాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

వాస్తవాలు దాచిపెట్టి దావా వేస్తారా?

» హైకోర్టు ఆగ్రహం

» పిటిషనర్, న్యాయవాదికి కలిపి రూ.15 లక్షల జరిమానా

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పిటిషన్‌లతో న్యాయవ్యవస్థను అపహాస్యం చేసేలా వ్యవహరించినందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు.. పిటిషనర్‌కు, న్యాయవాదికి కలిపి రూ. 15 లక్షల జరిమానా విధించింది. కోర్టులను మోసం చేయాలనుకోవడం క్షమించరాని నేరమని ఈ కేసును పరిశీలించిన జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసులు పెద్దఎత్తున పెండింగ్‌లో ఉండటానికి ఇలాంటివే కారణమని అభిప్రాయపడింది. మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన పులిపాటి శ్రీనివాస్.. విశ్వభారతి మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ వద్ద ఇంటిని తాకట్టుపెట్టి రూ. 30 లక్షల మార్టిగేజ్ లోన్ తీసుకున్నారు. రుణాలు సరిగా కట్టకపోవడంతో రుణఖాతా మొండి బకాయిగా మారింది. ఆ సహకార సంఘం.. ట్రైబ్యునల్‌ను ఆశ్రయించి ఇంటిని వేలం వేసేలా ఆదేశాలు తెచ్చుకుంది. తనకు ఎలాంటి నోటీసు, అవకాశం ఇవ్వకుండా ఇంటిని స్వాధీనం చేసుకుంటున్నారని పేర్కొంటూ శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఇచ్చిన గడువులోగా రుణ బకాయిలు చెల్లించకపోవడంతో వడ్డీ లెక్కింపు నోటీసు ఇచ్చి ఇంటిని వేలం వేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. దాంతో వడ్డీ లెక్కింపు నోటీసులను సవాల్ చేస్తూ రాపోలు భాస్కర్ అనే న్యాయవాది ద్వారా రెండో పిటిషన్ దాఖలు చేశారు. వ్యాజ్యానికి కాలం చెల్లిపోయిందని పేర్కొంటూ దాన్ని ఉపసంహరించుకున్నారు. ఈ పిటిషన్‌ల వివరాలు ఏవీ చెప్పకుండా శ్రీనివాస్ మూడో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వివరాలన్నిటినీ పరిశీలించిన ధర్మాసనం.. వాస్తవాలను దాచిపెట్టడం ద్వారా పిటిషనర్ కోర్టును మోసం చేయాలని చూస్తున్నారని పేర్కొంది. పిటిషనర్ న్యాయవాది సాంబయ్య నాయక్ పనితీరుపై సైతం హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో ఒకసారి జరిమానా విధించినా ఆ న్యాయవాది వైఖరి మారలేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు, న్యాయవాదికి కలిపి రూ. 15 లక్షల జరిమానా విధిస్తూ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

మేడారంలో దోపిడీకి 'చీర్స్'!

బెంబేలెత్తిస్తున్న మద్యం ధరలు.. ఒక్కో బాటిల్‌పై ఎంఆర్పీ కన్నా రూ.100 ఎక్కువే

» బీరుపై రూ.120 దాకా.. అధికారులు, వ్యాపారుల కుమ్మక్కు

» రోడ్లపైనే మద్యం.. 5వేలకుపైగా వెలసిన బెల్టు షాపులు

» ఒడిసా, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచీ దిగుమతి

» అధిక ధరలకు విక్రయించడంపైనే భక్తుల నారాజ్

» బెల్లాన్ని గుడుంబా తయారీకి తరలిస్తున్నారా?

» అధికారుల నజర్.. ఆధార్ నమోదు చేశాకే విక్రయాలు


మేడారంలో బహిరంగంగా అమ్మకానికి పెట్టిన మద్యం సీసాలు

వరంగల్, సిరిసిల్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాజాతరకు ముందే మేడారంలో మద్యం జాతర ఉధృతమైంది. ప్రభుత్వ అనుమతితో సాగే మద్యం షాపులు మేడారంలో రెండంటే రెండే ఉన్నాయి. అయితే ఇప్పుడు రోడ్లపై ఎక్కడ చూసినా బెల్ట్ షాపులే కనిపిస్తున్నాయి. దుకాణాల ముందు టేబుళ్ల మీద బాటిళ్లను బ్రాండ్లవారీగా వరుసగా పేర్చి మరీ విక్రయిస్తున్నారు. ఏకంగా ఐదు వేలకు పైగా బెల్ట్ షాపులు వెలిశాయి. కొందరైతే తోపుడు బండ్లపైనా సీసాలు పెట్టుకొని తిరుగుతూ అమ్ముతున్నారు. అయితే మద్యం ధరలను మాత్రం వ్యాపారులు ఇష్టారీతిన పెంచి విక్రయిస్తున్నారు. జాతరలో ఎక్కువగా అమ్ముడుపోతుందనుకున్న ఒక కంపెనీ కి చెందిన క్వార్టర్ బాటిల్ ఎంఆర్పీ రూ.150 ఉంటే దానిని రూ.240 వరకు విక్రయిస్తున్నారు. ఇదే బ్రాండు ధర గద్దెల సమీపంలోనైతే రూ.260 ఉంది. ఆయా బ్రాండ్లను బట్టి ఎంఆర్పీ ధరల కంటే ప్రతి క్వార్టర్‌పై రూ.90 నుంచి రూ.110 వరకు వసూలు చేస్తున్నారు. ఫుల్ బాటిల్‌కు రూ.360 నుంచి రూ.440కి పైగా అదనంగా వెచ్చించాల్సి వస్తోంది. బీరు బాటిల్ ఎంఆర్పీ రూ.150 ఉంటే రూ.250 నుంచి రూ.270 వరకు వసూలు చేస్తున్నారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయించగా, వచ్చిన మొత్తంలో షాపు నడిపించే వ్యక్తికి 30శాతం, దళారులకు 20శాతం, మిగతా 50శాతం వ్యాపారులు, అధికారులు వాటాలు పెట్టుకుంటున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒడిసా, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా మద్యం మేడారం చేరుతున్నట్లు తెలుస్తోంది. s అయితే మద్యం అన్ని చోట్ల లభించినా పర్వాలేదు కానీ అధిక ధరలకు విక్రయిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేసుతన్నారు మరోవైపు మేడారం జాతరలో మద్యంతో పాటు ప్రభుత్వం నిషేధించిన గుడుంబా సైతం గుట్టుగా విక్రయాలు చేస్తున్నారు. ఎక్కువ గ్రామీణ, గూడేల నుంచి వచ్చే భక్తులు నాటుసారాకు సై అంటున్నారు. చత్తీస్‌గఢ్‌తో పాటు వరంగల్, ఖమ్మం తదితర ఏజెన్సీ ప్రాంతాల నుంచే వచ్చే భక్తులు తమతో పాటు గుడుంబాను జాతరకు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సిరిసిల్ల జిల్లాలోనూ బెల్లం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే బెల్లం విక్రయాలపై అధికారులు దృష్టి పెట్టారు. బెల్లాన్ని గుడుంబా తయారీకి ఉపయోగించొచ్చు అన్న అనుమానాలతో ఫోన్ నంబరు, ఆధార్ తీసుకొని బెల్లం విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది.


సిరిసిల్లలో బంగారం (బెల్లం) ఇస్తున్న భక్తులు

17 ఏళ్ల జైలు జీవితానికి విముక్తి

» దుబాయ్ నుంచి ఇల్లు చేరిన జగిత్యాల వాసి

» హత్య కేసులో తెలంగాణ కార్మికులకు జైలు

» ఐదుగురు దోషుల్లో ఇప్పటికే ఇద్దరి విడుదల

» త్వరలోనే ముగ్గురు ప్రవాసులకు విముక్తి

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 17: హత్య కేసులో అరెస్టయి.. దుబాయ్ జైలులో 17 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్న తెలంగాణ కార్మికుడికి ఎట్టకేలకు విముక్తి లభించింది. కోర్టు క్షమాభిక్ష ప్రసాదించడంతో శనివారం బాధితుడు ఇల్లు చేరాడు. దుబాయ్‌లో జరిగిన ఓ హత్య కేసులో తెలంగాణకు చెందిన ఐదుగురికి జైలుశిక్ష పడింది. వీరిని విడిపించేందుకు అనేక ఏళ్లపాటు చేసిన ప్రయత్నాలకు ఫలితం దక్కింది. ఈ కేసులో శిక్ష అనుభవిస్తున్న వారిలో ఇద్దరు విడుదలవగా మరో ముగ్గురు త్వరలోనే స్వదేశానికి రానున్నారు. నేపాల్‌కు చెందిన దిల్ బహదూర్ అనే సెక్యూరిటీ గార్డు 2005లో దుబాయ్‌లో హత్యకు గురయ్యాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరుకు చెందిన సోదరులు శివరాత్రి మల్లేశం(45), శివరాత్రి రవి (45), కోనరావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్(48), చందుర్తికి చెందిన నాంపల్లి వెంకటి (43), జగిత్యాల జిల్లా మల్యాల మండలం మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు(51) ఈ హత్యకు కారణమని తేల్చిన కోర్టు.. వారికి 25 ఏళ్ల జైలుశిక్ష విధించింది. అప్పటి దుబాయ్ చట్టాల ప్రకారం హతుడి కుటుంబసభ్యులకు పరిహారం చెల్లిస్తే క్షమాభిక్ష లభించే అవకాశం ఉండేది. ఇందుకోసం కార్మికుల కుటుంబసభ్యులు 2012లో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. తమ కిడ్నీలు అమ్మి పరిహారం చెల్లిస్తామని దరఖాస్తు చేసుకున్నారు. ఈ విజ్ఞప్తిని చూసిన అప్పటి మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించారు. 2012లో ఆయన నేపాల్ వెళ్లి దిల్ బహదూర్ భార్యను క్షమాభిక్ష కోరి రూ.15 లక్షలు ఇచ్చారు. దీంతో ఆమె క్షమాభిక్ష పత్రంపై సంతకం చేశారు. అయినా తీవ్ర నేరారోపణలు ఉన్నాయని ప్రవాసుల విడుదలకు కోర్టు నిరాకరించింది. ఈ క్రమంలో న్యాయ సహాయం కోసం కేటీఆర్ మరో రూ.15లక్షలు వెచ్చించడంతో ఆ ప్రయత్నం ఫలించింది. ప్రవాస కార్మికులకు కోర్టు క్షమాభిక్ష ప్రసాదించింది. 17 ఏళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్న ఐదుగురిలో దండుగుల లక్ష్మణ్ ఆరు నెలల క్రితం విడుదలయ్యాడు. శివరాత్రి హన్మంతు శనివారం ఇంటికి చేరుకున్నాడు. మరో ముగ్గురి విడుదలకు మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లె సమస్యలు తీర్చేందుకు తరచూ గ్రామసభలు

» ట్రెజరీద్వారా జాయింట్ సంతకంతో నిధుల డ్రా

» పంచాయతీ ప్రత్యేకాధికారులకు మార్గదర్శకాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పల్లె ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు తరచూ గ్రామసభలు నిర్వహించాలని సూచించింది. అందులో భాగంగా.. నెలకోసారి లేదంటే కనీసం రెండు నెలలకోసారి అయినా గ్రామసభ చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేకాధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడటంతోపాటు వీధి దీపాల నిర్వహణ, నర్సరీల్లో నీటి వసతులు కల్పించి మొక్కలు పెరిగేలా చూడాలని పేర్కొంది. అభివృద్ధి పనుల కోసం డ్రా చేసే నిధులు ఏవైనా ట్రెజరీ ద్వారా ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి జాయింట్ సంతకంతోనే తీసుకోవాలని తెలిపింది. ఖర్చు ఏదైనా సరే ఆ డబ్బులకు సంబంధించి బిల్లులు, ఓచర్లు కచ్చితంగా ఉండాలని, గ్రామాల్లో ఇప్పటికే మొదలుపెట్టిన అభివృద్ధి పనులను వాటి ప్రాధాన్యం ఆధారంగా వేగంగా పూర్తిచేసేలా చూడాలని పీఆర్ శాఖ ఆదేశించింది.

శ్రీశైలంలో జంట ఆత్మహత్య

శ్రీశైలం, ఫిబ్రవరి 17: శ్రీశైలం దేవస్థానం వసతిగృహం గౌరీ సదన్‌లో ఓ జంట ఆత్మహత్య చేసుకుంది. రంగారెడ్డిజిల్లా సరూర్‌నగర్‌కు చెందిన మల్లేష్(32), సరిత(28) ఈ నెల 13వ తేదీ ఉదయం గౌరీ సదన్‌లో గది తీసుకున్నారు. నాలుగు రోజుల నుంచి గది రెన్యువల్ చేయలేదు. దుర్వాసన వస్తోందని పక్కగదిలో ఉన్న యాత్రికులు దేవస్థానం సిబ్బందికి తెలియజేయగా పోలీసులకు సమాచారం అందించారు. శ్రీశైలం వన్‌టౌన్ సీఐ ప్రసాదరావు చేరుకుని గది తలుపులు తెరిపించి.. ఇద్దరూ ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. సరూర్‌నగర్‌కు చెందిన మల్లేష్, సరిత వివాహితులు. వారి మధ్య కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతోంది. కుటుంబసభ్యులు మందలించడంతో శ్రీశైలానికి వచ్చి ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

'ప్రపంచాన్ని చూసిన' శిశు మేధావి!

» 4 నెలల వయస్సులోనే నోబుల్ వరల్డ్ రికార్డ్

» బిడ్డలోని ప్రతిభను గుర్తించిన తల్లి

» 120 రకాల అంశాలను గుర్తించిన కైవల్య



విజయవాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల పసికందు.. బుడిబుడి అడుగులు వేయడానికి ముందే ప్రపంచ రికార్డ్‌ను సాధించింది! ఆ శిశు మేధావే చల్లగుండ్ల కైవల్య. ఒకటి, రెండు కాదు ఏకంగా 120 అంశాలను గుర్తించి ఈ రికార్డును నెలకొల్పింది. చల్లగుండ్ల రమేశ్ హైదరాబాద్‌లోని క్వెస్ట్ గ్లోబల్ సంస్థలో హార్డ్‌వేర్ ఉద్యోగి. ఆయన భార్య హోమ.. కాగ్నిజెంట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ దంపతుల ముద్దుల కూతురు కైవల్య. ఆ చిన్నారికి కొద్దిరోజుల క్రితమే నాలుగు నెలలు పూర్తయ్యాయి. హోమ ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని పుట్టింట్లో ఉంటున్నారు. హోమ... కైవల్య కంటి చూపు కోసం చేసిన ప్రయత్నాలు ప్రతిభకు బీజం వేశాయి. చిన్నారులకు బ్లాక్ అండ్ వైట్ బొమ్మలు ఉన్న కార్డులు చూపిస్తే కంటి చూపు మెరుగుపడుతుందని హోమకు కొంతమంది సలహా ఇచ్చారు. దీంతో ఆమె ఆన్‌లైన్‌లో కొన్ని ఫ్లాష్‌కార్డులను ఆర్డర్ చేసింది. ఒకటో నెలలో వాటిని హోమ చూపిస్తున్నప్పుడు కైవల్య శ్రద్ధతో చూస్తున్నట్టు గుర్తించింది. నాలుగో నెలలో రెండు కార్డులను పట్టుకుని కైవల్యకు చూపించి కార్డుపై ఉన్న చిత్రం పేరు చెప్తే అదే కార్డును పట్టుకునేది. దీన్ని గమనించిన తల్లి హోమ వేర్వేరు చిత్రాలు ఉన్న కార్డులను చూపించి పేర్లు చెప్పేది. చిన్నారి కైవల్యలో ఉన్న ప్రతిభకు ఒక గుర్తింపును తీసుకురావాలని హోమ భావించింది. నోబుల్ వరల్డ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు దరఖాస్తు చేసింది. ఇందులో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎక్కాలంటే చిన్నారుల వయస్సు ఏడాదిన్నర ఉండాలి. దీంతో ఈ దరఖాస్తును ఆ సంస్థ తిరస్కరించింది. నోబుల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ మాత్రం ఈ దరఖాస్తుకు స్పందించింది. వీడియోలు తీసి పంపాలని ఆమెకు మెయిల్ చేశారు. కూరగాయలు, జంతువులు, పక్షులు, వస్తువులకు సంబంధించి ఒక్కోదానికి 27 ఫ్లాష్‌కార్డులు ఉంటాయి. వాటిని కైవల్య చూపిస్తున్నట్టు ఐదు నిమిషాల నిడివితో వీడియోలు చిత్రీకరించి ఆ సంస్థకు పంపారు. మొత్తం 120 అంశాలను ఈ నాలుగేళ్ల చిన్నారి గుర్తించి 'బాల్యమేధావి' అనిపించుకుంది. వాటిని పరిశీలించిన నోబుల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఈ నెల 13న రికార్డ్‌కు సంబంధించిన ప్రశంసాపత్రాన్ని, పతకాన్ని పంపించింది.

19, 20 తేదీల్లో గురుకుల జేఎల్, డీఎల్ సర్టిఫికెట్ వెరిఫికేషన్

» నాంపల్లి తెలుగు యూనివర్సిటీ, డీఎస్ఎస్ భవన్‌లో నిర్వహణ

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు ఈ నెల 19, 20 తేదీల్లో గురుకుల బోర్డు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనుంది. ఇప్పటికే డీఎల్, జేఎల్ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాలను ప్రకటించిన విషయం తెలిసిందే. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లోని ఇంగ్లిష్, తెలుగు, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టుల సంబంధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను తెలుగు సంక్షేమ భవన్ (డీఎస్ఎస్ భవన్ మాసబ్ ట్యాంక్)లో, మిగతా అన్ని సబ్జెక్టుల అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నట్టు బోర్డు తెలిపింది. కాగా, టీజీటీ, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులకు సంబంధించి మెరిట్ జాబితాలు వెలువడాల్సి ఉంది. కాగా, ఔషధ నియంత్రణ శాఖ పరిధిలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 20న నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉంటుందని కమిషన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది.

బీఆర్ఎస్‌కు సిగ్గుండాలి: టీపీసీసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని చెప్పుకోవడానికి బీఆర్ఎస్ వాళ్లకు సిగ్గుండాలని టీపీసీసీ అధికార ప్రతినిధులు చనగాని దయాకర్‌గౌడ్, గౌరీ సతీష్, దామోదర్, రామచంద్రగౌడ్‌లు ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్.. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని ఆరోపించారు. గాంధీభవన్‌లో శనివారం మీడియాతో వారు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ. వేల కోట్లు దోచినందుకు, మేడిగడ్డను మేడిపండును చేసినందుకు, హైదరాబాద్‌ను డ్రగ్స్ నగరంగా మార్చినందుకు, వందలాది మంది నిరుద్యోగుల ప్రాణాలు తీసినందుకు ఆయన్ను తెలంగాణ జాతిపిత అనాలా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత రాష్ట్ర సమితిగా మార్చిన కేసీఆర్, 'తెలంగాణ' గురించి మాట్లాడే నైతిక హక్కునూ కోల్పోయారని విమర్శించారు.

మాస్టర్‌ప్లాన్‌తో చెర్వుగట్టు అభివృద్ధి

» రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

» పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వీరేశం దంపతులు


స్వామివారి కల్యాణంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 17: చెర్వుగట్టు క్షేత్రాన్ని మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేస్తామని, సీఎం రేవంత్‌రెడ్డిని కూడా తీసుకొచ్చి చూపించి నిధులు మంజూరు చేయిస్తామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వైభవోపేతంగా జరిగిన ఈ వేడుకకు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రభుత్వం తరుఫున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం విలేకర్లతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి... బ్రహ్మోత్సవాలకు హాజరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను ప్రజాప్రతినిధిగా ఉన్నా లేకున్నా, ప్రతీ ఏటా ఉత్సవాలకు హాజరయ్యానని గుర్తుచేశారు. క్షేత్రాన్ని అన్ని రకాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. కాగా, వచ్చే మూడు నెలల్లో బీ.వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయించి సుమారు 50వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని మంత్రి ప్రకటించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కూడా క్షేత్రాన్ని దర్శించుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

"శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడును భరించలేకుండా ఉన్నాం. ఒక మెట్టుదిగైనా భారతీయ జనతా పార్టీతో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్ పార్టీని దెబ్బకొట్టకపోతే రేవంత్ రెడ్డికి అడ్డుకట్ట వేయలేం"... ఇది భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద పెట్టుకుంటున్న మొర!

"సార్వత్రిక ఎన్నికల్లో మీరు తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నారా? ఇంత నమ్మకమైన మిత్రుడిని నేను ఉండగా తెలుగుదేశం పార్టీ అవసరమేముంది? తెలుగుదేశం పార్టీతో పొత్తు ఆలోచన చేయవద్దు ప్లీజ్!"... ఇది ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి చేసిన విజ్ఞప్తి!

తెలంగాణలో ప్రతిపక్షం, ఆంధ్రప్రదేశ్‌లో అధికారపక్షం బీజేపీ కరుణా కటాక్షాల కోసం ఈ విధంగా వెంపర్లాడడం ఒకింత వింతగా ఉంది. రెండు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో

> నిజానికి బీజేపీ కలవడం వల్ల ఓట్లపరంగా తెలుగుదేశం పార్టీకి పెద్దగా ఒనగూరే ప్రయోజనం ఉండదు. అయినా పొత్తు ప్రతిపాదనలపై జగన్ అండ్ కో ఉలికిపాటుకు గురవుతోందంటే అందుకు కారణం లేకపోలేదు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సమయంలో చేసినటువంటి అరాచకాలకు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూడా తెరలేపి మళ్లీ అధికారంలోకి రావొచ్చునని జగన్మోహన్ రెడ్డి లెక్కలు వేసుకుంటున్నారు. తన ఆటలు సాగాలంటే ఎన్నికల కమిషన్ సహకారం అవసరం. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదిరితే ఎన్నికల కమిషన్ నుంచి జగన్‌కు సహకారం లభించదు. అప్పుడు వచ్చే ఎన్నికల్లో తన ఆటలు సాగవని ముఖ్యమంత్రి జగన్ భయపడుతున్నారు. ఈ కారణంగానే ఢిల్లీకి పరుగులు తీసి ప్రధాని మోదీని కలిసి పొత్తు పెట్టుకోవద్దని వేడుకున్నారు.

బీజేపీ తెలంగాణలో ఎనిమిది సీట్లలో మాత్రమే నెగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీ బలం నామమాత్రమే. అయినా తెలంగాణలో 39 సీట్లు గెలుచుకొని ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో 151 సీట్లు గెలుచుకున్న వైసీపీ కూడా బీజేపీ అండకోసం అల్లాడిపోవడం వర్తమాన రాజకీయాలను ఆశ్చర్యపరిచే పరిణామం.

వామ్మో... రేవంత్!

శనివారంతో ముగిసిన శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదునైన మాటలు, వ్యాఖ్యలతో నిన్నటి వరకూ అధికారం చెలాయించిన బీఆర్ఎస్‌పై దుమ్మెత్తి పోశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ వ్యంగ్యాస్త్రాలతో విరుచుకుపడుతున్నారు. ముఖ్యమంత్రి దాడిని ఎదుర్కోవడానికి హరీశ్ రావు, కేటీఆర్ తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. అయినా అధికార పార్టీ కావడంతో కాంగ్రెస్‌దే పైచేయిగా కనిపిస్తున్నది. ఈ పరిస్థితిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు భరించలేకపోతున్నారు. గత పదేళ్లుగా అధికారం చెలాయించడానికి అలవాటుపడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఇమడలేకపోతున్నారు. అదే సమయంలో, రెండు మాసాల తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికల్లో గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు గెలుచుకోలేని పక్షంలో తమ భవిష్యత్తు ఏమిటి? అన్న బెంగ కూడా వారిని పట్టి పీడిస్తున్నది. దీంతో బీజేపీతో చేతులు కలిపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కట్టడి చేయాలని వారు కేసీఆర్ వద్ద మొర పెట్టుకుంటున్నారు. దీంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆలోచనను ప్రారంభంలో తిరస్కరించిన కేసీఆర్ ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. అయితే... బీఆర్ఎస్‌తో చేతులు కలపడానికి బీజేపీ సిద్ధపడుతుందా, లేదా అన్నది ఇప్పుడు ప్రశ్నగా ఉంది. తాజా సమాచారం ప్రకారం పొత్తుకోసం బీఆర్ఎస్ నుంచి వస్తున్న ప్రతిపాదనను కేంద్రమంత్రి అమిత్ షా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వద్ద తోసిపుచ్చినట్టు తెలిసింది. అయితే, 'పొత్తులు ఉండబోవని ఇప్పుడే స్పష్టం చేయవద్దు–ఆలోచిస్తున్నాం' అని మాత్రమే చెబుదామని అమిత్ షా సూచించినట్టు తెలిసింది.

ఎన్నికల తర్వాత ఏమవుతుంది?

లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకొనే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాలని, కుదిరితే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూలదోసి, తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని బీజేపీకి చెందిన కొందరు ఆలోచన చేస్తున్నారు. ఆ పార్టీ కేంద్ర నాయకత్వం కూడా తెలంగాణపై దృష్టి పెట్టింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జాతీయ స్థాయిలో బీజేపీకి లభించే సీట్లు, ఎన్డీయే బలం ఏ మేరకు పెరగనున్నదన్న దానిపై స్పష్టత వచ్చాక బీజేపీ పెద్దలు తెలంగాణలో తమ వ్యూహాన్ని అమలుచేసే అవకాశం ఉంది. తమకు ఉత్తరాదిన తిరుగులేని పరిస్థితి ఉన్నప్పటికీ దక్షిణాదిన పరిస్థితులు అనుకూలంగా లేకపోవడాన్ని బీజేపీ అగ్ర నాయకత్వం జీర్ణించుకోలేకపోతున్నది. దీనికితోడు కర్ణాటకలో అధికారం కోల్పోవలసి రావడం, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా అధికారంలోకి రావడంతో దక్షిణాదిపై ఫోకస్ పెంచారు. కేరళ, తమిళనాడులో ఇప్పటికిప్పుడు చేయగలిగింది ఏమీ లేకపోయినప్పటికీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బలం పెంచుకోవడానికి పావులు కదుపుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ భారతీయ జనతా పార్టీ అనూహ్యంగా నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ సహజంగానే కొంత బలహీన పడుతుంది. అదే సమయంలో, ఈ ఎన్నికల్లో మోదీ ప్రభావం కూడా ఉంటుంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్–బీజేపీ మధ్యనే ఉంటుందన్న అభిప్రాయం ఉంది. అదే జరిగితే లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మనుగడ కష్టతరంగా ఉంటుంది. దీంతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు కలవరం చెందుతున్నారు. అదే సమయంలో... తెలంగాణలో బీఆర్ఎస్ అస్తిత్వం పోవాలని బీజేపీ కోరుకుంటోంది. అప్పుడు రాష్ట్ర రాజకీయాలు కాంగ్రెస్–బీజేపీ మధ్య కేంద్రీకృతం అవుతాయి. కేసీఆర్‌కు కూడా ఈ విషయం తెలుసు. తన పార్టీ పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని ఆయన గ్రహించారు. అందుకే బీజేపీతో పొత్తు గురించి మాట్లాడే వారిని గట్టిగా నిరోధించలేకపోతున్నారు. కాకపోతే పొత్తులకు సంబంధించిన చాయిస్ తన చేతుల్లో లేదని ఆయనకు తెలుసు. ఆ కారణంగానే గుంభనంగా ఉంటున్నారు. మరోవైపు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పనితీరుకు మంచి మార్కులే లభిస్తున్నప్పటికీ ఆయన ప్రభుత్వ స్థిరత్వంపై ఎవరి సందేహాలు వారికి ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత పరిస్థితి ఎలా ఉండబోతుందన్న దానిపై ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. బీఆర్ఎస్–బీజేపీ–మజ్లిస్‌కు కలిపి 54 మంది శాసనసభ్యులు ఉన్నారు. ఆరుగురు కాంగ్రెస్ సభ్యులు పక్కచూపులు చూసినా ప్రభుత్వం పడిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి గ్రీన్ సిగ్నల్ లేనందున ఫిరాయింపులను ప్రోత్సహించడం లేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఇంకోవైపు... కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా తమతో టచ్‌లో ఉన్నారని, అదను చూసి దెబ్బకొడతామని బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల వరకు ఇటువంటి ఊహాగానాలే సాగుతాయి. ఆ తర్వాత ఆయా పార్టీల గెలుపు ఓటములను బట్టి తెలంగాణ రాజకీయాల్లో ఎటువంటి మార్పులు జరుగుతాయో స్పష్టమవుతుంది. ఇక్కడ ఇంకా కొన్ని విషయాలు చెప్పుకోవాలి. బీఆర్ఎస్‌తో పొత్తు వద్దని ప్రస్తుతం భావిస్తున్న బీజేపీ కేంద్ర నాయకత్వం చివరి క్షణంలో మనసు మార్చుకుంటే మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కష్టాలు మొదలవుతాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుచుకున్న మున్సిపాలిటీలలో ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా వాటిని హస్తగతం చేసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం దృష్టి సారించింది. అదే సమయంలో, శాసనసభ ఎన్నికల్లో తాము ప్రభావం చూపలేకపోయిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలపై కూడా దృష్టి కేంద్రీకరించింది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులను ఆకర్షించడం ద్వారా పార్టీని పటిష్ఠం చేసుకోవడంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జోరందుకున్నాయి. అయితే జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలను హస్తగతం చేసుకోవడం వల్ల పార్టీ బలం నిజంగా పెరుగుతుందా? అంటే అనుమానమే. ఎందుకంటే శాసనసభ ఎన్నికలు జరిగే నాటికి రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు బీఆర్ఎస్ చేతిలోనే ఉన్నాయి. అయినా ఆ పార్టీ ఓడిపోయింది. స్థానిక సంస్థలు ఎవరి చేతిలో ఉన్నా సార్వత్రిక ఎన్నికల్లో వాటి ప్రభావం ఉండదని అనేక సందర్భాలలో రుజువైంది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో కూడా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండే అవకాశం లేదు. ఉదాహరణకు తాండూరుకు చెందిన మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి శాసనసభ ఎన్నికల సమయంలో మంత్రిగా ఉన్నారు. అయినా తాండూరులోనే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గాలలో కూడా బీఆర్ఎస్ ఓడిపోయింది. ఇప్పుడు ఆయనతో పాటు ఆయన భార్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడానికి వీరి చేరిక ఉపయోగపడుతుందో లేదో చూడాలి.

ఇరువురికీ అగ్నిపరీక్షే...

లోక్‌సభ ఎన్నికలు భారత రాష్ట్ర సమితికి మాత్రమే కాదు– ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా పరీక్షగా నిలవబోతున్నాయి. సేఫ్ జోన్‌లో ఉన్నది భారతీయ జనతా పార్టీ మాత్రమే. గతంలో నాలుగు స్థానాలు గెలుచుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఎనిమిది స్థానాలను గెలుచుకోవాలన్న పట్టుదలతో ఉంది. నాలుగుకంటే ఎన్ని ఎక్కువ వచ్చినా ఆ పార్టీకి బోనస్‌గానే పరిగణించాలి.

• ఆర్కే RK



కొత్తపలుకు

బీఆర్ఎస్‌కు మాత్రమే ఈ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా కనిపిస్తున్నప్పటికీ ఎన్నికల అనంతరం కేంద్రంలో మళ్లీ నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడితే ఎదురయ్యే సవాళ్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా కంటి మీద కునుకు లేకుండా చేస్తాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు అధికారంలో కొనసాగడం బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు – బీజేపీకి కూడా ఇష్టం ఉండదు. ఈ కారణంగా గుర్రం ఎగరావచ్చు అన్నట్టు బీఆర్ఎస్–బీజేపీలు ఎన్నికల నాటికి చేతులు కలిపినా ఆశ్చర్యపోవాల్సింది లేదు. పొత్తు ప్రతిపాదనలను బీజేపీ కేంద్ర నాయకత్వం తిరస్కరిస్తున్నప్పటికీ బీఆర్ఎస్ మాత్రం తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. బీఆర్ఎస్–బీజేపీ మధ్య లోపాయికారీ అవగాహన ఉందని శాసనసభ ఎన్నికలకు ముందే ప్రజలు బలంగా నమ్మారు. బీఆర్ఎస్ ఓటమికి అది కూడా ఒక కారణం. ఈ కారణంగా బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల కొత్తగా వచ్చే నష్టం ఉండబోదని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. వారు ఆలోచిస్తున్నట్టు బీజేపీతో నిజంగా పొత్తు కుదిరితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇబ్బందే. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభావం కనీసం ఐదు శాతం ఉంటుంది. దీనికి బీఆర్ఎస్ బలం కూడా తోడైతే కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపకుండా ఉండదు. రాజకీయాలలో 2+2 నాలుగు కాకపోవచ్చునుగానీ ఆ రెండు పార్టీలూ కలిస్తే మాత్రం వారి బలాన్ని తేలికగా తీసిపారేయలేము. ఓటమి తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ నిర్వహించిన తొలి బహిరంగ సభ సక్సెస్ అయిందనే చెప్పాలి. కేసీఆర్‌ను తెలంగాణ బాపుగా చిత్రీకరించడం ద్వారా తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ కదిలించి ప్రజలకు చేరువయ్యే ప్రయత్నాలను బీఆర్ఎస్ చేస్తోంది. రాజకీయ పార్టీలకుగానీ, వాటి అధినేతలకు గానీ ఎన్నికల్లో ఓడిపోవడాన్ని మించిన శిక్ష ఉండదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత గత ప్రభుత్వాల వైఫల్యాల గురించి ఎంతగా చెప్పినా ప్రజల చెవికెక్కదు. అధికారంలో ఉన్న వారి పనితీరునే ప్రజలు గమనిస్తారు. అధికారంలో ఉన్నప్పుడు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనేక విధాలుగా వేధించారు. అందుకు ప్రతీకారం తీర్చుకోవాలని ఇప్పుడు రేవంత్ రెడ్డి భావిస్తే ఉపయోగం ఉండదు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి ఎగబాకడానికి కేసీఆర్ అదేపనిగా వేధించడం కూడా ఒక కారణం. గత పాలకుల పాపాలను ప్రజలు ఇట్టే మరచిపోతారు. ఎమర్జెన్సీ అకృత్యాలను రెండేళ్లలోనే మరచిపోయిన ప్రజలు ఇందిరాగాంధీకే మళ్లీ పట్టం కట్టారు. 1989లో ఎన్టీఆర్‌ను ఓడించిన తెలుగు ప్రజలు 1994లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చారు. తుంటి ఎముక విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను పరామర్శించినప్పుడు రేవంత్ రెడ్డిని పలువురు అభినందించారు. కక్షలు, కార్పణ్యాలు అధికారంలో ఉన్న వారికి మేలు చేయవని ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభకు రాకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఈ సమయంలో రేవంత్ రెడ్డి అండ్ కో దెప్పిపొడిచినంత మాత్రాన అదనంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదు. అధికారం తలకెక్కడం వల్లే కేసీఆర్‌కు ప్రస్తుత దుస్థితి. ఈ నేపథ్యంలో కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్‌గా చేసుకోవడం వల్ల ఫలితం ఉంటుందా? ఉండదా? అని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచించుకోవాలి. పడ్డవాడు చెడ్డవాడు కాదు. అందుకే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ప్రస్తుతానికి లోక్‌సభ ఎన్నికల గండం దాటడంపైనే రేవంత్ రెడ్డి దృష్టి కేంద్రీకరించడం మంచిది. బీఆర్ఎస్–బీజేపీ ఏ కారణంవల్లనైనా చేతులు కలిపితే ఎదురయ్యే పరిస్థితులను అధిగమించడంపై ఆయన దృష్టి పెట్టాలి.

> 1989లో ఎన్టీఆర్‌ను ఓడించిన తెలుగు ప్రజలు 1994లో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తీర్పు ఇచ్చారు. తుంటి ఎముక విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్‌ను పరామర్శించినప్పుడు రేవంత్ రెడ్డిని పలువురు అభినందించారు. కక్షలు, కార్పణ్యాలు అధికారంలో ఉన్న వారికి మేలు చేయవని ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

కారు, కమలం కలిస్తే..!



> గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుచుకున్న మున్సిపాలిటీలలో ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా వాటిని హస్తగతం చేసుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం దృష్టి సారించింది. అదే సమయంలో, శాసనసభ ఎన్నికల్లో తాము ప్రభావం చూపలేకపోయిన హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలపై కూడా దృష్టి కేంద్రీకరించింది. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులను ఆకర్షించడం ద్వారా పార్టీని పటిష్ఠం చేసుకోవడంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది. ఈ కారణంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జోరందుకున్నాయి. అయితే జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలను హస్తగతం చేసుకోవడం వల్ల పార్టీ బలం నిజంగా పెరుగుతుందా? అంటే అనుమానమే. ఎందుకంటే శాసనసభ ఎన్నికలు జరిగే నాటికి రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు బీఆర్ఎస్ చేతిలోనే ఉన్నాయి. అయినా ఆ పార్టీ ఓడిపోయింది. స్థానిక సంస్థలు ఎవరి చేతిలో ఉన్నా సార్వత్రిక ఎన్నికల్లో వాటి ప్రభావం ఉండదని అనేక సందర్భాలలో రుజువైంది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో కూడా పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండే అవకాశం లేదు.

జగన్ మొర ఆలకించారా...

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాని మోదీకి పెట్టుకుంటున్న మొర విషయానికి వద్దాం! ప్రధానమంత్రి అనుమతితో కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలుగుదేశం అధినేత చంద్రబాబును ఢిల్లీకి ఆహ్వానించి పొత్తు విషయం కదిపారు. దీంతో కలవరపాటుకు గురైన జగన్ ఆ వెంటనే ఢిల్లీకి పరిగెత్తి ప్రధాని మోదీని కలిశారు. నమ్మకమైన మిత్రుడిని నేనుండగా ఆ తెలుగుదేశం అవసరం ఎందుకు? ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవద్దు ప్లీజ్ అని ప్రధానిని వేడుకున్నారు. ఈ విజ్ఞప్తికి ప్రధాని స్పందన ఏమిటో తెలియనప్పటికీ జగన్‌రెడ్డి మాత్రం ప్రధానితో సమావేశం తర్వాత తెలుగుదేశంతో పొత్తు ఉండదు, భయపడవద్దు అని తనకు అత్యంత సన్నిహితులైన వారి వద్ద చెప్పుకొన్నారు. దీంతో సదరు సన్నిహితులు ఊపిరి పీల్చుకున్నారు. 'తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోబోం అని ప్రధాని మా వాడికి హామీ ఇచ్చారట' అని కనిపించిన వారందరికీ వారు చెబుతున్నారు. ప్రధాని ఏమి చెప్పారో, జగన్‌కు ఏమి అర్థమైందో తెలియదుగానీ ఆ తర్వాత కూడా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక సందర్భంగా మాట్లాడుతూ ఎన్డీయేలోకి పాత మిత్రులు వస్తున్నారని, అందులో తెలుగుదేశం పార్టీ కూడా ఉంటుందని చెప్పారు. అయినా తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు ఉండబోదని జగన్ శిబిరం భరోసాగా ఉంది. నిజానికి బీజేపీ కలవడం వల్ల ఓట్లపరంగా తెలుగుదేశం పార్టీకి పెద్దగా ఒనగూరే ప్రయోజనం ఉండదు. అయినా పొత్తు ప్రతిపాదనలపై జగన్ అండ్ కో ఉలికిపాటుకు గురవుతోందంటే అందుకు కారణం లేకపోలేదు. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నిక సమయంలో చేసినటువంటి అరాచకాలకు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కూడా తెరలేపి మళ్లీ అధికారంలోకి రావొచ్చునని జగన్మోహన్ రెడ్డి లెక్కలు వేసుకుంటున్నారు. తన ఆటలు సాగాలంటే ఎన్నికల కమిషన్ సహకారం అవసరం. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదిరితే ఎన్నికల కమిషన్ నుంచి జగన్‌కు సహకారం లభించదు. అప్పుడు వచ్చే ఎన్నికల్లో తన ఆటలు సాగవని ముఖ్యమంత్రి జగన్ భయపడుతున్నారు. ఈ కారణంగానే ఢిల్లీకి పరుగులు తీసి ప్రధాని మోదీని కలిసి పొత్తు పెట్టుకోవద్దని వేడుకున్నారు. రాజ్యసభలో బీజేపీకి ఇప్పటికీ మెజారిటీ లేదు. అందుకే కీలక సందర్భాలలో వైసీపీ సహకారం తీసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ అధికారం కోల్పోయినా రాజ్యసభలో వైసీపీ సహకారం బీజేపీకి అవసరం. ఈ కారణంగా తెలుగుదేశంతో పొత్తు ఉంటుందని ముఖం మీదే చెప్పకుండా దేఖేంగే అని ప్రధాని మోదీ చెప్పి ఉండవచ్చు. అమిత్ షా వ్యాఖ్యల తర్వాత ముఖ్యమంత్రి జగన్‌లో భయం మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఆ రెండు పార్టీల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే బాధ్యతను బీజేపీలోని తన రహస్య మిత్రులకు అప్పగించినట్టు ఉన్నారు. ఫలితంగానే బీజేపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారంనాడు మాట్లాడుతూ... పొత్తు కోసం తెలుగుదేశం పార్టీనే వెంటపడుతోందని, బీజేపీ నాయకుడే ముఖ్యమంత్రి అయ్యే పక్షంలోనే పొత్తు ఉంటుందని వాచాలత్వం ప్రదర్శించారు. ఆ వ్యాఖ్యలను పార్టీ అధికార ప్రతినిధి ఖండించడం కూడా జరిగింది.

వికటిస్తున్న జగన్ ప్రయోగాలు...

రాష్ట్రంలో పెద్దగా బలంలేని బీజేపీ గురించి జగన్మోహన్ రెడ్డి భయపడటానికి కారణం అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో వైసీపీ పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. క్షేత్రస్థాయిలో ప్రజల నాడి పసిగట్టిన పార్టీకి చెందిన పలువురు ముఖ్యులు తెలుగుదేశం వైపు చూస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి నుంచి టికెట్ హామీ పొందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా తెలుగుదేశం పార్టీ అవకాశం ఇస్తానంటే జంప్ చేయడానికి సిద్ధంగా ఉన్నారు. నెల్లూరు లోక్‌సభ స్థానానికి పోటీ చేయడానికి జగన్ వద్ద అంగీకరించిన వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఆ తర్వాత మనసు మార్చుకొని తెలుగుదేశం నుంచి పోటీ చేయబోతున్నారు. ఆయన సతీసమేతంగా వెళ్లి చంద్రబాబును కలుసుకున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు లోక్‌సభ అభ్యర్థుల కోసం వైసీపీ తంటాలు పడుతోంది. ముప్పై ఏళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకున్న జగన్మోహన్ రెడ్డి, పార్టీ తరఫున పోటీ చేసే వారికోసం ఐదేళ్లకే కాగడా పెట్టి వెతుక్కొనే పరిస్థితి రావడం, పార్టీ టికెట్ పొందిన వారు సైతం పారిపోయే పరిస్థితి రావడం స్వయంకృతాపరాధమే. సిట్టింగ్ ఎమ్మెల్యేలలో కొందరికి టికెట్ నిరాకరించడం, మరి కొందరిని వేరే నియోజకవర్గాలకు బదిలీ చేయడం వంటి చర్యలన్నీ వికటిస్తున్నాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ ప్రజాభిప్రాయం స్పష్టమవుతున్నందున వైసీపీ తరఫున పోటీ చేయడానికి పలువురు భయపడుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్ బుజ్జగింపులు పనిచేయడం లేదు. అయినా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిలో ఇంకా ఎక్కడో ధీమా ఉంటోంది. ఎన్నికల్లో యధేచ్ఛగా అక్రమాలు చేయవచ్చునన్న ధీమాతోనే ఆయన భరోసాగా ఉండివుండవచ్చు. 'మా ఓటర్లు వేరు' అని సజ్జల వంటి వారు చేసిన ప్రకటనలు ఈ కోణంలోనే చూడాలి. ఇప్పటికే పలు నియోజకవర్గాలలో కనీసం ఐదారు వేల వరకు దొంగ ఓట్లు ఉన్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలో మూడు నాలుగు దశల్లో ఎన్నికలు జరిపించగలిగితే దొంగ ఓటర్లను వాడుకోవచ్చునని జగన్ శిబిరం భావిస్తోంది. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు కుదిరితే వారు ఆశిస్తున్నట్టు జరగదు. ఈ కారణంగానే పొత్తు అన్న మాట వినపడగానే వైసీపీ నాయకులు ఉలిక్కిపడుతున్నారు. ఏది ఏమైనా పొత్తుల వ్యవహారం మరికొద్ది రోజుల్లో తేలిపోతుంది. ఆ తర్వాత జగన్ శిబిరంలో వణుకు మొదలవుతుంది. ప్రస్తుతం జగన్ కోసం అన్ని నిబంధనలను అతిక్రమించి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్న ఐపీఎస్ అధికారులు కూడా పొత్తు కుదిరితే భయపడతారు. ఈ పరిస్థితి ఏర్పడుతుందని జగన్‌రెడ్డికి తెలుసు. ఎంతటి పాలెగాడైనా పోలీసుల సహకారం లేకపోతే పిల్లికంటే అధ్వానంగా వ్యవహరిస్తారు. జగన్ ఇందుకు అతీతుడుకాదు. తెలుగుదేశం–బీజేపీ మధ్య పొత్తు చెడగొట్టడానికి జగన్ చివరి వరకు ప్రయత్నిస్తారు. ఆయన ప్రయత్నం ఫలిస్తుందో లేదో తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాలి. ఏది ఏమైనా ఒకప్పుడు 'ఎంత మంది కలిసినా నా వెంట్రుక కూడా పీకలేరు' అని ఫీంకరించిన జగన్ ఆ తర్వాత 'మిమ్మల్నే నమ్ముకున్నాను' అని వాలంటీర్లను వేడుకునే దాకా దిగజారారు. ఇప్పుడు మరింత దిగజారి కుట్రలు, కుయుక్తులకు పాల్పడైనా ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు. అహం తలకెక్కిన ఏ నాయకుడికైనా పతనం కాచుకొని ఉంటుంది. జగన్మోహన్ రెడ్డి కూడా ఇందుకు మినహాయింపు కాదు!

> బీఆర్ఎస్–బీజేపీ మధ్య లోపాయికారీ అవగాహన ఉందని శాసనసభ ఎన్నికలకు ముందే ప్రజలు బలంగా నమ్మారు. బీఆర్ఎస్ ఓటమికి అది కూడా ఒక కారణం. ఈ కారణంగా బీజేపీతో పొత్తు పెట్టుకోవడం వల్ల కొత్తగా వచ్చే నష్టం ఉండబోదని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. వారు ఆలోచిస్తున్నట్టు బీజేపీతో నిజంగా పొత్తు కుదిరితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇబ్బందే. లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభావం కనీసం ఐదు శాతం ఉంటుంది. దీనికి బీఆర్ఎస్ బలం కూడా తోడైతే కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలపై ప్రభావం చూపకుండా ఉండదు. రాజకీయాలలో 2+2 నాలుగు కాకపోవచ్చునుగానీ ఆ రెండు పార్టీలూ కలిస్తే మాత్రం వారి బలాన్ని తేలికగా తీసిపారేయలేము. ఓటమి తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కేసీఆర్ నిర్వహించిన తొలి బహిరంగ సభ సక్సెస్ అయిందనే చెప్పాలి.

ఫ్రెంచ్ పాత్రికేయురాలి కన్నీటి నిష్క్రమణ

భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉండడమే ప్రజాస్వామ్యం. భారత ప్రభుత్వం ఒక ఫ్రెంచ్ పాత్రికేయురాలికి ఈ స్వేచ్ఛను నిరాకరించింది. ఈ దేశం నుంచి వెళ్లిపోవలసిన అగత్యాన్ని కల్పించింది. పలు ఫ్రెంచ్ మీడియా సంస్థల దక్షిణాసియా ప్రతినిధిగా మన దేశం నుంచి పనిచేస్తున్న వనెసా డౌనక్ శుక్రవారం స్వదేశానికి వెళ్లిపోయారు. తన ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం పత్రికాస్వేచ్ఛను అణచివేసేందుకు రాజ్య వ్యవస్థ కృతనిశ్చయంతో ఉన్నదని వనెసా ఉదంతం స్పష్టం చేసింది. ఆమె 25 సంవత్సరాల క్రితం ఒక విద్యార్థినిగా మన దేశానికి వచ్చి, భారతీయుడైన సహపాఠిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కుమారుడిని భారతీయ పౌరుడుగా తీర్చిదిద్దుతున్నారు. జీవనోపాధికి పాత్రికేయ వృత్తిని చేపట్టి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయేంతవరకు అదే వృత్తిలో కొనసాగారు. సత్యనిష్ఠతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు. ఆ నిబద్ధతవల్లే, ఇప్పుడు తాను ప్రేమించే దేశానికి, సొంత కుటుంబానికి దూరమవాల్సివచ్చింది.

తన వృత్తి నిర్వహణలో భాగంగా ఆమె మానవ హక్కులు, దేశీయ రాజకీయాలు, గ్రామీణ భారతంలో మావోయిస్టుల పార్టీ కార్యకలాపాల గురించి వివిధ ఫ్రెంచ్ పత్రికలకు వార్తా కథనాలు రాశారు. కరోనా మహమ్మారి దేశాన్ని కుదిపేస్తున్నప్పుడు ప్రభుత్వం తీరు, గంగానదిలో మృతదేహాలు ఇత్యాది పలు పరిణామాలను లోతుగా విశ్లేషించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు సంబంధించిన వివిధ హింసాత్మక ఘటనలను నివేదించారు. ఈ కథనాలు భారత్‌కు, హిందూ మతానికి వ్యతిరేకంగా ఉన్నాయని అధికార వర్గాలు అభిప్రాయపడ్డాయి.

ఒక భారతీయ పౌరుడి సతీమణిగా ఆమెకు భారత్‌లో శాశ్వత నివాసానికి హక్కునిచ్చే 'ఓవర్సీస్ సిటిజెన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఒసిఐ) కార్డు ఉన్నది. 2022 సెప్టెంబర్‌లో భారత ప్రభుత్వం వనెసాకు జర్నలిజం పర్మిట్ రద్దు చేసింది. ఒసిఐ కార్డు ఉపసంహరణకు నిర్ణయించినట్టు హోం మంత్రిత్వశాఖ జనవరి 24న నోటీస్ ఇచ్చింది. ఆమె పాత్రికేయ కార్యకలాపాలు 'ద్రోహ చింత'తో ప్రభావితమవుతున్నాయని, అవి భారత్ పట్ల వ్యతిరేక అభిప్రాయాన్ని కలిగించే విధంగా ఉంటున్నాయని హోం శాఖ ఆరోపించింది. ఈ ఆరోపణలకు సమాధానమిచ్చేందుకు ఫిబ్రవరి 2 వరకు గడువు ఇస్తున్నట్టు నోటీస్‌లో పేర్కొన్నారు. 1955 భారత పౌరసత్వ చట్టం నిర్దేశించిన విధంగా ప్రత్యేక అనుమతి తీసుకోకుండా పాత్రికేయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు, ఆ నిబంధనలను ఉల్లంఘించినట్టు ఆ నోటీస్ ఆరోపించింది. ఈ ఆరోపణలను వనెసా ఖండించారు. ఇవన్నీ ఎలాంటి రుజువులు లేని ఆరోపణలని శుక్రవారం నాడు స్వదేశానికి వెళ్లిపోతూ జారీ చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వృత్తిని మార్చుకోవాలని హోం శాఖ అధికారులు గతంలో ఇచ్చిన సలహా తనకు ఆమోదయోగ్యం కాదని, నిరూపించని ఆరోపణల కారణంగా తనకు ఇష్టపూర్వకమైన పాత్రికేయ వృత్తిని త్యజించేందుకు సిద్ధంగాలేనని, బలవంతంగా దేశాన్ని విడిచిపోవలసివస్తున్నదని ఆ సుదీర్ఘ వీడ్కోలు ప్రకటనలో ఆమె తెలిపారు. •



బాధాతప్త హృదయంతో, కన్నీటితో ఈ మాటలు రాస్తున్నాను. ఈ రోజు భారత్ వదిలివెళ్లిపోతున్నాను. పాతికేళ్ల క్రితం ఒక విద్యార్థిగా ఈ దేశానికి వచ్చాను, 23 సంవత్సరాలు ఈ దేశంలోనే పాత్రికేయురాలుగా పని చేశాను. ఈ దేశ పౌరుడినే వివాహం చేసుకున్నాను. నా కుమారుడిని ఇక్కడే పెంచాను. నేను నా ఇల్లుగా భావించిన దేశమిది. అయినా ఈ దేశాన్ని విడిచి వెడుతున్నాను. ఈ నిష్క్రమణ నా నిర్ణయం కాదు.

ఈ దేశాన్ని వదిలిపోయేలా భారతప్రభుత్వం నన్ను బలవంతపెట్టింది. పాత్రికేయురాలుగా పనిచేసేందుకు నాకున్న హక్కును పదహారు నెలల క్రితం హోంమంత్రిత్వ శాఖ నిరాకరించింది. ఎందుకు నిరాకరిస్తున్నదీ కారణాలు తెలుపలేదు. న్యాయసమర్థనలను చూపలేదు. నా విన్నపాలను విననే లేదు. ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్హేతుక చర్యపై పునరాలోచించాలని, కనీసం వివరణ ఇవ్వాలని నేను పదే పదే చేసిన అభ్యర్థనలకు హోం మంత్రిత్వ శాఖ ఒక్కసారీ ప్రతిస్పందించలేదు. గత నెలలో నాకు ఒక నోటీస్ పంపారు. నా వ్యాసాలు 'ద్వేషపూరితం'గా ఉంటున్నాయని, భారత సార్వభౌమికతకు, సమగ్రతకు హాని చేస్తున్నాయని అందులో ఆరోపించారు. ఒక భారతీయ పౌరుడి సతీమణిగా నాకు గల 'ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా' (ఒసిఐ) కార్డు ఎందుకు రద్దు చేయకూడదో నిర్దిష్ట గడువులోగా తెలపాలని పేర్కొన్నారు. నా వ్యాసాలు ఉపద్రవం కలిగించేవిగాను, శాంతిని భగ్నం చేసేవిగాను ఉన్నాయని కూడా ఆ నోటీస్ ఆరోపించింది.

భారత ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఈ దేశంపై దురభిప్రాయాలు కలిగిస్తున్నానని నాపై అన్యాయంగా ఆరోపణలు చేశారు. భారత్‌లో ఇక నివసించలేనని,

భారత్ నా ఇల్లు

> ఈ దేశాన్ని వదిలిపోయేలా భారత ప్రభుత్వం నన్ను బలవంతపెట్టింది. పాత్రికేయురాలుగా పనిచేసేందుకు నాకున్న హక్కును పదహారు నెలల క్రితం హోంమంత్రిత్వ శాఖ నిరాకరించింది.

నా జీవనభృతిని ఆర్జించుకోలేనని స్పష్టమయింది. ఈ ఆరోపణలకు వ్యతిరేకంగా శాసన విహితమైన సంస్థలలో నేను పోరాడుతున్నాను. న్యాయ ప్రక్రియలో నాకు సంపూర్ణ విశ్వాసమున్నది. అయితే ఆ ప్రక్రియ తుది ఫలితం వెలువడే దాకా నేను వేచివుండలేను. నా ఒసిఐ హోదామీద విచారణ కార్యకలాపాలు నన్ను కలవరపరుస్తున్నాయి. ఒసిఐ కార్డు ఉన్న పాత్రికేయుల్లో, ఇతరుల్లో 'అసమ్మతి'ని అణచివేసేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఈ విచారణ సాగుతోందని నేను భావిస్తున్నాను. అధికారులు గతంలో నా వృత్తిని మార్చుకోవాలని నాకు సూచించారు. అయితే నేను ఒక జర్నలిస్టును. ఇది నాకు ఎంతో ప్రియమైన వృత్తి. రుజువులు లేని ఆరోపణల కారణంగా ఈ వృత్తిని త్యజించేందుకు నేను అంగీకరించను. నాకు ఎదురైన సమస్యకు స్పందించి నాకు మద్దతు తెలిపిన పాత్రికేయ ప్రపంచ సహచరులు, స్నేహితులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

భారత్‌లో ఒక జర్నలిస్టుగా నేను గడిపిన అసాధారణ 23 సంవత్సరాలకు అమితంగా కృతజ్ఞురాలిని. సాహసాలు, సమున్నత పరస్పర సంబంధాలతో నిండిన జీవితాన్ని నేను భారత ఉపఖండమంతటా గడిపాను. రెండు దశాబ్దాల భారత చరిత్రకు సాక్షిగా ఉండే అవకాశం నాకు లభించింది. భారత్‌లో ఒక విదేశీ పాత్రికేయురాలుగా ఈ దేశ సంకీర్ణతను, సమున్నత సంస్కృతిని నా ఫ్రెంచ్ పాఠకులతో పంచుకోవడానికి ప్రయత్నించాను. ఇది నాకు సమకూరిన ఒక ప్రత్యేక హక్కు, గౌరవం. భారత ప్రజల ఆదరం, ఔదార్య స్మృతులను, ఈ భూమి నాలో కలిగించిన సౌందర్యానుభూతి స్మృతులను నా మనసులో భద్రంగా నిలుపుకుంటాను. ఢిల్లీ నాకు ప్రియాతి ప్రియమైన నగరం. ఇక్కడే నా జీవితంలో సింహభాగం గడిచింది. ఇప్పుడు దానికి వీడ్కోలు చెప్పవలసిరావడం నాకు అంతులేని విచారాన్ని కలిగిస్తోంది. ఏదో ఒక రోజు నేను మళ్లీ భారత్ తిరిగి రాగలుగుతాననే ఆశ నాకు ఉన్నది.

• వనెసా డౌనక్
దక్షిణాసియా మాజీ కరస్పాండెంట్
La Croix, Le Point, Le Temps, Le Soir





పగుళ్లు వచ్చిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు

కాళేశ్వరం కంచికేనా?

ప్రభుత్వ శ్వేతపత్రంతో ప్రాజెక్టు భవితవ్యంపై నీలినీడలు

"కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకుం టున్నాయి. అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేత పత్రంలో కాళేశ్వరాన్ని ఓ పనికి రాని ప్రాజెక్టుగా ప్రభుత్వం అభివర్ణించింది. కాగ్ నివేదికలోనూ గత ప్రభుత్వం అవసరానికి మించి ఖర్చు చేసిందని పేర్కొంది. వీటన్నింటికి తోడు కుంగిన మేడిగడ్డ బ్యారేజీతో పాటు సీపేజీలతో లీకేజీలు అవుతున్న అన్నారం బ్యారేజీల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. వీటి మరమ్మతులకు నిధుల కొరత ఏర్పడుతోంది. అలాగే 2022 జూలై వరద లకు నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లో 17మోటర్లకు కేవలం ఆరు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. మిగతా మోటర్ల పరిస్థితేంటి? వీటికి మరమ్మతులు చేసేదెవరు? అనేది చర్చనీయాంశంగా మారింది. దీంతో అసలు కాళేశ్వరం ప్రాజెక్టులోని కీలకమైన ఈ కట్టడాలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగా మాత్రమే పనికి వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి."

- అన్నారం బ్యారేజీ కూడా కుంగిపోనుందా!!
- ఇప్పటికే సీపేజీలతో బ్యారేజీ నుంచి నీళ్లు లీక్
- మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగడంతో గేట్లెత్తిన అధికారులు
- వరదలకు మునిగిన కన్నెపల్లి పంపుహౌస్‌లోని 17మోటార్లలో పనిచేసేవి ఆరే..
- ప్రాణహిత-చేవెళ్ల వైపే ప్రభుత్వం మొగ్గు
- కాళేశ్వరం.. పర్యాటక ప్రాంతంగానే మిగిలిపోతుందని అనుమానాలు

వరంగల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. 2016 మే 2వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా.. రూ.84వేల కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును నిర్మించి ప్రారంభించారు. తొలుత రెండు టీఎంసీల చొప్పున 90 రోజుల పాటు ప్రతి ఏటా 180 టీఎంసీల నీటిని గోదావరి నీటిని ఎత్తిపోయా లని లక్ష్యంగా పెట్టుకున్నారు. 18,25,700 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించటంతో పాటు మరో 18,82,970 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో భూపాలపల్లి జిల్లా మహదేవ పూర్ మండలం కాళేశ్వరం సమీపంలో మేడిగడ్డ వద్ద గోదావరిపై ఆనకట్ట నిర్మించారు. 16.17టీఎంసీల నీరు మేడిగడ్డ వద్ద నిల్వ చేసి కన్నెపల్లి పంపహౌస్‌లో ఏర్పాటు చేసిన 17 మోటర్లతో ఎత్తిపోయాలని నిర్ణయించా రు. 2019 జూన్ 21న ఈ ప్రాజెక్టును అప్పటి సీఎం కేసీఆర్ ప్రజలకు అంకి తం చేయగా.. ఆ సమయంలోనే మూడో టీఎంసీ నీటిని ఎత్తిపోసే పనులకు కూడా శ్రీకారం చుట్టారు. దీంతో అంచనా వ్యయం రూ.1.47లక్షల కోట్లకు పెరిగింది. ఆయక ట్టును కూడా 45లక్షలకు పెంచారు. అయితే 2019 నుంచి 2023 వరకు కేవలం 164టీఎంసీల నీటినే ఎత్తిపోశారు. అంతేకాకుండా కేవలం 94 వేల ఎకరాల ఆయకట్టుకు నీరం దించారు. దీంతో పాటు ప్రాజెక్టు కోసం భూములను త్యాగం చేసిన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ రైతులకు చెందిన ఇతర భూములకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎకరం భూమికి కూడా చుక్క నీరందదు. ఉమ్మడి వరం గల్ జిల్లాలోని పలు ప్రాంతాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా కాళేశ్వరం నీళ్ల రైతులకు అందటమే కొంత ఊరట.



నీట మునిగిన కన్నెపల్లి పంపుహౌస్ (ఫైల్)




అన్నారం బ్యారేజీలో బుడుగలు (ఫైల్)

మునిగిన పంప్‌హౌస్.. కుంగిన బ్యారేజీలు..

కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైనవి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కన్నెపల్లి, సుందిళ్ల పంపుహౌస్‌లు. అయితే 2022 జూలై 14వ తేదీన వచ్చిన వరదలకు కన్నెపల్లి, సుందిళ్ల పంపహౌస్‌లు నీట మునిగాయి. సుందిళ్ల పంప్‌హౌస్‌కు పెద్దగా నష్టం లేకున్నప్పటికి కన్నెపల్లి పంప్‌హౌస్‌లో భారీ నష్టం వాటిల్లింది. పంపుహౌస్‌లో ఉన్న పెద్ద క్రేన్‌లు విరిగి అందులో ఉన్న 17మోటర్లపై పడిపోయాయి. ఆ ఘటనలో 7మోటర్లు పూర్తిగా దెబ్బతినగా, 4మోటర్లకు పాక్షింగా నష్టంవాటిల్లింది. అప్పటి నుంచి కన్నెపల్లి పంపుహౌస్‌లోకి ప్రవేశాలను గత ప్రభుత్వం నిషేధించింది. దీంతో లోపల ఏం జరుగుతుందో ఎవరికి తెలియని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వస్తున్నాయి. మొత్తం 17 మోటర్లలో కేవలం ఆరు మోటర్లు మాత్రమే పని చేస్తున్నట్లు

మిగతా 6వ పేజీలో..



అన్నారం బ్యారేజీ 10 గేట్ల ఎత్తివేత

- ఫౌండేషన్ టెస్టుల కోసం 7వేల క్యూసెక్కుల నీరు విడుదల
- ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాల మేరకు పరీక్షలు

మహదేవపూర్ / మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 17 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన అన్నారం(సరస్వతీ) బ్యారేజీ నుంచి శనివారం నీటిని విడుదల చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో 20వ పిల్లరు కుంగిన నేపథ్యంలో జాతీయ ప్రాజెక్టుల రక్షణ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలనూ పరిశీలించే అవకాశాలుఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అన్నారం బ్యారేజీ నిర్మాణ సంస్థ ఆఫ్కాన్ కంపెనీ ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన పార్సన్ కంపెనీతో ఫౌండేషన్ టెస్టులు చేయించేందుకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో బ్యారేజీలో శనివారం ఉదయం 2.06 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 10గేట్లను 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, ఒకేసారి పూర్తినీటిని విడుదల చేస్తే దిగువన కాళేశ్వరం, మేడిగడ్డ వద్ద ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో నెమ్మదిగా వదులుతున్నామన్నారు. వచ్చేది వేసవి అయినప్పటికీ తప్పని సరి పరిస్థితుల్లో నీటిని విడుదల చేయాల్సి వస్తోందన్నారు.



వన దేవతల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వనదేవతల దర్శనానికి..

లక్షలాదిగా మేడారానికి తరలొస్తున్న భక్తులు



వనజాతరకు మరికొద్దిరోజులే సమయమున్న నేపథ్యంలో పలు ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వనదేవతల దర్శనానికి తరలొస్తున్నారు. ఈ క్రమంలో శనివారం లక్షమందికి పైగా జనం మేడారం వచ్చారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి తల్లుల సన్నిధికి చేరుకుంటున్న భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి.. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించి.. సమ్మక్క సారలమ్మ గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరసారె సమర్పించుకుంటున్నారు. యాట మొక్కులు చెల్లించుకుంటున్నారు. లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

- మేడారం

భక్తులకు మెరుగైన సేవలందించాలి

- వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : మంత్రి సీతక్క
- మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష
- వివిధ శాఖల సేవలకూ శ్రీకారం



వివరాలు 7లో..

నేడు రాజయ్య ప్రమాణ స్వీకారం



హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 17 : స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా సిరిసిల్ల రాజయ్య ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రమాణ స్వీకారం ఉండనుంది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ ముఖ్యనేతలు హాజరుకానున్నారు.

మహాజాతరకు హుండీలు సిద్ధం

మేడారం, ఫిబ్రవరి 17 : మహాజాతరలో భక్తులు సమర్పించే కానుకల కోసం దేవాదాయ శాఖ అధికారులు మేడారంలో హుండీలను ఏర్పాటు చేస్తున్నారు. 452 ఇనుప, 100 క్లాత్ హుండీలను సిద్ధం చేయగా.. సమ్మక్క పేరుతో 200, సారలమ్మ పేరుతో 200, పగిడిద్దరాజు పేరుతో 26, గోవిందరాజు పేరుతో 26 హుండీలను సిద్ధం చేశామని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనీల్ తెలిపారు. ఇవేకాకుండా మరో 60 హుండీలు మరమ్మతులో ఉన్నాయన్నారు. వీటితోపాటు వంద క్లాత్ హుండీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటన్నిటికి తాళాలు వేసి సీల్ చేసి.. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, మేడారం ఈవో రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సంతకాలతో ఉన్న పేపరు అంటించారు.



కేయూలో పీహెచ్‌డీ అవకతవకలపై విచారణ

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారుల పరిశీలన
- వీసీ, డీన్లు, విభాగాధిపతులతో అంతర్గత సమావేశం
- 25కు పైగా లిఖిత పూర్వక విజ్ఞప్తులు
- ప్రతీ విషయాన్ని ఆలకించిన అధికారులు



వినతి పత్రం ఇస్తున్న కేయూ విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 17 : కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విద్యార్థి సంఘాల ఆందోళనలు, దీక్షలు, పోలీసుల దాడులు, కేసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ చైర్మన్‌గా ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, వెంకటేశ్వర్లు సభ్యులుగా త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లపై లోతుగా పరిశీలన చేసింది. కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, సోషల్ సైన్స్, ఆర్ట్స్, ఫార్మసీ, లా, ఇంజనీరింగ్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్‌తో పాటు ఇతర విభాగాల డీన్లతో వేర్వేరుగా అంతర్గతంగా సమావేశమయ్యారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల నోటిఫికేషన్ మొదలుకుని అడ్మిషన్ల ప్రక్రియనంత క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కమిటీ సభ్యులు ముగ్గురు సీరియస్‌గా అన్ని అంశాలను నోట్ చేసుకుని వాటికి సంబంధించిన పత్రాలను తీసుకున్నారు. ప్రతీ విషయాన్ని సంబంధిత డీన్లతో మాట్లాడి నోట్ చేసుకున్నారు. ఎక్కడ ఎలాంటి అవకతవకలు జరుగలేదని అన్ని వర్సిటీ నియమనిబంధనల మేరకే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు డీన్లు, విభాగాధిపతులు త్రిసభ్య కమిటీ ముందుంచినట్లు సమాచారం.

విద్యార్థులతో ముఖాముఖి

శనివారం మధ్యాహ్న భోజనం ముగిసిన తర్వాత త్రిసభ్య కమిటీ నేరుగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. విద్యార్థులు చెప్పిన ప్రతీ అంశాన్ని సావధానంగా విన్నారు. విద్యార్థులు చెప్పిన అంశాలన్ని లిఖితపూర్వకంగా తగిన ఆధారాలతో అందచేశారు. ఏబీవీపీ జాతీయ కార్యవర్గ నేతలు కమిటీకి సమగ్రమైన అంశాలతో ప్రత్యేకంగా నివేదిక అందచేశారు.

త్రిసభ్య కమిటీకి ఇచ్చిన ఫిర్యాదులో వివరాలు ఇవే ..

పీహెచ్‌డీ కేటాగిరి-2 అడ్మిషన్ల నిబంధనలు కేయూ అకాడమిక్ స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందలేదని, ఆమోదం పొందకుండానే పీహెచ్‌డీ ఎంట్రెన్స్ నిర్వహించారని ఆక్షేపించారు. అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లలో యూజీసీ నిబంధనలు బేఖాతరు చేశారని, పార్టుటైం అడ్మిషన్లు ఫుల్ టైం అడ్మిషన్లుగా డీన్లు మార్చారని ఆరోపించారు. కేటాగిరి-1లో అడ్మిషన్ల చేయగా మిగిలిన సీట్లను అదే ఏడాది కేటాగిరి-2లోకి మార్చాలని నిబంధనల ఉన్నప్పటికీ పాటించలేదని పేర్కొన్నారు. కేటాగిరి-1లో పీహెచ్‌డీ అడ్మిషన్లలో నచ్చిన అభ్యర్థులకు అక్రమంగా ఇంటర్వ్యూలు చేసి సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 2022 ఫిబ్రవరి 3న డీన్లు కమిటీ రూపొందించిన మార్గదర్శకాలను స్టాడింగ్ కమిటీ ముందు పెట్టగా ఆయా పీహెచ్‌డీ మార్గదర్శకాలను ఆమోదించలేదని హైకోర్టులో రిజిస్ట్రార్ కౌంటర్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. యూజీసీ ఎస్సీ ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు అర్హత మార్కులను 45 శాతానికి తగ్గించినప్పటికీ వర్సిటీలో అమలు చేయలేదని పేర్కొన్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు కొన్ని విభాగాల్లో 100 మార్కుల ప్రశ్నా పత్రంలో సమతుల్యత పాటించలేదన్నారు. డీఆర్‌సీతో జరుగాల్సిన పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి అడ్మిషన్లు చేపట్టారని దీంతో ఇంటర్వ్యూల్లో తమకు అనుకూలమైనవారికీ మార్కులు ఎక్కువగా వేసి నచ్చిన వారికి సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ ఇంటర్వ్యూ అడ్మిషన్ల కమిటీలో గందరగోళం నెలకుందని, నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. వర్సిటీ పీహెచ్‌డీ రికార్డులను టాంపరింగ్ చేశారని పేర్కొన్నారు. కొందరూ వర్సిటీలో పనిచేస్తూ అక్రమంగా పీహెచ్‌డీ అడ్మిషన్లు పొందారని ఆరోపించారు. ప్రత్యేకంగా లా, సివిల్ ఇంజనీరింగ్, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇంగ్లీష్, బయోటెక్నాలజీ, ఫార్మసీ, ఇంజనీరింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాల్లో జరిగిన అవకతవకలను విన్నవించారు.

రెండు రోజుల్లో కమిటీ నివేదిక

శనివారం కేయూలో ఉన్నతాధికారులు, డీన్లు, విద్యార్థి సంఘాల నేతల నుంచి సమగ్రమైన సమాచారాన్ని సేకరించామని కేయూ త్రిసభ్య కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. మొత్తంగా 25 విజ్ఞప్తులు వచ్చాయని ప్రతీ అంశాలన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఈ నెల 19, 20 వరకు రిపోర్టును అందచేస్తామని కేయూ పీహెచ్‌డీ నిజ నిజనిర్ధారణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ తెలిపారు.

హనుమకొండ డీటీసీ బదిలీ

- ఆయన స్థానంలో ఆదిలాబాద్ డీటీసీ శ్రీనివాస్ నియామకం

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 17 : హనుమకొండ ఆర్టీఏ కార్యాలయంలోని అధికారులందరూ వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పనిచేస్తున్న పురుషోత్తం కరీంనగర్ డీటీసీగా బదిలీ అయ్యారు. అయన స్థానంలో ఆదిలాబాద్‌లో డీటీసీగా పనిచేస్తున్న పుప్పాల శ్రీనివాస్ నియమితులయ్యారు. అలాగే సీనియర్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కంచె వేణు హుజూరాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మరొక వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వరంగల్ ఆర్టీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. కార్యాలయంలో అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మాధవి, ఫహిమా సుల్తానాలు ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు.

మరో ఏఎంవీఐ స్రవంతి కరీంనగర్‌కు బది లీ అయ్యారు. ఎంవీఐలుగా మరో ఇద్దరు వేణుగోపాల్, కిశోర్‌బాబు నియామకమయ్యారు. బదిలీ అయిన అధికారులు శనివారం బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. కాగా, నూతనంగా నియమితులైన అధికారులు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

నీటి సంపులో పడి అన్నాచెల్లి మృతి

- అర్ధరాత్రి ఇంటిబయటకు వచ్చి.. చీకట్లో సంపు కనిపించక అందులో పడ్డ చిన్నారులు
- ఇద్దరు బిడ్డల్ని పోగొట్టుకుని తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు
- బాధిత కుటుంబానిది తాండూరు
- మేడారం జాతర కోసం వరంగల్‌లోని అత్తింటికి వచ్చిన కుటుంబం



శౌర్యతేజ (ఫైల్)



తేజస్వినీ (ఫైల్)

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 17: మేడారం మహాజాతరకు వెళ్లి సమ్మక్క,సారలమ్మలను దర్శించుకోవాలన్న ఆనందంలో తన కుమారుడు, కూతురితో అత్త వారింటికి వచ్చిన ఆ దంపతులకు తీరని గుండెకోత మిగిలింది. రాత్రి వరకు వచ్చీరాని మాటలతో తమ తో సరదాగా గడిపి.. పెద్దవాళ్లంతా నిద్రకు ఉపక్రమించిన క్రమంలో మూత్ర విసర్జన కోసమని బయటకు వచ్చిన ఆ అన్నాచెల్లెలు సంపులో పడి ప్రాణాలు పోగొ ట్టుకున్నారు. ఈ విషాద సంఘటన శుక్రవారం అర్ధరాత్రి వరంగల్‌లోని ఏను మాముల బాలాజీనగర్‌లో జరిగింది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌లోని ఏనుమాముల బాలాజీనగర్‌కు చెందిన శ్రీనివాస్, రమ దంపతులు 30 ఏళ్లుగా మార్కెట్ సమీపంలో టీ షాపు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు కాగా పెద్ద కూతురు బాలేశ్వరిని ఆరేళ్లక్రితం వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన కరనం రవితేజకు ఇచ్చి వివాహం చేశారు. వారికి శౌర్యతేజ(3), తేజస్విని(ఏడాదిన్నర) సంతానం. రవితేజ పౌరహిత్యం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. త్వరలో జరిగే మేడారం జాతరకు రావాలన్న యోచనలో శుక్రవారం సాయంత్రం రవితేజ తన కుటుంబంతో కలిసి వరంగల్ బాలాజీనగర్‌లోని అత్తవారింటికి వచ్చాడు. రాత్రి భోజనాల య్యాక అందరూ నిద్రపోయారు. శౌర్యతేజ, తేజస్విని సెల్‌ఫోన్ చూసుకుంటూ ఉన్నారు. రాత్రి 11గంటల తర్వాత వారిద్దరూ మూత్ర విసర్జన కోసం ఇంటిబయట ఉన్న స్నానాలగదికి వెళ్లేందుకు బయటకు వచ్చారు. కానీ చీకటిగా ఉండటంతో ఇంటి ఆవరణలో మూతతీసి ఉన్న సంపులో పడిపోయారు. కొద్దిసేపటి తర్వాత చిన్నారులు మంచంపై కనిపించకపోయేసరికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు రవితేజ, బాలేశ్వరి, తాత శ్రీనివాస్, అమ్మమ్మ రమ బయటికి వచ్చి చుట్టుపక్కల వెతికారు. కానీ వారు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి సంపులో చూడగా శౌర్యతేజ, తేజస్విని నీటిలో కనిపించారు. వెంటనే వారిని బయటకు తీసి ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్, రమ దంపతుల మను వడు, మనవరాలు ఇద్దరు పిల్లలు సంపులో పడి చనిపోయారన్న వార్తతో బాలాజీనగర్‌లో విషాదం అలుముకుంది. ఇక ఒకేరోజు ఇద్దరు బిడ్డలను పోగొట్టుకున్న రవితేజ, బాలేశ్వరి దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

సెల్‌ఫోన్ ఇవ్వడమే కొంపముంచింది..

రాత్రి భోజనం తర్వాత తమ చిన్నారులకు సెల్‌ఫోన్ ఇవ్వడమే తమకు శాపమైందని తండ్రి రవితేజ గుండెలవిసేలా రోదిస్తున్నారు. 'మేం ప్రయాణం చేసి అలసి పోయి నిద్రపోయాం. పిల్లలిద్దరూ సెల్ ఫోన్ చూసి పడుకుంటారని అనుకున్నాం. కానీ అంతలోనే ఇంత దారుణం జరుగుతుందని ఊహించలేకపోయాం. అందరి తల్లిదండ్రులకు చేతులెత్తి మొక్కుతున్నాం. పిల్లలకు సెల్‌ఫోన్ చూడటం అలువాటు చేయవద్దు.. ప్లీజ్ అంటూ విలపించడం అక్కడి వారిని కంటతడిపెట్టించింది.

కాళేశ్వరం.. కంచికేనా?

5వ పేజీ తరువాయి

సమాచారం. మిగతా మోటర్లను మరమ్మతులకు నోచుకోకపోవటంతో అందులో ఎన్ని పనికి వస్తాయో అనేది తెలియటం లేదని అధికారులు పేర్కొంటున్నారు. పూర్తిస్థాయిలో పంప్‌హౌస్ వినియోగంలోకి రావాలంటే కనీసం రూ.1200కోట్లు అవసరంగా గతంలో ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ అవస్థల్లో ఉండగానే 2023 అక్టోబరు 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 20 పిల్లర్ కుంగిపోయింది. దీంతో పాటు 18, 19, 21, 22వ పిల్లర్లకు కూడా పగుళ్లు ఏర్పడినట్టు అధికారులు గుర్తించారు. దీని మరమ్మతుల కోసం సుమారు రూ.450కోట్లు అవసరంగా అధికారులు అంచనా వేశారు. అయితే బ్యారేజీ నిర్మాణంలోనే లోపాలు ఉన్నాయని, డిజైన్ లోపంతో బ్యారేజీకి ప్రమాదం పొంచి ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అధికారులు నివేదిక ఇచ్చారు. దీనిపై విజిలెన్స్ విచారణలో కూడా మేడిగడ్డ బ్యారేజీ పనికిరాద నే తేల్చి చెప్పింది. దీంతో బ్యారేజీ మొత్తం కూల్చి కట్టాలంటే మళ్లీ రూ.4,500 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీపై ప్రభుత్వం ఎటూ తేల్చలేక పోతోంది. మరోవైపు మరో కీలకమైన అన్నారం బ్యారేజీలోనూ లోపాలు వెలుగులోకి వచ్చాయి. 2023 అక్టోబరు 27న అన్నారం బ్యారేజీలో పలు పిల్లర్ల వద్ద సీపేజ్‌లు కనిపించాయి. దీంతో బ్యారేజీలో నీళ్ల లీకేజీతో పెద్ద పెద్ద బుడుగలు రావటంతో అధికారులు అప్పటిక ప్పుడు సిమెంట్ బ్యాగుల్లో ఇసుక నింపి సీపేజ్‌లను రాకుండా కట్టడి చేశారు. ఇది కూడా మేడిగడ్డ బ్యారేజీ టెక్నాలేజీతోనే నిర్మించారు. ఇటీవల మరోసారి బ్యారేజీలో బుంగలు ఏర్పడంతో ఇంజనీర్లలో ఆందోళన వ్యక్తం అయింది. భూపాలపల్లి జిల్లాలో ఉన్న కీలకమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటు కన్నెపల్లి పంపుహౌస్‌లు ప్రమాదంలో ఉండటం చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరంపై ప్రభుత్వం వెనుకడుగు..

కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును మొదటి నుంచి వ్యతిరేకిస్తుంది. ప్రాణహిత-చెవేళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం కట్టడం గత ప్రభుత్వం చేసిన తప్పుగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొంటున్నారు. శనివారం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయటం అసాధ్యమని, కనీసం అక్కడ కాఫర్ డ్యామ్ కూడా నిర్మించే పరిస్థితి లేదని మంత్రి ఉత్తమ్ తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం రూ.38 వేల కోట్లతో ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టు పూర్తయ్యేదని, రూ.1.47లక్షల కోట్లకు అంచనాలను పెంచి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీంతో భారీగా అక్రమాలు జరిగినట్లుగా ప్రభుత్వం పేర్కొంటుంది. దీంతో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరిగిన నష్టాన్ని నిర్మాణ సంస్థలే భరించేందుకు ముందుకు రాకపోవటంతో ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వెనుకడుగు వేస్తుందనే చర్చ జరుగుతోంది. అన్నారం బ్యారేజీలో లీకేజీలు కూడా భవిష్యత్తులో బ్యారేజీకి ప్రమాదాన్ని తెచ్చి పెడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీంతో మరో రూ.25వేల కోట్లు వెచ్చిస్తే చెవేళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణంతో పాటు 18లక్షల ఎకరాలకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని, కాళేశ్వరం ప్రాజెక్టు కంటే ప్రాణహిత- చెవేళ్ల ప్రాజెక్టును వినియోగంలోకి తేవటం ఉత్తమమని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం చెవేళ్ల-ప్రాణహిత వైపే మొగ్గు చూపితే ఇప్పటికే నిర్మాణమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు భవిష్యత్తులో పర్యాటక ప్రాంతాలుగానే మిగిలి పోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్థక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై షైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై షైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా... సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై షైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్ప గుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్లు కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి

వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలి : పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

మేడారంలో వైద్య అధికారులతో సమీక్ష ● వివిధ శాఖల సేవలకూ శ్రీకారం



ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 17 : మేడారం తరలొచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అదించాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క వైద్యఅధికారులకు ఆదేశించారు. శనివారం మేడారం పర్యటనలో భాగంగా ఆమె హెల్త్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ క్రిస్టినా, మహాజాతర నోడల్ అధికారి, హెల్త్ డైరెక్టర్ ఆర్.వి కర్ణన్, ఐటీడీఏ పీవో అంకిత్‌లతో కలిసి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. మేడారం మహాజాతరలో భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టీనా చోంగ్తు మాట్లాడుతూ జాతరలో ముఖ్యంగా వ్యాపారులు భక్తులకు విక్రయించే ఆహారంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు భక్తులకు తెలిసే విధంగా సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని, గద్దెల ప్రాంగణంలో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో 24గంటల పాటు వైద్య సేవలు అందించాలని, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ 40జీవీకే అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, రద్దీ ఎక్కువగా ఉండేప్రాంతాలలో నిరంతరం వైద్య సిబ్బంది ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జంపన్నవాగు ప్రాంతంలో గజ ఈతగాళ్లను మోహరించాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో క్యూలైన్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా వైద్యాధికారి అప్పయ్యసామాజిక ఆరోగ్యకేంద్రం వెద్యాధికారి జగదీశ్, ఏటూర్‌నాగారం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సురేష్, ఇతర వైద్య అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బైక్ అంబులెన్సు సేవలు ప్రారంభం

మహాజాతరలో భక్తులకు అత్యవరస వైద్య సేవలు అందించేందుకు వీలుగా బైక్‌అంబులెన్స్‌లను మంత్రి సీతక్క, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు, హెల్త్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు. మేడారం భక్తులకు అత్యవసర వైద్యం కోసం 40బైక్ అంబులెన్సులు అందుబాటులో ఉంటాయని, ఈబైక్ అంబులెన్సుల ద్వారా 21 వైద్య సేవలను అందించే వీలుందన్నారు.

మేడారం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి సీతక్క అన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే సమ్మక్క సారలమ్మల జాతర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నా రు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు ఉన్నచోట అదనపు ప్లాస్టిక్ బకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి కొరత లేకుండాచూడాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో మరుగుదొడ్ల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నా రు. నిరంతరం విద్యుత్ అందిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో ములుగు కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీష్ అదనపు కలెక్టర్ శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారులున్నారు.

మీడియాతో ఆత్మీయ సమ్మేళనం

మహాజాతర విజయవంతానికి సన్నద్ధం చేస్తున్న అధికారులు మీడియా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని మంత్రి సీతక్క అన్నారు. గిరిజన బాలికల ఆశ్రమ ఇంగ్లీష్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె తొలుత సమాచారపౌరసంబంధాల శాఖ రూపొందించిన మేడారం పుస్తకాన్ని, మీడియా టీషర్టులను కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శబరీష్‌తో కలిసి ఆవిష్కరించారు. జాతర విజయవంతం చేయడంలో మీడియాకీలకపాత్ర పోషించాలని, సమ్మక్క సారలమ్మ మహా జాతరకీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూలాల తెలిసే వార్తలు ప్రసారం చేయాలని కోరారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వసతులు, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి జాతరకొచ్చే భక్తుల కోసం రూట్‌మ్యాప్ వీడియోను మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, ఏటూరునాగారం అదనపు ఎస్పీ శిరిశెట్టి సంకీర్త్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, సమాచార శాఖ అదనపు డైరెక్టర్‌లక్ష్మణ్, జిల్లా పౌరసంబంధాల అధికారి రఫీక్, ఏపీఆర్‌వో వేణు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

6వేల ప్రత్యేక బస్సులు

అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేకంగా 6వేల బస్సులను నడపడానికి సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. శనివారం మేడారంలో తాత్కలిక ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ 55ఎకరాల విస్తీర్ణంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా టికెట్ కౌంటర్‌లు, విశ్రాంతి గదులు, సిబ్బంది వసతి ఏర్పాట్లు చేశామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జాతరకు వచ్చే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణసౌకర్యం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు ఈసారి అధికంగా వచ్చే అంచనాలు ఉన్నందున గతంలో కంటే ఎక్కువగా 6వేల బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజా, అదనపు ఎస్పీ సంకీర్త్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత, ప్రత్యేకాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్ల ప్రసాదం

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర సందర్భంగా అమ్మవార్ల జాతరకు వెళ్లలేని భక్తులు తమ కానుకలను, మొ క్కులను ఆన్‌లైన్ ద్వారా అమ్మవార్లకు చెల్లిస్తే, ఆర్టీసీ కార్గో ద్వారా భక్తుల ఇం టికే ప్రసాదం అందించే ఏర్పాట్లు అధికారులు చేశారు. ఈనెల 21 నుంచి 25 వరకు దేవాదాయ శాఖతో ఆర్టీసీ కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ప్రతీ బస్సుస్టేషన్ ప్రాంతంలో కార్గో కొరియర్ సేవలందించే కార్యాలయం వద్ద రూ. 300 అమ్మవార్లకు చెల్లిస్తే, భక్తుల ఇంటికి ప్రసాదాలు పసుపు, కుంకుమలు అందజేస్తారు. వివరాలకు 040-69440069 / 69440000 / 23450033 లకు సంప్రదించాలని కోరారు.

మేడారంలో చోరీ - రూ.11.42 లక్షల అపహరణ

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17 : మేడారంలో దొంగలు సంచరిస్తున్నారని, జంపన్నవాగు, తల్లుల గద్దెలు, ఆర్టీసీ బస్టాండ్, చిలకలగుట్ట మార్గంలో ఇప్పటికే 16 చోరీలు జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. ఓ కొబ్బరికాయలు, బెల్లం వ్యాపారం నిర్వహించే షాపులో శుక్రవారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. రాత్రి సమయంలో నిర్వాహకులు షాపు మూసి వెళ్లిన తర్వాత షాపులోకి చొరబడ్డారు. షాపులో ఉన్న రూ. 11.42 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్టు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జంపన్నవాగు ప్రాంతంలో ఒక మహిళ మెడలో నుంచి 30 గ్రాముల పుస్తెల తాడు చోరీకి గురైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

కృష్ణా జలాలపై వాదనలో కేసీఆర్ పాల్గొనాలి

కాజీపేట, ఫిబ్రవరి 17: కృష్ణా జలాలపై ఈనెల 26, 27న కోర్టులో జరిగే వాదనల్లో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొని తన వాణిని వినిపించాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు గట్టు ప్రసాద్ బాబు అన్నారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాలపై ఇప్పుడు మాట్లాడుతున్న కేసీఆర్, హరీ‌ష్‌రావు గతంలో ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. గోదావరి, కృష్ణా నదులపై మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు అక్రమ ప్రాజెక్టుల నిర్మాణాలు అడ్డుకోలేదన్నారు. ఇప్పటికైనా కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు, తెలంగాణ పార్టీల అఖిల పక్ష నాయకులను తీసుకెళ్లి ట్రిబ్యూనల్‌లో, సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు చాడ మరియ, కాగితాల జయశంకర్, పిట్టల శ్రీనివాస్, భైరపాక ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జూ పార్కుకు పెద్దపులి, అడవి దున్న

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: వరంగల్ నగరంలోని కాకతీయ జూ పార్కుకు త్వరలో పెద్దపులి, అడవి దున్నను సందర్శకులకు ప్రదర్శనగా ఉంచాలని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏప్రిల్ 1 నుంచి జూ పార్కులో పెద్దపులితోపాటు అడవి దున్న, మరో రెండు రకాల జింకలను సందర్శకులకు అందుబాటులో ఉంచుతామని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఎంసీ పర్గేయిన్ తెలిపారు. ప్రస్తుతం జూ పార్కులో ఉన్న సౌకర్యాలు అదనపు ఏర్పాట్లపై జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు.

జూ పార్కులో కొత్తగా ఏర్పాటు చేసిన పక్షుల కేంద్రాన్ని బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించారు. గూడూరు అటవీ డివిజన్ ప్రాంతంలో పులిమడుగు గ్రామం వద్ద ఏకో టూరిజం క్యాంపింగ్‌ను పర్గే ఇన్ ప్రారంభించారు. పాకాల అభయారణ్యం అభివృద్ధి సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ భీమా నాయక్, వరంగల్ డీఎఫ్‌వో భూక్యా లావణ్య, గూడూరు, మహబూబాబాద్ డివిజన్ అటవీ అధికారులు చంద్రశేఖర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ సలహాదారు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 17: శ్రీభద్రకాళి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కారా వేణుగోపాల్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను వేణుగోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు, సీఎం రేవంత్ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ జగన్మోహన్‌రావు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఈవీవీ శ్రీనివాసరావు, జి.నాగభూషణం, కె.ప్రవీణ్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన రాష్ట్రప్రభుత్వ సలహాదారు

హనుమకొండ క్రైం: వ్యక్తిగత పనిపై వరంగల్‌కు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ వరంగల్ సీపీని శనివారం కలిశారు. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. సీపీని కలిసిన వారిలో ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మెన్ ఎస్. జగన్మోహన్‌రావు, లేబర్ అడ్వయిజరీ బోర్డు మాజీ సభ్యులు జి. నాగభూషణం, కె.ప్రవీణ్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీనివాస్, కొత్తపెల్లి ప్రసాద్, బొద్దిరెడ్డి సతీష్‌రెడ్డిలు ఉన్నారు.



హంటర్ రోడ్‌లోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బండా ప్రకాశ్



హసన్‌పర్తిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్



బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వినయభాస్కర్

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న పార్టీ నేతలు, కార్యకర్తలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 17 : బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శనివారం హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో, నగరంలోని డివిజన్ కేంద్రాల్లో కేసీఆర్ జన్మదిన వేడుకలు జరిపారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అలాగే వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అరూరి రమేశ్ వర్ధన్నపేట నియోజకవర్గంలో పలు డివిజన్‌లు, గ్రామాల్లో నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. 55వ డివిజన్ భీమారంలో, 66వ డివిజన్ హసన్‌పర్తిలో, 65వ డివిజన్ సుబ్బయ్యపల్లిలో నిర్వహించిన వేడుకల్లో అరూరి పాల్గొని పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో జరిగిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. కేసీఆర్ రాష్ట్ర సాధన కోసం చేసిన సేవలను, ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, సుందర్‌రాజ్, మర్రి యాదవరెడ్డి, పులి రజనీకాంత్, కార్పొరేటర్లు జక్కుల రజిత వెంకటేశ్వర్లు, సిరంగి సునిల్ నేతలు అటికం రవీందర్, రాయికంటి సురేష్, నాయకపు శ్రీనివాస్, ముచ్చ వెంకటస్వామి, నాతి సమ్మయ్య, సరోజన తదితరులు పాల్గొన్నారు.

● హసన్‌పర్తి: మండల కేంద్రంలో కేసీఆర్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ పాల్గొని కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో 65వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, జడ్పీటీసీ రేణుకుంట్ల సునిత, వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ దివ్యరాణి, నాయకులు కందుకూరి చంద్రమోహన్, అంచూరి విజయ్, పిట్టల కుమారస్వామి, రజనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● సుబేదారి : మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రానికి చేసిన సేవ ఎనలేనిదని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా హంటర్ రోడ్‌లోని క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు పి.అశోక్, పి.రజనీకాంత్, రాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్ కల్లు మండువ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జంక్షన్‌లో కేసీఆర్ జన్మదిన వేడుకలను కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్రోజు మణీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజుగౌడ్, మాజీ ఉప సర్పంచ్ చింత రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు లోకిని చందర్, దేవునూరి శంకర్, కందుకూరి రాజ్‌కుమార్, ఇమ్మడి రాజేంద్రప్రసాద్, గూడెం రమేష్, అభినయ్, పాల్గొన్నారు.

● కాజీపేట : కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ అర్బన్ జిల్లా కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో రాష్ట్ర నాయకుడు నార్లగిరి రమేశ్, 61వ డివిజన్ కార్పొరేటర్ ఎలకంటి రాములు, నాయకులు శిరిమళ్ల దశరథం, ఎమ్డీ అఫ్జల్, ఎండీ సోని, పాలడుగుల రామస్వామి, కేంద్ర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● మడికొండ : మడికొండ చౌరస్తాలో బీఆర్ఎస్ 46వ డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు నిర్వహించారు. కార్యక్రమంలో 46 డివజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, 45వ డివిజన్ కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, దర్గా పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, 64వ డివిజన్ నాయకులు దువ్వ శ్రీకాంత్, పోలపల్లి రామ్మూర్తి, బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి నర్సింగ్ భిక్షపతి గాండ్ల, బీఆర్ఎస్ నాయకులు అల్లం శ్రీనివాస్, పేపర్ రవి, వల్లెపు ఉపేందర్, వస్కుల దేవేందర్, బరిగెల క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● ఐనవోలు : మండలంలోని పున్నేలు కనుకదుర్గా వృద్ధాశ్రమంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొని కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుర్ర రాజశేఖర్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మరుపట్ల నరేష్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చంద్రశేఖర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, చైర్మన్ పురుషోత్తంరెడ్డి

ఘనంగా చైతన్య యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవం

నయీంనగర్, ఫిబ్రవరి 17: హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య విశ్వవిద్యాలయం 12వ స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, భారత ప్రభుత్వ మాజీ సెక్రటరీ ఎస్.చంద్రశేఖర్, గౌరవ అతిథులుగా మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, డాక్టర్ రెడ్డిస్ ల్యాబ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎ.కళ్యాణచక్రవర్తి, చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సీహెచ్‌వీ.పురుషోత్తంరెడ్డిలు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ బలమైన పునాదితో మాత్రమే కాకుండా విశ్లేషణాత్మక పరాక్రమం, వినూత్న ఆలోచనలు, సానుభూతి లక్షణాలను సజావుగా మిళితం చేసే విలక్షణమైన నాయకులుగా విద్యార్థులు ఎదగాలన్నారు. మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే చైతన్య డీమ్డ్ యూనివర్సిటీగా రావడంతో ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అన్నారు.

చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సీహెచ్‌వీ.పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ 2019 సంవత్సరంలో చైతన్య కళాశాల డీమ్డ్ యూనివర్సిటీగా మారిందని, 24 సంస్థలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుందన్నారు. అనంతరం ఎస్.చంద్రశేఖర్, ఇ.పెద్దిరెడ్డి, సీహెచ్‌వీ.పురుషోత్తంరెడ్డిల చేతుల మీదుగా డిగ్రీ, పీజీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 18 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 756 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలను అందజేసి అభినందించారు. స్నాతకోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో చైతన్య యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.దామోదర్, సీఏవో డాక్టర్ సీహెచ్.సాత్విక రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు, ఓఎస్డీ డాక్టర్ కె.వీరవెంకటయ్య, వివిధ శాఖాధిపతులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు పెట్రో ఫిల్లింగ్ స్టేషన్‌కు అవార్డుల పంట



సిబ్బందిని ప్రశంసిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17 : తెలంగాణ రాష్ట్ర పెట్రో డీలర్స్ అవార్డు 2023-24 సంవత్సరానికి గాను వరంగల్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ వెల్ఫేర్ సొసైటీ వరంగల్ కాకతీయ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్‌కు అవార్డుల పంట పండింది. ఏకంగా మూడు అవార్డులను కైవసం చేసుకుంది. ప్రతీ యేడాది భారత్ పెట్రోలియం సంస్థ డీలర్స్ ప్రకటించే అవార్డులను వరంగల్ కమిషనరేట్ బంకు సాధించింది. ప్రతీ సంవత్సరం వాహనదారులకు అందించే పెట్రోల్, డీజిల్, నాణ్యత ప్రమాణాలను గుర్తించి ఈ అవార్డులను అందిస్తారు. ఈ అవార్డులను పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ ఇన్‌చార్జి సురేంద్ర, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ ప్రభాకర్‌రెడ్డిలకు సీపీ అంబర్ కిశోర్ ఝా చేతుల మీదుగా ఈ అవార్డులను అందించారు. పెట్రోఫిల్లింగ్ స్టేషన్ సిబ్బందికి, అధికారులకు సీపీ అభినందనలు తెలిపారు.

ఆల్ ఇండియా డ్యూటీమీట్‌లో ఎస్ఐకి గోల్డ్‌మెడల్

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17 : ఆల్ ఇండియా డ్యూటీ మీట్‌లో వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించారు. ఈ నెల 12 నుంచి 16 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన పోలీసు డ్యూటీ మీట్‌లో విజయ్‌కుమార్ సైంటిఫిక్ ఏయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఫొటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఐజీ మనోజ్ యాదవ్ చేతుల మీదుగా ఈ పతకాన్ని అందుకున్నాడు. మెడల్ సాధించిన విజయ్‌కుమార్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝాతో పాటు పోలీసు సిబ్బంది అభినందించారు.



గోల్డ్‌మెడల్ స్వీకరిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

పెట్రోల్‌తో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 17 : పెట్రోల్ దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గురువారం కేయూ స్టేషన్ పరిధిలోని తులసి బార్ సమీపంలో మద్యం మత్తులో చందు అనే వ్యక్తిపై బాలాజీ పెట్రోల్ పోసి నిప్పు అంటించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో చందుకు తీవ్ర గాయాలుకాగా హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, దాడి చేసిన బాలాజీని శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

తెలుగు స్వరాలను విశ్వానికి చాటిన ఘంటసాల

• స్వరసామ్రాట్ డాక్టర్ శరత్‌చంద్ర • ఘనంగా ఐ డోల్ గంధర్వ-2024

వడ్డెపల్లి, ఫిబ్రవరి 17: తెలుగు స్వరాలను విశ్వానికి చాటిచెప్పిన ఘనత మధుర గాయకులు ఘంటసాలకే దక్కుతుందని స్వరసామ్రాట్ డాక్టర్ టి.శరత్‌చంద్ర, ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్‌బాబు అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ, ఘంటసాల సంగీత కళాశాల ఇంటర్నేషనల్ స్వర సామ్రాట్ డాక్టర్ టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో ఐ డోల్ గంధర్వ-2024ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత పద్మశ్రీ ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేశారు. నమో వెంకటేశా అనే సినీ భక్తి గీతాన్ని గాయకులు సామూహికంగా ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. ఎందరో గాయకులు ఘంటసాల పాడిన అలనాటి ఆపాత మధురాలను ఆలాపించారు.

ఈ సందర్భంగా డాక్టర్ టి.శరత్‌చంద్ర, గట్టు మహేష్ బాబు మాట్లాడుతూ ఓరుగల్లు కళాకారులకు పుట్టినిల్లు అని అన్నారు. కళాకారులకు కొదువ లేదని ఎందరో మహా కళాకారులు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎదిగి సినీ జగత్తులో నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో కాకతీయ మ్యూజికల్ క్లబ్ అధ్యక్షుడు తిరుపతయ్య, సంగీత ప్రియులు జగన్నాథాచార్యులు, మధుసూదన్‌రావు, మహ్మద్ సిరాజొద్దీన్, సునిత, కర్ణకంటి పోతనాచారి, రంగు రఘుపతి, మాధవి, టీవీ రమేష్, లక్కిరెడ్డి సంజీవరెడ్డి, పుల్లూరి మధు, రవికుమార్, గాయని, గాయకులు, ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ భవన్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శరత్‌చంద్ర, గట్టు మహేష్‌బాబు

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి గోపాల్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 17: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి ఎ.గోపాల్ అన్నారు. హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. జీజేఎల్‌ఏ అధ్యక్షుడు బీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడిని అధిగమించి పరీక్షలు ఎలా రాయాలో వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ కోశాధికారి చకిలం రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్ బి.సునీత, అధ్యాపకులు ఎం.కుమార్, జె.చాంప్లా, ఎల్.కొమురారెడ్డి, సదానందం, రాణి, సాయిప్రసాద్, సైదుల సాహెబ్, సుమలత, సౌజన్య పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ ఉద్యోగాలు కేటాయించాలి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 17: వరంగల్ ఉమ్మడి జిల్లాలో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం భూములను కోల్పోయిన తమకు ఆపరేటర్ ఉద్యోగాలను కేటాయించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా భూనిర్వాసితుల సంఘం కన్వీనర్లు ముల్కనూరి దామోదర్, శ్రీపతి రాకేష్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో 2014-17లో 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 150 మంది రైతుల నుంచి భూమిని ప్రభుత్వం తీసుకుందని అన్నారు. ఆ సమయంలో తమకు సబ్‌స్టేషన్లలో ఆపరేటర్ ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికిన టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులు తమ హామీని విస్మరించారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీఎస్ ఎన్పీడీసీఎల్ అధికారులను సంప్రదించి వినతి పత్రాలను సమర్పించి తమ గోడును వెల్లబోసుకున్నా ఫలితం లేదని వాపోయారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఆపరేటర్ ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భూ నిర్వాసితులు దొగ్గెల వీరన్న, నరేడ్ల పవన్ కల్యాణ్, గుగులోత్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న దామోదర్, శ్రీపతి రాకేష్

బీసీ కులగణనతో సమగ్ర న్యాయం

ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 17 : ప్రభుత్వం చేపడుతున్న బీసీ సమగ్ర కులగణనతో బీసీలందరికీ న్యాయం జరుగుతుందని దీన్ని స్వాగతిస్తున్నామని బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం కేయూ దూర విద్య కేంద్రంలో బీసీ నేత, పాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూరపాటి వెంకటనారాయణ పాల్గొని మాట్లాడారు. ఇప్పటి అనేక మార్లు జనాభా గణన జరిగినప్పటికీ కుల గణన జరుగలేదని తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో బిల్లు పెట్టి సమగ్ర కులగణన చేపట్టారని చెప్పారు. కేయూ మాజీ రిజిస్ట్రార్ సదానందం, డాక్టర్ సంగాని మల్లేశ్వర్‌లు మాట్లాడుతూ..బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకున్న రాజకీయ పార్టీల తీరును అక్షేపించారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ వడ్డె రవీందర్, అడ్వకేట్ దయ్యాల సుధాకర్, బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యాంయాదవ్, అడ్వకేట్ గునిగంటి శ్రీనివాస్, డాక్టర్ వి.వీరాచారి, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ శివనాగయ్య, డాక్టర్ చాగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తోట శంకరయ్య(ఫైల్)

మడికొండ, ఫిబ్రవరి 17: మడికొండ మెట్టు రామన్న కాలనీకి చెందిన తోట శంకరయ్య ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల మేరకు... శంకరయ్య మతిస్థిమితం సరిగా లేక అప్పుడప్పుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజుల తర్వాత తిరిగి వస్తుండే వారు. అలాగే ఈ నెల 15న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శనివారం కుమారుడు తండ్రి సెల్‌కు ఫోన్ చేయగా మడికొండలోని హిల్స్ కాలనీ ఏరియాలో ఓ చెట్టు కింద అపస్మారక స్థితిలో ఉండగా కొందరు 108కు ఫోన్ చేసి ఎంజీఎంకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు తోట యాదగిరి వెళ్లి తన తండ్రి శంకరయ్యగా నిర్ధారించారు. అతని ఫిర్యాదు మేరకు పంచనామా జరిపి కేసు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వివాహం చేసుకుంటానని మోసం

పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17: వివాహం చేసుకుంటానని ఓ యువకుడు నమ్మించి పారిపోయిన ఘటన హనుమకొండ కుమార్‌పల్లిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన ప్రకారం.. హసన్‌పర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బీటెక్ పూర్తి చేసిన మహిళను వెంటపడి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. మహిళ ఒప్పుకోవడంతో హనుమకొండ కుమార్‌పల్లిలో సంవత్సరన్నర కాలంగా ఓ గదిని అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల సదరు యువతి గర్భం దాల్చింది. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుందామని ప్రశాంత్‌ను యువతి కోరడంతో వారు ఉంటున్న గది నుంచి నెల రోజులుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో బాధితురాలు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మద్యం తాగి డబ్బుల కోసం వేధిస్తున్నాడని..

కుటుంబ సభ్యులతో కలిసి భర్తను హతమార్చిన భార్య

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలో ఘటన

దుగ్గొండి, ఫిబ్రవరి 17 : మద్యం తాగడంతో పాటు తనకు డబ్బులు ఇవ్వాలని తరచూ వేధిస్తున్నాడన్న కోపంతో ఆ మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి భర్తను హతమార్చింది. రాళ్లతో కొట్టి ఉరితీసి మరీ చంపిన ఈ సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మైసంపల్లిలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మైసంపల్లి గ్రామానికి చెందిన జేరుపోతుల రాజు(55)కు భార్య లక్ష్మి, కుమారులు ప్రశాంత్, సూర్య, కుమార్తెలు మాధవి, చింటు ఉన్నారు. వీరిలో కుమార్తెలకు వివాహం కాగా.. కుమారులకు వివాహం కాలేదు. రాజు కుటుంబం వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. తాగుడుకు బానిసైన రాజు డబ్బుల కోసం భార్య లక్ష్మిని తరచూ వేధిస్తున్నాడు.

ఈ క్రమంలో రాజు కుటుంబం శుక్రవారం సమ్మక్క దేవుడికి కొలుపు చేసుకోవడంతో ఆ కార్యక్రమానికి కుటుంబసభ్యులంతా హాజరయ్యారు. రోజు వారిగానే శుక్రవారం అర్ధరాత్రి డబ్బుల కోసం భార్య లక్ష్మీతో రాజు గొడవ పడ్డాడు. దీంతో కోపోద్రిక్తులైన భార్య లక్ష్మీ, కుమారుడు సూర్య, కుమార్తె మాధవి, అల్లుడు రాకేశ్, మరో బంధువైన తరుణ్ కలసి రాజును రాళ్లతో కొట్టి ఉరి తీసి చంపారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరమేశ్ శనివారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి పెద్ద కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదుతో ఆ ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్, ఎస్సై పరమేశ్‌లు

భవానీనగర్‌లో అగ్నిప్రమాదం

గ్యాస్‌సిలిండర్ నుంచి చెలరేగిన మంటలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 17 : హనుమకొండ భవానీనగర్‌లో ఓ ఇంట్లో గ్యాస్‌ప్రమాదం చోటు చేసుకుంది. జిల్లా అగ్నిమాపక అధికారి ఏ. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్‌లోని సాదుల సాయికృష్ణ ఇంట్లో వంట వండుతుండగా గ్యాస్ సిలిండ్ నుంచి మంటలు వచ్చాయి. ఇంట్లో ఉన్న వారు బయటకు పరుగులు తీయడంతో కిచెన్‌లో ఉన్న కొంత సమాగ్రి దగ్ధమైంది. వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో సకాలంలో వచ్చి మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ. లక్ష వరకు ఆస్తినష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది వెల్లడించారు. నాసిరకం రెగ్యులేటర్ వాడడం వల్ల ఈ ప్రకారం జరిగిందని ఫైర్ అధికారి నాగరాజు తెలిపారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

ఐనవోలు, ఫిబ్రవరి 17 : మండల వ్యాప్తంగా ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనపరుచుకొని హద్దులు నిర్ణయించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూములను రక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండెకారి మహేందర్, దర్శనాల సంపత్, గబ్బెట రాంకుమా ర్, ఉప్పలయ్య, బాబురావు, ఆనందం, కుమారస్వామి, నాగరాజు, మల్లయ్య, కొంరయ్య, యాకయ్య, పోచమ్మ, సృజన, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రదానం

నయీంనగర్, ఫిబ్రవరి 17: హనుమకొండ నయీంనగర్‌లో వరల్డ్ పునకోషి షోటోకాన్ కరాటే అసోసియేషన్(డబ్ల్యూఎఫ్ఎస్‌కేఏ) జిల్లా అధ్యక్షుడు ఎండి.సలీంపాషా ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టులు ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యుడు కుమ్మరి యాదగిరి, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.వెంకటేశ్వర్లు, డబ్ల్యూఎఫ్ఎస్‌కేఏ రాష్ట్ర అధ్యక్షుడు ఊరుగొండ చంద్రశేఖర్‌లు హాజరై మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం వలన విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పాటు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉంటారని వారు తెలిపారు. కరాటే బెల్టుల ప్రదానోత్సవంలో దాదాపు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని జిల్లా అధ్యక్షుడు ఎండి.సలీంపాషా తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు పి.సురేష్, ఎం.రవి, డాక్టర్ అర్చన, షమీమ్, విద్యార్థులు పాల్గొన్నారు.



కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

సుబేదారి, ఫిబ్రవరి 17: ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అన్నారు. హనుమకొండలోని బీకేఎంయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు.సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు మంచాల తిరుపతి, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర సభ్యులు ఎల్లేష్, భిక్షపతి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇప్పుడు నిర్మాతకు విలువ లేదు

అప్పటితో పోలిస్తే ఇప్పుడు సినీ పరిశ్రమలో వచ్చిన మార్పులు ఏమిటని కొందరు అడుగుతూ ఉంటారు. అప్పట్లో నిర్మాత సర్వస్వతంత్రుడు. తనకు కావల్సిన హీరోను, నచ్చిన దర్శకుణ్ణి, ఇతర టెక్నీషియన్లను పెట్టుకునేవాడు. ఉదాహరణకు మా నాన్న తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారు సినిమాలు తీసే రోజుల్లో వి.మధుసూదన రావు గారు ఆయనకు రెగ్యులర్ డైరెక్టర్. ఆయనతో 'లక్షాధికారి', 'జమీందార్' చిత్రాలు చేశారు. మూడో చిత్రం 'బంగారు గాజులు'కు కూడా మధుసూదనరావు గారినే దర్శకుడిగా అనుకున్నారు. అయితే వేరే వర్క్‌లో బిజీగా ఉండటంవల్ల అను కొంటా.. మధుసూదనరావు గారు స్క్రిప్ట్ చర్చల్లో పాల్గొనలేకపోయారు. నాన్నగారు కోరిన సమయం ఆయన కేటాయించలేకపోయారు. దాంతో నాన్నగారు అక్కినేని నాగేశ్వరరావు గారికి చెప్పి మధుసూదనరావు గారిని మార్చేశారు. సీఎస్‌రావు గారిని దర్శకుడిగా పెట్టుకుని 'బంగారు గాజులు' పూర్తి చేశారు. నాడు నిర్మాతలు హీరోలతో అంత స్నేహపూర్వకంగానూ ఉండేవారు. అదే సమయంలో అంత బలంగానూ నిలబడగలిగేవారు.



ఇవాళ పరిస్థితి ఏమిటంటే ఒక హీరో దగ్గరకు వెళ్లి ఫలానా దర్శకుడితో సినిమా చేద్దామని చెబితే- ఎంత కాలమైన అక్కడ పడివుండాల్సిందే. అతన్ని మార్చుకొనే అధికారం, స్వాతంత్ర్యం పెద్దగా ఉండదు. వాళ్లు తేలుస్తారా? తేల్చరా? హీరో నాటకాలాడుతున్నాడా? దర్శకుడు ఆడుతున్నాడా? అనేది కూడా తెలియని పరిస్థితి. అంతేకాకుండా హీరోతో ఎలాంటి కథ తీయాలనే విషయంపై నిర్మాతకు ఒక ఆలోచన ఉంటుంది. ఎందుకంటే అతను డబ్బు పెడుతున్నాడు కాబట్టి. రిస్క్ చేయకూడదనుకుంటాడు కాబట్టి. కానీ ప్రస్తుతం నిర్మాతకు అలాంటి స్వేచ్ఛ లేదు. కథను నమ్ముకున్న సినిమాలకైతే కొంత వరకు ఆ స్వేచ్ఛ ఉంటోంది. పెద్ద సినిమాలు- నిర్మాత నియంత్రణలో ఉండటం లేదు.

మొన్న టీవీ చూస్తుంటే- ఒకప్పుడు తీసిన సినిమాను ప్రస్తుతం తీస్తే ఎంత అవుతుందనే తులనాత్మక అధ్యయనం చేసిన ఒక వార్త కనిపించింది. అంటే 'ప్రొడక్షన్ కాస్ట్ పెంచుకొంటూ వెళుతున్నాం 'అని చెప్పినట్లే కదా! నాకు తెలిసి అప్పటికీ ఇప్పటికీ కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ పెద్దగా ఏమీ పెరగలేదు. మారిన రూపాయి విలువతో పాటు పెరిగిన వ్యయమే తప్ప వేరే కారణం లేదు. ఇప్పుడు సినిమాకు థియేటర్ల నుంచి వచ్చే ఆదాయంతో పాటుగా- శాటిలైట్, ఓటీటీలు, ఓవర్సీస్‌లు, హిందీ డబ్బింగ్లాంటి కొత్త మార్కెట్లు వచ్చాయి. దీనితో నిర్మాతకు అనేక అవకాశాలు లభిస్తున్నాయి. అంతే కాకుండా థియేట్రికల్‌గా మన దగ్గర రూపాయి రాకపోయినా ముంబయి మార్కెట్ మీద ఆధారపడి కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ కూడా పెంచుకొంటూ పోయారు. దాంతో వాళ్లు ఫలానా దర్శకుడిని పెట్టండి, ఫలానా నటులను పెట్టండని నిర్దేశిస్తున్నారు. వీటన్నిటి కారణంగా సినిమా మీద ప్రేమ కన్నా డబ్బు, పేరు వస్తున్నాయి కాబట్టి... నిర్మాత అవ్వాలనుకొనేవారు ఎక్కువైపోయారు. ఫలితంగా హీరోలు, దర్శకుల మీద ఆధారపడి, వాళ్లు ఏదంటే అది చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు హీరోలు, దర్శకులు ఏ స్థాయికి వెళ్లారంటే... సినిమా మధ్యలో నిర్మాతను కూడా మార్చేస్తున్నారు. ఎందుకంటే ఆ 'మధ్యవర్తులు ఉంటారు. వాళ్లు అమ్మిపెడతారు. నువ్వు ఉంటే ఉండు. పోతే పో' అని నిర్మాతకు తెగేసి చెప్పే పరిస్థితులు వచ్చేశాయి. ఇవాళ చాలా సినిమాలు థియేట్రికల్‌గా కాకుండా ఓటీటీ మీదో, డబ్బింగ్ రైట్స్ మీదో ఆధారపడి తీస్తున్నవే. దాంతో హీరో, దర్శకుల మీద ఆధారపడి సినిమాలు చేసేస్తున్నాం. చివరకు నిర్మాత అనేవాడికి ఒక విలువ లేకుండా పోయింది. నిర్మాతను నిర్మాతగా చూడకపోవడం ఇప్పుడు నడుస్తున్న ట్రెండ్. అందరూ అలా ఉన్నారని నేను అనను. నిర్మాతలను గౌరవంగా చూసుకొనే హీరోలూ ఉన్నారు. పూర్వం కూడా హీరోకు, నిర్మాతకు మధ్య వివాదాలు వచ్చిన చిత్రాలు చాలా ఉన్నాయి. నిర్మాతను లోపలకు రావద్దంటే... హీరో గారికి కనపడకుండా తిరుగుతూ సినిమా పూర్తి చేసిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎందుకంటే... 'ముల్లు మీద ఆకు పడ్డా... ఆకు మీద ముల్లుపడ్డా నష్టం ఆకుకే' అన్న చందంగా... నిర్మాత డబ్బు పెట్టాడు కాబట్టి, అలా జాగ్రత్తపడేవాడు. అలా నాకు తెలిసినవే నాలుగైదు చిత్రాలున్నాయి. ఇప్పుడైతే... 'మీరు పోతే వేరేవాళ్లు చేస్తారు లేండి. ప్రొడక్షన్ హౌస్‌ను మార్చేద్దాం' అనే స్థాయికి వచ్చేశారు హీరోలు. అన్‌ప్రొఫెషనల్‌గా తయారైపోయింది సినిమా నిర్మాణం. అప్పుడు ప్రొఫెషనల్‌గా ఉండేది. నిర్మాతకు గౌరవం ఉండేది. అంతిమంగా సినిమాకు గౌరవం దక్కేది. నిజానికి ఇప్పుడు సినిమాను గౌరవించడంలేదు.

రెవెన్యూ పెరుగుతుందని రెమ్యూనరేషన్ పెంచాం. పెంచుకోవడంలో తప్పులేదు. కానీ ఒకవేళ సినిమా ఆడకపోతే ఏంచేస్తారు? నిన్న వంద కోట్లకు తీశారు. ఇవాళ కూడా వంద కోట్లకే తీయండి. పోయిన చిత్రం మూడొందల కోట్లు వసూలు చేసింది. తరువాతది వెయ్యి కోట్లు బిజినెస్ చేయవచ్చేమో. లాభాల్లో పర్సెంటేజ్ పెట్టుకున్నారనుకోండి... మీకు రెండొందల కోట్లు రెమ్యూనరేషన్ వచ్చినట్టే కదా. దీనివల్ల సినిమాను విజయవంతం చేసే బాధ్యత అందరిపైనా ఉంటుంది. సినిమా బాగా వస్తే మంచి ఆదరణ లభిస్తుంది. డబ్బు కూడా ఎక్కువ కనిపిస్తుంది. మరో సినిమా నిర్మించడానికి నిర్మాతకు కూడా ప్రోత్సాహకరంగా ఉంటుందనేది నా అభిప్రాయం.

• **తమ్మారెడ్డి భరద్వాజ**, దర్శకనిర్మాత

ఫుడ్ ఫ్యాక్ట్

తోలులోనూ పోషకాలు

కొన్ని కూరగాయలు, పండ్లను తొక్కు తీయకుండానే తినాలి. తొక్కులో ఉండే పోషకాలను నష్టపోకుండా ఉండడం కోసం వాటిని తొక్కుతో సహా తినడం అలవాటు చేసుకోవాలి. ఇంతకూ ఆ పండ్లు, కూరగాయలు ఏవంటే...



జుకిని: సలాడ్ కోసం ఉపయోగించే జుకిని తొక్కలో యాంటీఆక్సిడెంట్లు, పీచు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి పచ్చిగా తినాలనుకున్నా, ఉడికించాలనుకున్నా దీన్ని అలాగే నేరుగా వాడుకోవాలి.

పియర్స్, యాపిల్స్: ఈ పండ్ల తొక్కల్లో పీచు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. కాబట్టి వీటిని కూడా శుభ్రంగా కడిగి, అలాగే తినేయాలి.

క్యారెట్లు, బంగాళాదుంపలు: వీటి తొక్కులో పొటాషియం, పీచు ఉంటాయి. కాబట్టి వీటిని బాగా శుభ్రం చేసి అలాగే వండుకోవాలి.

కీరా: కీరాలో తోలులో పీచు, విటమిన్ కె, ఖనిజ లవణాలు ఉంటాయి. కాబట్టి కీరాను తోలు తీయకుండానే తినాలి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LLtpvTi లో చదవండి.

సండే సెలబ్రిటీ



అందాల పోటీల్లో విజయం సాధించి సినీ రంగ ప్రవేశం చేసిన ఐశ్వర్యరాయ్, సుస్మితాసేన్ కోవకు చెందిన నటి **మానుషి చిల్లర్**. 2017లో 'మిస్ వరల్డ్'గా ఎంపికైన మానుషి... తాజాగా 'ఆపరేషన్ వాలెంటైన్' ద్వారా తెలుగు చిత్రసీమలోకి ప్రవేశించింది. మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన తాను హీరోయిన్ ఎలా అయిందో 'నవ్య'కు వివరించింది.

నేను లక్కీ గర్ల్..!

'మిస్ వరల్డ్' నుంచి 'ఆపరేషన్ వాలెంటైన్' దాకా ప్రయాణం ఎలా సాగుతోంది?

చాలా బావుంది. ఇప్పటికి నేను హిందీలో రెండు సినిమాలు చేశా. ఇది మూడో సినిమా. కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటున్నా. ప్రయాణం చాలా అడ్వెంచరస్‌గా సాగుతోంది.

మీకు ఏ తరహా సినిమాలు ఇష్టం?

నా చిన్నప్పుడు ఇంట్లో అందరం కలిసి సినిమాలు చూసేవాళ్లం. సినిమాకు వెళ్తే కుటుంబం అందరం కలిసే వెళ్లేవాళ్లం. నా ఉద్దేశంలో సినిమా అంటే కుటుంబం మొత్తం చూసేలా ఉండాలి. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రేక్షకులకు ఒక మంచి సినిమా చూశామనే అనుభూతి కలగాలి. కొన్ని సినిమాలు సింగిల్ డైమన్షనల్‌గా ఉంటాయి. కానీ నా ఉద్దేశంలో సినిమాలో రొమాన్స్, యాక్షన్, కామెడీ అన్నీ కలిపి ఉండాలి. ఇక నాకు నచ్చిన సినిమాలంటారా... చాలానే ఉన్నాయి. చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే పిచ్చి. అన్ని సినిమాలూ చూసేదాన్ని. నాకు రొమాన్స్ సినిమాలంటే చాలా ఇష్టం. 'దిల్‌తో పాగల్‌హై' ఎన్నిసార్లు చూశానో తెలియదు. దర్శకుడు ప్రియదర్శన్ తీసే సిట్యువేషనల్ కామెడీలంటే ఇష్టం. రాజమౌళి ఫాంటసీ ఇష్టం. చైనీయుల యాక్షన్ ఫిల్మ్స్ అంటే ఇష్టం. 'లిటిల్ ఉమెన్' అనే ఒక సినిమా వచ్చింది. దానిని ఎన్నిసార్లు చూశానో నాకే తెలియదు. అంత నచ్చింది ఆ చిత్రం.

మీ బాల్యం ఎలా గడిచింది?

మా అమ్మ, నాన్న.. ఇద్దరూ డాక్టర్లే. నాన్న రక్షణ శాఖలో పని చేసేవారు. ఏడేళ్ల దాకా బెంగుళూరులో పెరిగాను. ఆ తర్వాత ఢిల్లీ వెళ్లిపోయాం. మాది ఒక ఎగువ మధ్యతరగతి కుటుంబం. నాకు చెల్లి, తమ్ముడు ఉన్నారు. చిన్నప్పటి నుంచి అమ్మానాన్న మమ్మల్ని బాగా చదువుకోమని చెబుతూ ఉండేవారు. నా స్నేహితులందరూ ఇంజినీరింగ్ గురించి.. మెడిసిన్ గురించి మాట్లాడుకుంటూ ఉండేవారు. నేను కూడా బాగా చదువుకొని మెడిసిన్‌లో చేరా. రెండేళ్లు చదివా. ఆ సమయంలోనే 'మిస్ వరల్డ్' గెలుచుకున్నా. ఒక ఏడాది ఆ కార్యక్రమాల్లో పాల్గొన్నా. ఆ తర్వాత సినీరంగంలోకి వచ్చేశా.

మీ కుటుంబంలో అందరూ చదువరులు కదా! మీరు ఈ గ్లామర్ రంగంలోకి ఎలా వచ్చారు?

అవును. నేను కూడా బాగా చదివేదాన్ని. కానీ పరీక్షల ముందు మాత్రమే చదివేదాన్ని. మిగిలిన సమయాల్లో డ్యాన్స్ పెయింటింగ్ కాంపిటేషన్స్‌కు వెళ్లేదాన్ని. మా స్కూల్లో కూడా ఇలాంటి కాంపిటీషన్స్‌ను ప్రొత్సహించేవారు. మంచి మార్కులు వచ్చేవి కాబట్టి అమ్మానాన్న ఏమనేవారుకాదు. 15 ఏళ్ల వయస్సులో నాన్న దగ్గరకు వెళ్లి.. "నేను డాక్టర్ అవుతా" అన్నా. అప్పుడు నాన్న.. "డాక్టర్ అవ్వాలంటే



కష్టపడి చదవాలి. హాబీలంటూ తిరిగితే కష్టం" అని చెప్పారు. దాన్ని ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నా. ఎంబీబీఎస్‌లో చేరా! ఇక్కడ నేను చెప్పదలుచుకున్నదేమిటంటే.. నేను ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవటానికి ఇష్టపడతాను. దానిని ఒక ఛాలెంజ్‌గా తీసుకుంటాను.

ముందు అందాల పోటీలు.. ఇప్పుడు సినిమాలు.. ఇవి కూడా అంతేనా?

అవును. నేను ఎప్పుడూ 'మిస్ వరల్డ్' అవుతానని అనుకోలేదు. 'మిస్ ఇండియా' అవుతానని కూడా అనుకోలేదు. ఎవరితోనైనా చెబితే నమ్మరు కానీ... 'మిస్ ఇండియా' పోటీల ముందు రోజు విపరీతమైన టెన్షన్ పడ్డాను. కళ్లజోడు పెట్టుకొని నైట్ డ్రెస్‌లో పుస్తకం పట్టుకొని కూర్చున్నా. 'మిస్ ఇండియా' ఫైనలిస్టునంటే ఎవ్వరూ నమ్మరు కూడా. ఒకవేళ పోటీలో ఓడిపోతే? కాలేజీ అటెండెన్స్ ఎలా? అని ఆలోచిస్తూ కూర్చున్నా. 'మిస్ ఇండియా' పోటీల్లో గెలిచిన తర్వాత రెండున్నర నెలలకు 'మిస్ వరల్డ్' పోటీలు జరిగాయి. ఆ రెండున్నర నెలల్లో చాలా నేర్చుకున్నా. ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చా. ఇప్పుడూ నేర్చుకొంటున్నా. " హీరోయిన్ అవుతానని చిన్నప్పుడే తెలిస్తే.. ముందే అన్నీ నేర్చుకొనేదాన్ని కదా" అని అప్పుడప్పుడు అనుకుంటూ ఉంటా. ఒక విధంగా చూస్తే నేను చాలా లక్కీ గర్ల్. అదృష్టం కలిసిరాకపోతే ఇవన్నీ సాధించటం కష్టమే!

మీ జీవితంలో మీకు లభించిన అతి గొప్ప కాంప్లిమెంట్..?

'ఆపరేషన్ వాలెంటైన్' టీజర్ విడుదలయిన తర్వాత నాన్న... 'లైఫ్ ఈజ్ వాట్ యూ మేకిట్' అన్నారు. నా జీవితంలో నేను ఆ సిద్ధాంతానే నమ్ముతాను. మనకు అవకాశాలు వస్తూనే ఉంటాయి. వాటిని ఎలా వాడుకుంటామనే విషయంపైనే మొత్తం ఆధారపడి ఉంటుంది. అమ్మానాన్న మాకు ఎప్పుడూ అదే చెప్పేవారు. "నీ జీవితం ఎలా బతుకుతావన్నది నీ ఇష్టం. నీకు మేము కేవలం సాయం మాత్రమే చేయగలం" అనేవారు. మొదట్లో నాకు ఈ వాక్యాలు అర్థం కాలేదు. ఇప్పుడు నెమ్మదిగా అర్థమవుతున్నాయి.

మీ ఇంట్లో చాలా మంది రక్షణ దళాల్లో పనిచేశారు కదా.. 'ఆపరేషన్ వాలెంటైన్' షూటింగ్‌లో ఎలా అనిపించింది?

మా అంకుల్స్ ఆర్మీలో ఉండేవారు. గతంలో ఆర్మీ నేపథ్యంలో వచ్చిన సినిమాలను అందరం కలిసి చూసేవాళ్లం. ఆ సినిమాలు వాస్తవికంగా ఉండేవి కాదు. దాంతో మా అంకుల్స్‌కు నచ్చేవి కావు. నాన్న కూడా రక్షణ శాఖలోనే పనిచేస్తూ ఉండటం వల్ల అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయో నాకు తెలుసు. అయితే ఈ సినిమాలో నేను రాడార్ కంట్రోలర్ పాత్రలో నటించా. షూటింగ్ జరుగుతున్న సమయంలో మాతో పాటు ఒక లేడీ రాడార్ కంట్రోలర్ ఉండేవారు. ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో వివరించేవారు. ఈ సినిమా తర్వాత నాకు రక్షణ దళాలలో ఉన్నవారిపై గౌరవం మరింత పెరిగింది. ఇలాంటి పాత్రలు అతి తక్కువగా ఉంటాయి. వాటిలో ఒకటి నాకు రావటం చాలా ఆనందంగా అనిపిస్తోంది.

• **సీవీఎల్ఎన్ ప్రసాద్**

ఆ పాట 'అర్ధరాత్రి' పుట్టింది



తెలుగువారి సంస్కృతిని... ఒరవడిని ఒడిసిపట్టిన కవి సీతారామశాస్త్రి. 1986లో చిత్రరంగ ప్రవేశం చేసిన సీతారామశాస్త్రి... తెలుగు సినిమా గీతాల చరిత్రలో తనదైన ముద్ర వేయగలిగారు. ఆయన సినీ పాటల ప్రస్థానాన్ని ఆకెళ్ల రాఘవేంద్ర 'పాట షికారుకొచ్చింది' పేరిట గ్రంథస్థం చేశారు. దానిలోని కొన్ని ఆసక్తికరమైన భాగాలు...

'గులాబీ' సినిమా స్క్రిప్ట్ ప్రకారం మొదట అనుకున్నది నాలుగు పాటలే. మరో వైపు షూటింగ్ కూడా అయిపోయింది. ఇంకో పది పదిహేను రోజుల్లో రిలీజ్ అనుకున్నారు.

సినిమా బిజినెస్‌కు అప్పుడైనా ఇప్పుడైనా అత్యంత కీలకమైనది ఆడియో మార్కెటింగ్. అప్పట్లో ఆడియో క్యాసెట్లు ఉండేవి. క్యాసెట్‌కు ఏ, బీ అని రెండు సైడ్లు ఉంటాయి. పాలిస్టర్ లాంటి సన్నటి ప్లాస్టిక్ ఫిల్మ్ మీద మేగ్నిటిక్ కోటింగ్ ద్వారా పాటల్ని రికార్డ్ చేస్తారు. దాన్ని టేప్‌రికార్డర్ ద్వారా వింటారు. ఏ సైడ్ ఎంత స్పేస్ ఉంటుందో బీ సైడ్ కూడా అంతే ఉంటుంది. ఒక పక్క మూడు లేదా నాలుగు పాటలు ఉంటే.. ఇంకో పక్క కూడా సరిసమానంగా ఉండాల్సిందే. అందుకే ఆ రోజుల్లో దాదాపు ప్రతి సినిమాకూ కనీసం ఆరు పాటలు ఉండేవి. ఒక పాట తక్కువ అయితే ఓ పాటని రిపీట్ చేసేవారు- తప్పనిసరి పరిస్థితుల్లో!

'గులాబీ' సినిమాకి మరీ బొత్తిగా నాలుగు పాటలే ఉన్నాయి. దాంతో ఆడియో కంపెనీవారు- 'కనీసం అయిదవ పాట అయినా లేదా ఆరు పాటలు ఉండాల్సిందే' అని పట్టుపట్టారు. అలా అయిదవ పాట చేయక తప్పనిసరైంది. కానీ మొత్తం సినిమా షూటింగ్ అయిపోయింది. అందుకని అయిదవ పాటని రికార్డ్ చేయించి, ఆడియో క్యాసెట్‌లో మాత్రమే ఇచ్చి, సినిమాలో మాత్రం నాలుగే ఉంచుదాం అని నిర్మాత ఆర్జీవీ, దర్శకులు కృష్ణవంశీ డిసైడయ్యారు.

అప్పటికే "ఏ రోజైతే నిను చూశానో" పాట మేల్ వాయిస్‌లో ఉంది. ఇదే మాదిరి ట్యూన్‌తో ఫిమేల్ వెర్షన్‌లో ఇంకో పాట చేస్తే- అయిదవ పాటగా జరిగినదంతా ఆయనకు చెప్పి కొంచెం తొందరగా ఇవ్వమని అన్నారు. ఆయన ఒక రాత్రంతా మేలుకొని రాసిన ఆ పాట

"ఈ వేళలో నీవు ఏం చేస్తు ఉంటావో.. అనుకుంటు వుంటాను ప్రతి నిమిషమూ నేను..నడిరేయిలో నీవు.. నీదురైన రానీవు.. గడిపేదెలా కాలము..పగలైనా కాసేపు పని చేసుకోనీవు.. నీ మీదనే ధ్యానము".

కావలిసినవారు ఏ మాత్రం దూరంగా ఉన్నా ఎలా పలకరిస్తామో.. కలవరిస్తామో అలాగే రాశారు. ఒక కన్నె మనసు ప్రియుడి తలపుల్లో ఎలా తల్లడిల్లుతుందో అచ్చం అలాగే ఉందీ పాట.

ఆ పాటని ఎవరి చేత పాడించాలీ అన్న ప్రశ్న ఎదురైంది కృష్ణవంశీకి. ఎందుకంటే అప్పటికే ఆ సినిమాలో శశిప్రీతమ్, సురేష్ పీటర్స్, సుచిత్ర కృష్ణమూర్తి, హరిహరన్, గాయత్రి, మనోలాంటి కొత్త గొంతుకలతో పాడించారు. ఒక్క మనో తప్ప వీళ్లంతా తెలుగువారు కూడా కాదు.

ఇవుడు సినిమాలో కూడా ఉండని ఈ పాటని- పరభాషా గాయనితో పాడించేంత ఖర్చు పెట్టాలా? అందుకని అప్పటికి ఇంకా సింగర్‌గా ఎదగని, కోరస్‌లు మాత్రమే పాడుతూ ఉన్న సునీత ఉపద్రష్ట అనే 17 ఏళ్ల అమ్మాయి చేత పాడించారు. సీతారామశాస్త్రి రెమ్యునరేషన్ కాకుండా- ఈ పాట మొత్తం రికార్డింగ్‌కు అయిన ఖర్చు కేవలం ఏడు వేల రూపాయలే! ఈ నాటికీ ఈ పాట సూపర్‌హిట్.

మూలం ఎక్కడుంది? సీతారామశాస్త్రి అందించిన లిరిక్‌లో ఉంది. మామూలు పాటే కదా అని వదిలేద్దాం అని అనుకోకుండా మనసుపెట్టి మంచి పాట ఇచ్చారు. నిజానికి ఈ పాట సినిమాలో ఉండదని తెలుసు. కేవలం ఆడియో క్యాసెట్ కోసమే అని తెలుసు.. అయినా మెమొరబుల్ సాంగ్ రాశారు. ప్రేమలో ఉన్నవారికి ప్రియుడి తలుపు, పిలుపు ఎక్కడ ఉన్నా తరుముతూనే ఉంటాయి. అందుకే ఈ పాట ఇప్పటికీ ఆడపిల్లల మనసుల్లో నిలిచిపోయింది.


ఇలాంటివి చూస్తేనే అనిపిస్తుంది సీతారామశాస్త్రి 'సాంగ్ మేకర్' అని!

మొత్తమ్మీద 'సింధూరం' సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిపోయింది. ఫస్ట్ కాపీ కూడా వచ్చేసింది. మూడు నాలుగు రోజుల్లో సెన్సార్. వారం రోజుల్లో సినిమా రిలీజ్. ఇదీ ప్లాన్. సరదాగా సినిమా ఎలా వచ్చిందో కాలక్షేపానికి చూద్దామని ఒక షో వేశారు కృష్ణవంశీ, సీతారామశాస్త్రి, బ్రహ్మాజీ, ఆయన భార్య.. ఇంకో నలుగురైదురుగురు అంతే. వీరికే ఆ ప్రదర్శన వేశారు.

మద్రాసు టీ నగర్‌లోని 'దేవి-శ్రీదేవి' థియేటర్‌లో రాత్రి పదకొండున్నరకి స్లాట్ దొరికింది. సినిమా మొదలైంది. బాగుంది. ఇంటర్వెల్ వచ్చింది. సీతారామశాస్త్రి ఎందుకో అన్‌ఈజీ ఫీలయ్యారు. ఏమీ మాట్లాడలేదు. రెండో ఆఫ్ కూడా చూసేశారు. సినిమా అయ్యేసరికి రాత్రి రెండున్నరయింది. అందరూ వెళ్లిపోయారు... కృష్ణవంశీ, శాస్త్రి తప్ప. శాస్త్రి చాలా డిస్‌కంఫర్ట్‌గా, రెస్ట్‌లెస్‌గా కనిపించారు. ఆయన రోడ్డు మీద అటూ ఇటూ తిరిగేస్తున్నారు. తనలో తానే ఏదో వితర్కించేస్తున్నారు. కథ బావుంది. టేకింగ్ బావుంది. ఎమోషన్స్ అద్భుతం. ఎంటర్‌టైన్‌మెంట్ పరవాలేదు. అయినా ఏదో వెలితి సినిమాలో.

అదే అర్థం కాక... ఆ లోపం ఏమిటో అంతుచిక్కక- టీనగర్ నడి రోడ్డు మీద ఆ అర్ధరాత్రి చీకట్లో ప్రజ్వరిల్లిపోతున్నారు శాస్త్రి. తాను అప్పటికే రాసిన పారాహుషార్ పాట నక్సలైట్ల కోణంలోనుంచి మాత్రమే రాసినది. సినిమా అంతా చూశాక, నక్సలైట్లు, పోలీసులు- వీరిలో ఎవరి మార్గం కరక్టో అర్థం కావటంలేదు. ఆ సినిమా ముగింపు అలా ఉంది. దాని వల్ల ప్రేక్షకులు శుభం కార్డు వచ్చే సరికి ఏమైందో అర్థం కాక గందరగోళంలో పడతారు. అది సినిమాకి నష్టం. ఇదీ సీతారామశాస్త్రిని వేధిస్తున్న ప్రశ్న.. వాస్తవానికి ఆ పోలీసులు, ఈ నక్సలైట్లు ఎవరు? సమాజంలోని ప్రజలే కదా! జనం అంటే మనమే కదా! మనం అంటే నువ్వు..నేను. నువ్వు..నేను అంటే ఎవరికి వారే 'నేను'. అంటే ఈ సంఘం పాడైపోయింది. కుళ్లిపోయింది. అంటే కారణం ఎవరు? 'నేనే'.. నేను మాత్రమే అని ప్రతి ఒక్క వ్యక్తీ అనుకోగలగాలి.

ఇదీ అసలైన పరిష్కారం. ఇంతటి కాంప్లికేటెడ్ ఫినామినాని క్లియర్‌గా సినిమా చెప్పలేకపోతోంది. తీరా చూస్తే ఇప్పుడు షూటింగ్ అంతా అయిపోయి సెన్సార్‌కి వెళ్లిపోతోంది. రిలీజ్ అవబోతోంది. అందుకని ఆ కాన్సెప్ట్‌ని క్లియర్‌గా చెప్పే పాట రాస్తే బావుంటుందనిపించింది సీతారామశాస్త్రికి. అంతే అప్పటికప్పుడు ఆ క్షణం రాత్రిపూట రోడ్డుపై దొరికిన ఏదో కాగితం తీసుకొని తన జేబులోంచి పెన్ తీసి.. స్ట్రీట్‌లైట్ కిందకు వెళ్లి.. తన గుండెల్ని గత రెండుగంటలుగా వేధిస్తున్న.. మెలిపెడుతున్న భావనను అక్షరబద్ధం చేస్తే- అది పాటగా ప్రవహిస్తే 'అర్థశతాబ్దపు అజ్ఞానాన్నే స్వతంత్రమందామా? స్వర్ణోత్సవాలు చేద్దామా?' అనే పదాలు పుట్టుకొచ్చాయి.



పాట షికారుకొచ్చింది
రచయిత: ఆకెళ్ల రాఘవేంద్ర
ప్రతులకు: 8897826108

మేకప్

చిరచిరలాడే ఎండలోకి అడుగు పెడితే, మేకప్ మొత్తం చెల్లాచెదరవుతోందా? ఎండకూ, వేడికీ కరిగిపోకుండా, రోజంతా మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే, కొన్ని చిట్కాలు పాటించాలి.

సమ్మర్‌లో ఇలా...

- **మాయిశ్చరైజర్:** పగటివేళ ఆయిల్ ఫ్రీ మాయిశ్చరైజర్ మాత్రమే ఉపయోగించాలి. ముఖం జిడ్డుగా మారకుండా ఉండడానికి ఇది తోడ్పడుతుంది.
- **సన్ ప్రొటెక్షన్:** మేకప్‌తో పని లేకుండా వేసవి కాలమంతా 30 కంటే ఎక్కువ ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ వాడుకోవాలి. మాయిశ్చరైజర్ అప్లై చేసిన తర్వాత సన్‌స్క్రీన్, ఆ తర్వాత ఫౌండేషన్ సరైన ఛాయిస్.
- **ప్రైమర్:** మేకప్ వన్నె తగ్గకుండా ఉండాలంటే ప్రైమర్ కూడా తప్పనిసరిగా వాడాలి. ముడతలను కనపడనివ్వకుండా చేసే ప్రైమర్‌తో యంగర్ లుక్ వస్తుంది.
- **తక్కువ మేకప్:** ముఖం మీద మేకప్ ముద్దలు కట్టకుండా, గీతలు పడకుండా ఉండాలంటే, వేసవి కాలంలో వీలైనంత తక్కువ మేకప్ వేసుకోవాలి. తప్పనిసరి అయితే టింటెడ్ మాయిశ్చరైజర్, కన్‌సీలర్లను ఉపయోగించుకోవచ్చు.



- **బ్రాంజర్:** కళ్లు ఆకర్షణీయంగా కనిపించాలంటే బ్రాంజర్ వాడుకోవాలి. తాజాగా, సహజసిద్ధ సౌందర్యంతో మెరిసిపోవాలంటే ఎండ సోకే వీలున్న నుదురు, చీక్ బోన్స్, చుబుకం, ముక్కు మీద బ్రాంజర్ అప్లై చేయాలి. వేసవిలో పౌడర్ రూపంలోని బ్రాంజర్లనే ఎంచుకోవాలి.
- **షిమ్మర్ వద్దు:** అవసరానికి మించిన మెరుపులు వేసవిలో ఎబ్బెట్టుగా ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో షిమ్మర్‌ను వాడకపోవడమే మంచిది.
- **బ్లష్:** ఈ కాలంలో పౌడర్ బ్లష్‌లకు బదులుగా జెల్ బ్లష్ వాడుకోవాలి.
- **లిప్‌స్టిక్:** ముదురు రంగు లిప్‌స్టిక్‌లకు బదులుగా హాయిగొలిపే లేత గులాబీ, లేత నారింజ రంగులను ఎంచుకోవాలి.

దిక్సూచి DIKSUCHI



ఎంబీఏ

ఐఐటీ జోధ్‌పూర్

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజే)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎస్ఎంఈ)- 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ని రెండు మోడ్‌లలో నిర్వహిస్తున్నారు. మొదటి మోడ్ ప్రకారం- ప్రోగ్రామ్ మొదటి ఏడాది కోర్సుని ఐఐటీజేలోను, రెండో ఏడాది కోర్సును యూఎస్ఏలోని ఎస్‌యూఎన్‌వై అల్బేనీలో చదువుకోవచ్చు. అల్బేనీ విద్యార్థులకు 5000 డాలర్ల స్కాలర్‌షిప్, మూడేళ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు అనుమతిస్తూ ఎఫ్-1 స్టూడెంట్ వీసా, అల్బేనీ అసిస్టెంట్‌షిప్ అందిస్తారు. ఈ మోడ్‌లో చదివిన వారికి ఐఐటీజే నుంచి 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' డిగ్రీ, ఎస్‌యూఎన్‌వై అల్బేనీ నుంచి 'ఎంఎస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్' డిగ్రీ లభిస్తాయి. రెండో మోడ్ ప్రకారం ప్రోగ్రామ్ రెండేళ్లూ ఐఐటీజేలోనే చదువుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఎంటెక్ అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ అభ్యర్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులందరికీ దరఖాస్తు నాటికి ఐటీ/బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్/ఇన్సూరెన్స్/సైబర్‌సెక్యూరిటీ తదితర విభాగాల్లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. ఇంటర్న్‌షిప్‌లు; కోచింగ్ సెంటర్లు, స్మాల్ స్కేల్ బిజినెస్ సంస్థలు, రిటైల్ స్టోర్స్, కిరాణా స్టోర్స్, ఎన్‌జీఓ సంస్థలు, పెట్రోల్ పంప్ సంస్థలు, గ్యాస్ స్టేషన్‌లలో పనిచేయడాన్ని అనుభవం కింద పరిగణించరు.

ఎంపిక: క్యాట్ 2023/గేట్/జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్/అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ స్కోర్, అనుభవం, జెండర్ డైవర్సిటీ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** iitj.ac.in

ఐఐటీ మండీ

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎస్ఓఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: రెండు కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొదటి కేటగిరీ అడ్మిషన్స్‌కు సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం మార్కులు ఉండాలి. వీరికి క్యాట్ వ్యాలిడ్ స్కోర్ అవసరం లేదు. రెండో కేటగిరీ అడ్మిషన్స్‌కు ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులూ ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారికి మొదటి కేటగిరీ కింద ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్ఆర్ఐ, విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ 2023 స్కోర్ ఉండాలి.

ఎంపిక: మొదటి కేటగిరీ అభ్యర్థులను అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా; రెండో కేటగిరీ అభ్యర్థులను క్యాట్ 2023 స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సెలెక్షన్ కమిటీ నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ అండ్ డిజైన్

ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్) బెంగళూరులో నిర్వహిస్తున్న ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్(ఏఐఎఫ్‌డీ)- బీఎస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫ్యాషన్ అండ్ అప్పారెల్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకొరేషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌ని ఆర్మీ విభాగాలకు చెందిన ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకించారు. రిటెన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల్లో ఒకరికి ఆర్మీ ఉద్యోగిగా కనీసం పదేళ్ల సర్వీస్ ఉండాలి.

రిటెన్ అడ్మిషన్ టెస్ట్: దీనిని మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ టెస్ట్, జనరల్ అవేర్‌నెస్ టెస్ట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంపిటెన్సీ అండ్ కాంప్రహెన్షన్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** aifd.edu.in

ఐఐపీలో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్



చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ (సీపీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుకు ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ (ఏపీఎఫ్) సహకారం అందిస్తోంది. ఇందులో ప్రధానాంశం 'ప్యాకేజింగ్'. ఇంజనీర్లకు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌ను జూలై నుంచి అక్టోబరు వరకు, రెండో సెమిస్టర్‌ను నవంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు, మూడో సెమిస్టర్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కాంటాక్ట్ క్లాసెస్ ఉంటాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్ నిర్వహిస్తారు. వీటి కోసం అభ్యర్థులు చెన్నై సెంటర్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ విజిట్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో నాలుగు నెలలపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రతి సెమిస్టర్ చివరలో ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం, మొత్తమ్మీద 50 శాతం మార్కులు ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆటొమొబైల్ సంస్థలు, టెక్స్‌టైల్ హబ్‌లు, ఫైర్‌వర్క్స్ ఇండస్ట్రీలు, ఎఫ్ఎంసీజీ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రింటింగ్ టెక్నాలజీ/ప్యాకేజింగ్ టెక్నాలజీ/పాలిమర్ ఇంజనీరింగ్/పాలిమర్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ టెక్నాలజీ/పేపర్ ఇంజనీరింగ్/పేపర్ టెక్నాలజీ/ప్లాస్టిక్స్ టెక్నాలజీ/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇతర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ప్యాకేజింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.83,190
- **అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు:** రూ.35,990
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500+18% జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **కాంటాక్ట్ క్లాసెస్ సెంటర్లు:** ముంబై, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్
- **వెబ్‌సైట్:** www.iip-in.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/AsUPQHYలో చదవండి.

జాబ్ కార్నర్

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. రెగ్యులర్ ప్రాతిపదికన 80 స్పెషలిస్ట్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): 23 పోస్టులు
2. డిప్యూటీ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): 51 పోస్టులు
3. మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్):3 పోస్టులు
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(అప్లికేషన్ సెక్యూరిటీ): 3 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం తప్పనిసరి.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్

గరిష్ఠ వయోపరిమితి: అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు; మేనేజర్‌కు 38 ఏళ్లు; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 42 ఏళ్లు మించకూడదు.

పని ప్రదేశం: ముంబయి, నవీ ముంబయి

దరఖాస్తు ఫీజు: రూ.750. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది

ఎంపిక: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 4

వెబ్‌సైట్: https://www.sbi.co.in/

ఏఈఎస్‌లో టెక్నీషియన్స్

న్యూఢిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఏఈఎస్) లిమిటెడ్... వివిధ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 100


1. ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(మెయింటెనెన్స్/ఒవర్‌హాల్, ఏవియానిక్స్) 2. ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(ఏవియానిక్స్, ఎలక్ట్రికల్/ ఇన్‌స్ట్రుమెంటల్/రేడియో)
3. టెక్నీషియన్(ఫిట్టర్/షీట్ మెటల్, కార్పెంటర్, వెల్డర్)
4. టెక్నీషియన్(ఎక్స్-రే/ఎన్‌డీటీ)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, ఇంజనీరింగ్ సర్టిఫికెట్, బీటెక్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 23

వెబ్‌సైట్: www.aiesl.in/

శివరాత్రికి సిద్ధం



గోపీచంద్ హీరోగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమ' మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న విడుదల కానుంది. 'మరో ఇరవై రోజుల్లో..' అని పేర్కొంటూ శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఫైటింగ్‌కు సిద్ధం అన్నట్లు పోలీస్ యూనిఫామ్‌లో గోపీచంద్ కన్పిస్తున్న ఈ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రియా భవానీశంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు.

మున్నార్‌లో ముగించారు



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాబిన్‌హుడ్' చిత్రం మున్నార్‌లో కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తాజా షెడ్యూల్‌లో చిత్రబృందం పాల్గొనగా కీలకఘట్టాలను తెరకెక్కించారు. టాకీపార్ట్‌తో పాటు నితిన్, ఫైటర్స్‌పై భారీ యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. త్వరలోనే తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించనున్నట్లు యూనిట్ తెలిపింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నితిన్ సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

అమరన్‌గా శివ కార్తికేయన్



తమిళ హీరో శివ కార్తికేయన్ హీరోగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న చిత్రానికి 'అమరన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. శనివారం శివ కార్తికేయన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఆర్మీ మేజర్ ముకుందవరదరాజన్ జీవితం ఆధారంగా రాహుల్ సింగ్, శివ్ అరూర్ రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్ లెస్' సిరీస్‌లోని ఓ అధ్యాయం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయిపల్లవి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. వేసవిలో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సీహెచ్ సాయి

గ్రామీణ ప్రేమకథ



ప్రేమకు అర్థం చెబుతూ రూపొందిన 'రాధామాధవం' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించారు. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ ఈ సినిమాను నిర్మించారు. 'మా సినిమా సెన్సార్ పూర్తయింది. గ్రామీణ నేపథ్యంలో నిర్మించిన చక్కని సందేశాత్మక చిత్రమని సెన్సార్ సభ్యులు ప్రశంసించారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ సాంగ్, టీజర్, ట్రైలర్‌లకు మంచి స్పందన వచ్చింది. సినిమాపై నమ్మకం పెరిగింది. మార్చి ఒకటిన ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని చెప్పారు నిర్మాత. వసంత్ వెంకట్ బాలా కథ, మాటలు, పాటలు అందించిన ఈ చిత్రానికి సతీశ్ లైన్ ప్రొడ్యూసర్

ఒకే పాత్ర.. సామాజిక సందేశం



ఒకే పాత్రతో సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం 'నేటి భారతం'. భరత్ పారేపల్లి దర్శకత్వంలో డాక్టర్ యర్రా శ్రీధర్ రాజు నటిస్తూ ఈ సినిమాను నిర్మించారు. త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదల చేశారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత సాంబేష్ మాట్లాడుతూ 'మంచి సినిమాలు చేయాలని శ్రీధర్ రాజు పరిశ్రమకు వచ్చారు. మొదటి 'మేరా భారత్ మహాన్' సినిమా తీశారు. ఇప్పుడు ఒకే పాత్రతో 'నేటి భారతం' తీశారు. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని ఈ సినిమా ద్వారా చూపించాం' అని చెప్పారు. కరోనా తర్వాత వచ్చిన ఆర్థిక, సామాజిక స్థితిగతులపై ఈ సినిమా ఉంటుందని నిర్మాత, నటుడు శ్రీధర్ రాజు చెప్పారు. ఇందులో తను జర్నలిస్ట్ పాత్రను పోషించినట్లు తెలిపారు. జర్నలిస్టు అంకిత భావం, తెగింపు ఇందులో చూపించామని చెప్పారు.

టీనేజ్ లవ్ స్టోరీ



ఉదయ్‌రాజ్, వైష్ణవి సింగ్ జంటగా రూపుదిద్దుకున్న చిత్రం 'మధురం'. రాజేశ్ చికిలే దర్శకత్వంలో యం. బంగార్రాజు ఈ సినిమా నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. దర్శకుడు చిత్రం గురించి వివరిస్తూ '1990 నేపథ్యంలో జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అప్పటి స్కూల్ వాతావరణం, ఆటలు, అల్లర్లు, ఎలా ఉండేవో చూపిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఉంటుంది' అని చెప్పారు. నిర్మాత బంగార్రాజు మాట్లాడుతూ 'కొత్తదనం ఉన్న కథల్ని ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా సినిమా కూడా కొత్తగా, నేటి తరానికి కనెక్ట్ అయ్యే విధంగా ఉంటుంది. హైదరాబాద్, పాలకొల్లు, ఆచంట, సిద్ధాంతం, రావులపాలెం , కోనసీమ ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

అరుదైన వ్యాధితో 'దంగల్' నటి మరణం






ఆమిర్ ఖాన్ నటించిన 'దంగల్'(2016)లో బబిత పాత్రలో నటించిన బాలనటి సుహానీ భట్నాగర్ అరుదైన వ్యాధితో శుక్రవారం కన్ను మూసింది. ఆమె వయసు 19 ఏళ్లు. సుహానీ డెర్మటోమయోసైటీస్ అనే అరుదైన వ్యాధితో బాధ పడుతోంది. స్టెరాయిడ్స్ ఇవ్వడమే దీనికి చికిత్స. కండరాలను బలహీన పరచడం, శరీరంపై రాష్ రావడం ఈ వ్యాధి లక్షణాలు. ఈ వ్యాధి తగ్గడానికి చాలా సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. వారి సూచన మేరకు స్టెరాయిడ్స్ తీసుకున్నా, ఆమె లేత శరీరం దానికి తట్టుకోలేక పోయింది. దానికి తోడు ఇన్‌ఫెక్షన్ వచ్చి , లంగ్స్‌లోకి నీరు చేరడంతో సుహానికి శ్వాస తీసుకోవడం కష్టమైంది. అలా బాధ పడుతూనే చివరకు శుక్రవారం సాయంత్రం ఆమె కన్ను మూసిందని సుహానీ తండ్రి పునీత్ సజల నయనాలతో చెప్పారు. 'దంగల్'లో నటించిన తర్వాత కొన్ని యాడ్ ఫిల్మ్‌లో సుహానీ నటించింది. 2019లో ఆమె నటనకు దూరం జరిగి చదువు మీద దృష్టి పెట్టింది. ప్రస్తుతం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ చదువుతోంది. సోషల్ మీడియాకు దూరంగా ఉండే సుహాని చదువు పూర్తయ్యాక మళ్లీ సినిమాల్లో నటించాలనుకుందనీ, అంతలోనే ఇలా జరగడం చూసి తట్టుకోలేక పోతున్నామని ఆమె తల్లి పూజ చెబుతూ ఎమోషనల్ అయ్యారు.

పట్టు చిక్కినట్టే..

- జైస్వాల్ మెరుపు శతకం
- ప్రస్తుత ఆధిక్యం 322
- భారత్ రెండో ఇన్నింగ్స్ 196/2
- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 319
- సిరాజ్‌కు నాలుగు వికెట్లు



యశస్వీ జైస్వాల్ (104 రిటైర్డ్ హర్ట్)



సిరాజ్ (4/84)

రాజ్‌కోట్: మూడో రోజు ఆటలో భారత్ ఆల్‌రౌండ్‌షోతో అదరగొట్టింది. అలాగే ఇంగ్లండ్ జట్టు బజ్‌బాల్ గేమ్‌కు దీటుగా ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (133 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 104 రిటైర్డ్ హర్ట్) గేమ్‌తో చెలరేగాడు. ఆదిలో నెమ్మదిగా ఆరంభమైన అతడి ఇన్నింగ్స్ కాస్త కుదురుకున్నాక తుఫాన్ వేగంతో దూసుకెళ్లింది. బౌలర్ ఎవరైనా వైవిధ్యమైన స్వీప్ షాట్లతో, ఎడాపెడా బౌండరీలు బాదేస్తూ కెరీర్‌లో మూడో శతకాన్ని పూర్తి చేశాడు. మరో యువ బ్యాటర్ గిల్ (65 బ్యాటింగ్) అజేయ అర్ధసెంచరీతో నిలిచాడు. వీరిద్దరి సమయోచిత ఆటతీరుతో మూడో టెస్టులో భారత్ 322 పరుగుల భారీ ఆధిక్యం అందుకుంది. శనివారం మూడో రోజు ఆట ముగిసేసరికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 196/2 స్కోరు సాధించింది. గిల్‌కు జతగా క్రీజులో కుల్దీప్ (3) ఉన్నాడు. అంతకుముందు అశ్విన్ లేకపోయినా భారత బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను సమర్థవంతంగా కట్టడి చేశారు. పేసర్ సిరాజ్ 4 వికెట్లతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 319 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత్‌కు 126 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. జడేజా, కుల్దీప్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. డకెట్ (153), స్టోక్స్ (41) రాణించారు. ఆదివారం ఆధిక్యాన్ని దాదాపు 450 రన్స్‌కు చేర్చితే భారత్ తిరుగులేని స్థితికి చేరుకుంటుంది.

మరో 112 పరుగులే: అశ్విన్ లేకపోవడంతో మూడో రోజు భారత్ నలుగురు బౌలర్లతోనే బరిలోకి దిగింది. అటు ఓవర్‌నైట్ స్కోరు 207/2తో పటిష్ఠ స్థితిలో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ నుంచి భారీ స్కోరు ఖాయమే అనిపించింది. డకెట్‌తో పాటు రూట్ క్రీజులో ఉండడమే దీనికి కారణం. కానీ స్పిన్నర్ కుల్దీప్ లయ అందుకోవడంతో పాటు పేసర్ సిరాజ్ పదునైన బంతులకు ఆ జట్టు అనూహ్యంగా తడబడింది. చివరకు మరో 112 రన్స్ మాత్రమే చేసి మిగిలిన వికెట్లన్నీ కోల్పోయింది. తొలి సెషన్‌లోనే రూట్, డకెట్, బెయిర్‌స్టో అవుటవడం జట్టును దెబ్బతీసింది. బుమ్రా ఓవర్‌లో రూట్ అనవసరంగా రివర్స్ ర్యాంప్ షాట్‌కు యత్నించి జైస్వాల్‌కు క్యాచ్ ఇచ్చా డు. ఆ వెంటనే బెయిర్‌స్టోను కుల్దీప్ డకౌట్ చేశాడు. అనంతరం డకెట్, స్టోక్స్ రక్షణాత్మకంగా ఆడారు. 150 పరుగులు చేశాక డకెట్ ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. కుల్దీప్ వైడ్ బాల్‌ను వేటాడి కవర్స్‌లో గిల్‌కు క్యాచ్ ఇవ్వడంతో అతడి అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. రెండో సెషన్‌లో సిరాజ్ చెలరేగడంతో ఇంగ్లండ్‌కు కష్టాలు పెరిగాయి. చక్కగా పాతుకుపోయిన స్టోక్స్‌ను జడేజా దెబ్బతీయడంతో భారత్ సంబరాల్లో మునిగింది. డీప్ మిడ్‌వికెట్‌లో బుమ్రా అతడి క్యాచ్‌ను తీసుకున్నాడు. ఆ వెంటనే ఫోక్స్ (13), రెహాన్ (6), అండర్సన్ (1)లను సిరాజ్.. హార్ట్లీ (9)ని జడేజా పెవిలియన్ చేర్చడంతో 20 పరుగుల వ్యవధిలోనే ఆఖరి 5 వికెట్లను కోల్పోయింది.

'జైస్‌బాల్' దూకుడు: రెండో సెషన్‌లోనే భారత్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. అయితే ఎలాంటి తొందరపాటును చూపకుండా నిదానంగా ఆడింది. దీంతో టీ బ్రేక్‌కల్లా 16 ఓవర్లలో కెప్టెన్ రోహిత్ (19) వికెట్‌ను కోల్పోయి 44 పరుగులు చేసింది. ఓపెనర్ జైస్వాల్ తొలి 50 బంతుల్లో 18 పరుగులే చేశాడు. ఆఖరి సెషన్‌లో అతడితో పాటు గిల్ బౌలర్లపై ప్రతాపం చూపారు. ముందుగా రిస్కీ షాట్లకు వెళ్లకుండానే స్కోరు పెంచారు. ఆధిక్యం 200కు చేరాక జైస్వాల్ జూలు విదిల్చాడు. అండర్సన్ ఓవర్‌లో వరుసగా 6,4,4తో బ్యాట్‌కు పనిచెప్పాడు. తర్వాతి ఓవర్‌లోనే రెండు వరుస సిక్సర్లను బాదడంతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుంటూ స్వీప్ షాట్లతో జైస్వాల్ సాధించిన బౌండరీలు అబ్బురపరిచాయి. ఈ ధనాధన్ బ్యాటింగ్‌తో అతడు ఈ సిరీస్‌లో రెండో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అటు గిల్ సైతం 6,4తో అర్ధసెంచరీ సాధించాడు. అయితే సెంచరీ అయిన కాసేపటికే జైస్వాల్ వెన్నునొప్పితో మైదానం వీడాడు. రెండో వికెట్‌కు వీరి మధ్య 155 రన్స్ వచ్చాయి. రజత్ డకౌటవగా.. గిల్, కుల్దీప్ మూడో రోజును ముగించారు.

1
భారత్‌పై టెస్టుల్లో ఎక్కువసార్లు (8) డకౌటైన బ్యాటర్‌గా బెయిర్‌స్టో

పది మందితోనే..

అశ్విన్ లేకపోవడంతో టీమిండియా రెండో ఇన్నింగ్స్‌లో పది మందితోనే బ్యాటింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే నలుగురు బౌలర్లు మాత్రమే ఉంటారు. నిబంధనల ప్రకారం కంకషన్ సబ్‌స్టిట్యూట్‌కే బౌలింగ్, బ్యాటింగ్ చేసే వీలుంది. కానీ అశ్విన్ అత్యవసర పరిస్థితి కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. కాబట్టి మరో ప్లేయర్ అతడి విధులను నిర్వర్తించలేడు. ప్రస్తుతానికి ప్రత్యర్థి జట్టు కెప్టెన్ స్టోక్స్ అనుమతితో దేవ్‌దత్ పడిక్కళ్ సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్‌గా ఉన్నాడు.

నల్ల బ్యాండ్లతో బరిలోకి..



మాజీ కెప్టెన్ దత్తాజీరావ్ గైక్వాడ్ మృతికి నివాళిగా మూడో రోజు శనివారం ఆటలో భారత ఆటగాళ్లు భుజానికి నల్ల బ్యాండ్లతో బరిలోకి దిగారు. ఈనెల 13న గైక్వాడ్ అనారోగ్యంతో మృతి చెందారు. అయితే టెస్టు తొలిరోజునే ఆటగాళ్లు నివాళి అర్పించాల్సిందని సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలే (సి) రజత్ (బి) అశ్విన్ 15; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 153; పోప్ (ఎల్బీ) సిరాజ్ 39; రూట్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 18; బెయిర్‌స్టో (ఎల్బీ) కుల్దీప్ 0; స్టోక్స్ (సి) బుమ్రా (బి) జడేజా 41; ఫోక్స్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; రెహాన్ (బి) సిరాజ్ 6; హార్ట్లీ (స్టంప్) జురెల్ (బి) జడేజా 9; ఉడ్ (నాటౌట్) 4; అండర్సన్ (బి) సిరాజ్ 1; **ఎక్స్‌ట్రాలు:** 20; **మొత్తం: 71.1 ఓవర్లలో 319 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-89, 2-182, 3-224, 4-225, 5-260, 6-299, 7-299, 8-314, 9-314, 10-319. **బౌలింగ్:** బుమ్రా 15-1-54-1; సిరాజ్ 21.1-2-84-4; కుల్దీప్ 18-2-77-2; అశ్విన్ 7-0-37-1; జడేజా 10-0-51-2.

భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వీ జైస్వాల్ (రిటైర్డ్ హర్ట్) 104; రోహిత్ (ఎల్బీ) రూట్ 19; గిల్ (బ్యాటింగ్) 65; రజత్ (సి) రెహాన్ (బి) హార్ట్లీ 0; కుల్దీప్ (బ్యాటింగ్) 3; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 51 ఓవర్లలో 196/2. వికెట్ల పతనం:** 1-30, 2-191. **బౌలింగ్:** అండర్సన్ 6-1-32-0; రూట్ 14-2-48-1; హార్ట్లీ 15-2-42-1; ఉడ్ 8-0-38-0; రెహాన్ 8-0-31-0.

తల్లి అనారోగ్యం వల్లే..

తల్లి తీవ్ర అనారోగ్యం కారణంగానే అశ్విన్ అర్ధంతరంగా మూడో టెస్టును వీడినట్టు సమాచారం. రెండో రోజు ఆటలో 500 వికెట్లు పూర్తి చేసిన అశ్విన్ శుక్రవారమే చెన్నై బయలుదేరాడు. 'అశ్విన్ తల్లి వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. ఈ సమయంలో ఆమెతో పాటు ఉండేందుకు అశ్విన్ చెన్నైకి వెళ్లనున్నాడు' అని బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.

వెన్నునొప్పితో మైదానం వీడాడు



భారత్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో కదం తొక్కిన యశస్వీ జైస్వాల్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. శతకం పూర్తయిన కాసేపటికే అతను వెన్నునొప్పితో విలవిల్లాడాడు. వెంటనే ఫిజియో వచ్చి చికిత్స చేసినా.. కాసేపటికే మళ్లీ నొప్పితో బాధపడ్డాడు. దీంతో అతను మైదానం వీడడంతో రజత్ క్రీజులోకి వచ్చాడు. అయితే జైస్వాల్ నొప్పి తీవ్రతను బట్టి నాలుగో రోజు బరిలోకి దిగుతాడా లేదా అనేది తేలుతుంది.

ప్రపంచ టీటీలో భారత్ బోణీ

బుసాన్ (కొరియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు బోణీ కొట్టింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో శరత్ కమల్ సారథ్యంలోని భారత్ 3-0తో చిలీపై గెలిచింది.

లంక ఉత్కంఠ విజయం

దంబుల్లా: అఫ్ఘానిస్థాన్‌తో హోరాహోరీగా సాగిన తొలి టీ20లో శ్రీలంక 4 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయాన్ని అందుకొంది. తొలుత శ్రీలంక 19 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో అఫ్ఘాన్ ఓవర్లన్నీ ఆడి 156/9 స్కోరు మాత్రమే చేసింది.

స్వర్ణ చరిత్రకు అడుగు దూరం



అన్‌మోల్

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్

ఫైనల్లో భారత అమ్మాయిలు

- సెమీస్‌లో జపాన్‌పై సంచలన విజయం
- థాయ్‌లాండ్‌తో టైటిల్ పోరు నేడు

షా ఆలమ్ (మలేసియా): యువ సంచలనాల అద్భుత పోరాటంతో.. ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ చరిత్రకు భారత మహిళల జట్టు అడుగు దూరంలో నిలిచింది. స్టార్ షట్లర్ సింధు తీవ్రంగా నిరాశపర్చినా.. నేటి తరం ప్లేయర్లు అన్‌మోల్ కర్బ్, అస్మితతోపాటు గాయత్రి జోడీ పట్టువీడకుండా పోరాడారు. దీంతో శనివారం ఉత్కంఠగా జరిగిన సెమీఫైనల్లో భారత్ 3-2తో పటిష్ఠ జపాన్‌కు షాకిచ్చింది. ఆదివారం జరిగే తుది పోరులో థాయ్‌లాండ్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. 2016, 2020లో పురుషుల జట్టు కాంస్య పతకాలు సాధించడమే ఈ ఈవెంట్‌లో ఇప్పటిదాకా భారత్‌కు అత్యుత్తమ ప్రదర్శన. జపాన్‌తో పోరులో 2-2తో సమంగా నిలిచిన స్థితిలో నిర్ణాయక, ఆఖరి సింగిల్స్‌లో బరిలోకి దిగిన హరియాణాకు చెందిన 17 ఏళ్ల అన్‌మోల్ 21-14, 21-18తో వరల్డ్ నెం.29 నట్సుకి నిదైరాకు షాకిచ్చింది. ఫలితంగా టీమిండియాను ఫైనల్‌కు చేర్చింది. గ్రూప్ దశలో చైనాపై గెలుపులోనూ అన్‌మోల్ కీలకపాత్ర పోషించింది. అయితే, తొలి సింగిల్స్‌లో సింధు 13-21, 20-22తో అయా ఒహోరి చేతిలో ఓడింది. కానీ, డబుల్స్‌లో 73 నిమిషాలపాటు సాగిన పోరులో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల జంట 21-17, 16-21, 22-20తో వరల్డ్ నెం.6 జోడీ మట్సుయామ-చిహారు షిడాపై నెగ్గి 1-1తో సమం చేసింది. ఆ తర్వాత జరిగిన మరో సింగిల్స్‌లో అస్మిత 21-17, 21-14తో ప్రపంచ మాజీ చాంపియన్ ఒకుహరాను చిత్తు చేసింది. దీంతో భారత్ 2-1తో పైచేయి సాధించింది. అయితే, తనీషా నొప్పితో బాధపడుతుండడంతో.. అశ్విని పొన్నప్పకు జోడీగా సింధు డబుల్స్ బరిలోకి దిగింది. కానీ 11వ ర్యాంకర్ రీనా మియురా-అకాయో సకుమోటో ద్వయం చేతిలో 14-21, 11-21తో సింధు-అశ్విని ఓడింది. ఇక, నిర్ణాయక మ్యాచ్‌లో తీవ్ర ఒత్తిడి మధ్య బరిలోకి దిగిన అన్‌మోల్ ప్రత్యర్థిని చిత్తుచేసి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించింది.



జ్యోతి మరోసారి..

- 60 మీ. హర్డిల్స్‌లో జాతీయ రికార్డు
- స్వర్ణం కొల్లగొట్టిన తెలుగు అథ్లెట్

విశాఖపట్నం (స్పోర్ట్స్): భారత స్ర్పింట్ స్టార్, తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ తన జాతీయ రికార్డును తానే మరోసారి తిరగరాసింది. శనివారం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో జరిగిన ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 60 మీటర్ల హర్డిల్స్‌లో ఆమె 8.12 సెకన్లలో గమ్యం చేరి స్వర్ణ పతకం కొల్లగొట్టింది. 2022 ఆసియా క్రీడల్లో 100 మీ. హర్డిల్స్‌లో రజత పతకం నెగ్గిన జ్యోతికి 60 మీటర్ల హర్డిల్స్‌లో గత అత్యుత్తమ టైమింగ్ 8.13 సెకన్లు. నిరుడు ఈ టోర్నీలోనే ఆమె ఆ రికార్డు నెలకొల్పింది. అయితే అప్పుడు రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న జ్యోతి ఈసారి విజేతగా నిలిచి సత్తా చాటింది. అసుక టెరెడా (జపాన్) రజతం, లి లా యి (హాంకాంగ్) కాంస్యం అందుకున్నారు.

తనయ్ పాంచ్ పటాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తనయ్ త్యాగరాజన్ (5/103) తన స్పిన్‌తో మాయ చేయడంతో ప్రత్యర్థి మేఘాలయ జట్టును హైదరాబాద్ తొలిరోజే ఆలౌట్ చేసింది. శనివారం ఉప్పల్ స్టేడియంలో మొదలైన ఈ రంజీ ప్లేట్ ట్రోఫీ ఫైనల్లో మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులకు ఆలౌటైంది. రాజ్ బిశ్వ (64), ఆకాశ్ చౌధురి (50 నాటౌట్) రాణించారు. తనయ్ 5, రోహిత్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన హైదరాబాద్ ఆట ముగిసేసరికి 5 ఓవర్లలో 2 వికెట్లకు 25 రన్స్ చేసింది. క్రీజులో కెప్టెన్ తిలక్ వర్మ (10), రాహుల్ సింగ్ (9) ఉన్నారు.




సాకేత్ జోడీదే బెంగళూరు టైటిల్

బెంగళూరు: బెంగళూరు ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను తెలుగు ఆటగాడు సాకేత్ మైనేని జంట సొంతం చేసుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ జోడీ 6-3, 6-4తో ఫ్రాన్స్ ద్వయం మాక్సిమ్-కోజ్‌మైన్‌పై గెలిచింది. గత వారం చెన్నై ఓపెన్ నెగ్గిన సాకేత్-రామ్ జోడీకిది వరుసగా రెండో టైటిల్. కాగా, సింగిల్స్‌లో రెండో సీడ్ సుమిత్ నగల్‌కు చుక్కెదురైంది. సెమీస్‌లో నగల్ 6-7(2), 4-6తో ఏడో సీడ్ స్టెఫనో నపోలిటానో (ఇటలీ) చేతిలో ఓడాడు.

బిజినెస్

నోవార్టిస్ ఇండియాపై డాక్టర్ రెడ్డీస్ నజర్!

మెజారిటీ వాటా కోసం చర్చలు



న్యూఢిల్లీ: దేశ ఫార్మా రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. స్విట్జర్లాండ్‌కు చెందిన నోవార్టిస్ ఏజీ భారత్‌లోని తన అనుబంధ సంస్థ నోవార్టిస్ ఇండియాను అమ్మకానికి పెట్టింది. ఈ లిస్టెడ్ కంపెనీలో తనకున్న 70.68 శాతం వాటాను విక్రయించే విషయాన్ని పరిశీలిస్తోంది. ఈ వాటా కొనుగోలుకు హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఆసక్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. అయితే ఈ వార్తలపై స్పందించేందుకు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ నిరాకరించింది. నోవార్టిస్ ఇండియా మాత్రం 'నోవార్టిస్ ఏజీ భారత్‌లోని తన వ్యాపారాలను వ్యూహాత్మకంగా సమీక్షిస్తోంది. నోవార్టిస్ ఇండియా ఈక్విటీలో ఉన్న 70.68 శాతం వాటా అమ్మకం కూడా ఇందులో భాగం. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు' అని తెలిపింది.

డాక్టర్ రెడ్డీస్‌తో మార్కెటింగ్ డీల్

నోవార్టిస్ ఇండియా ఇప్పటికే అమ్మకాలు, మార్కెటింగ్ నుంచి తప్పుకుంది. కంపెనీ ఉత్పత్తి చేసే ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ లేబరోటరీస్ మార్కెట్ చేస్తోంది. ఇందుకోసం రెండు కంపెనీల మధ్య 2022 ఫిబ్రవరిలోనే ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కింద నోవార్టిస్ ఇండియా ఉత్పత్తి చేసే వోవెరన్, కాల్షియం, మెథెర్జిన్ ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ మార్కెట్ చేస్తోంది. నోవార్టిస్ ఇండియా ఈక్విటీలో 70.68 శాతం వాటా కొనుగోలు ద్వారా ఫార్మా రంగంలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ యోచిస్తున్నట్టు సమాచారం.

ఆస్ట్రేలియాలో ఎన్‌ఎండీసీ పసిడి వేట

వచ్చే రెండు నెలల్లో ఉత్పత్తి



ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని ఎన్‌ఎండీసీ లిమిటెడ్.. ఆస్ట్రేలియాలో పసిడి వేట ప్రారంభించింది. ఇందుకోసం ఆ దేశ పశ్చిమ ప్రాంతంలోని మౌంట్ బేవన్ ప్రాంతంలో ఒక గని తవ్వకం ప్రారంభించింది. ఒకటి రెండు నెలల్లో ఈ గని నుంచి పసిడి ఉత్పత్తి ప్రారంభం అవుతుందని మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల తర్వాత విడుదల చేసిన ప్రకటనలో ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. వచ్చే ఏడాదిన్నర, రెండేళ్ల కాలంలో ఈ ప్రాంతంలో మరిన్ని గనులు తవ్వేందుకూ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ప్రకటించారు.

లిథియం కోసం అన్వేషణ

ఇనుప ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న ఎన్‌ఎండీసీ లిథియం ఉత్పత్తికీ సిద్ధమవుతోంది. విద్యుత్ వాహనాల బ్యాటరీల తయారీలో లిథియం కీలక ముడి పదార్థం. మన దేశంలో లిథియం నిక్షేపాలు చాలా పరిమితంగానే ఉన్నాయి. దీంతో ఆస్ట్రేలియాతో సహా వివిధ దేశాల్లో ఈ నిక్షేపాల గనుల కోసం ఎన్‌ఎండీసీ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే హాన్‌కాక్ అనే ఆస్ట్రేలియా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. మౌంట్ బేవన్ ప్రాంతంలోనే లిథియం నిక్షేపాలు కూడా ఉన్నట్టు భావిస్తున్నారు. వచ్చే రెండు మూడు నెలల్లో హాన్‌కాక్ కంపెనీతో కలిసి ఈ ప్రాంతంలో లిథియం నిక్షేపాల కోసం అన్వేషణ ప్రారంభించనున్నట్టు ముఖర్జీ తెలిపారు.

పటిష్ఠ నాయకత్వంతోనే లక్ష్య సాధన

భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా



హైదరాబాద్: ఔత్సాహిక పారిశ్రామికవేత్త కావాలన్న సంకల్పం, నవకల్పనలపై దృష్టి సారించటంతో పాటు పటిష్ఠమైన నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగితేనే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతామని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు. శనివారం నాడిక్కడ ఐఎస్‌బీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌ను మరింత వృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలంటే నూతనోత్సాహంతో పనిచేసే యువత ఎంతో అవసరమని, ఇందుకు ఐఎస్‌బీ వంటి సంస్థలు తోడ్పాటునందిస్తూ వస్తున్నాయన్నారు. భారత్‌లో ఇప్పటికే బలమైన స్టార్టప్ వ్యవస్థ ఉందని, ఇది దేశాన్ని ఆర్థికంగా ఎంతో బలోపేతం చేస్తోందన్నారు. తాజాగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ధైర్యంతో, అత్యున్నత ఆశయాలతో ముందుకు సాగుతూ దేశాభివృద్ధికి పాటు పడాలని పిలుపునిచ్చారు. కాగా 2023 పీజీపీఎంఏఎక్స్, పీజీపీప్రో క్లాస్, 2022 పీజీపీ ఎంఎఫ్ఏబీ క్లాస్, 2022 ఏఎంపీబీఏ క్లాస్, 2023 క్లాస్‌లకు సంబంధించి మొత్తం 611 మంది విద్యార్థులకు ఐఎస్‌బీ పట్టాలను ప్రదానం చేసింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.450 కోట్ల టర్నోవర్

2024-25లో రెట్టింపు ఆదాయం
జెన్ టెక్నాలజీస్ సీఎండీ అశోక్

Zen Technologies

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జెన్ టెక్నాలజీస్ భవిష్యత్ వ్యాపార అవకాశాలపై అత్యంత ఆశాభావంతో ఉంది. 2022 డిసెంబరు త్రైమాసికంలో రూ.32.93 కోట్లు ఉన్న కంపెనీ ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.98 కోట్లకు చేరింది. ఇదే సమయంలో కంపెనీ నికర లాభం కూడా రూ.7.58 కోట్ల నుంచి ఐదు రెట్లు పెరిగి రూ.31.66 కోట్లకు చేరింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి టర్నోవర్ రూ.450 కోట్లకు చేరుతుందని కంపెనీ సీఎండీ అట్లూరి అశోక్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా టర్నోవర్‌ను రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

రూ.1,434 కోట్ల ఆర్డర్లు

డిసెంబరు త్రైమాసికం చివరి నాటికి జెన్ టెక్నాలజీస్ చేతిలో రూ.1,434 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. ఇందులో రూ.997 కోట్లు దేశీయ ఆర్డర్లు కాగా రూ.437 కోట్లు ఎగుమతి ఆర్డర్లు. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలోనూ కంపెనీ రూ.129 కోట్ల విలువైన ఆర్డర్లు సంపాదించింది. యాంటీ డ్రోన్ సిస్టమ్స్‌తో పోలిస్తే సిమ్యులేటర్లలోనే లాభాలు ఎక్కువగా ఉన్నట్టు అశోక్ తెలిపారు. ప్రస్తుతం తమ ఆర్డర్ బుక్‌లో 56 నుంచి 57 శాతం సిమ్యులేటర్లు, 43 శాతం యాంటీ డ్రోన్ సిస్టమ్స్ ఉన్నట్టు వెల్లడించారు.

ఎల్ఐసీ నుంచి 'అమృత్‌బాల్' పాలసీ

హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. అమృత్‌బాల్ పేరుతో కొత్త ఎండోమెంట్ పాలసీ ప్రారంభించింది. ఈ వ్యక్తిగత, పొదుపు, జీవిత బీమా పాలసీలో 30 రోజుల నుంచి 13 సంవత్సరాల పిల్లలు ఎవరైనా చేరవచ్చు. భవిష్‌లో పిల్లల ఉన్నత విద్య, ఇతర అవసరాలకు తగినన్ని నిధులు సమకూర్చేలా ఎల్ఐసీ ఈ పాలసీని రూపొందించింది.

పాలసీ ముఖ్యాంశాలు

- పాలసీ తీసుకున్నప్పటి నుంచి పాలసీ ముగిసే వరకు బీమా మొత్తంలో ప్రతి రూ.1,000పై ఏటా రూ.80 అదనపు చెల్లింపులకు హామీ
- 18 నుంచి 25 సంవత్సరాల మధ్య పాలసీ మెచ్యూరిటీ
- 5, 6 లేదా ఏడేళ్ల కాలపరిమితితో స్వల్పకాలిక ప్రీమియం చెల్లించే సదుపాయం
- పదేళ్ల కనిష్ఠ కాలపరిమితితో లిమిటెడ్ ప్రీమియం చెల్లింపు సదుపాయం
- ఐదేళ్ల కాల పరిమితితో సింగిల్ ప్రీమియం సదుపాయం
- లిమిటెడ్/సింగిల్ ప్రీమియం పాలసీల ప్రీమియం చెల్లింపు గడువు
- గరిష్ఠంగా 25 సంవత్సరాలు
- పీఓఎస్‌పీ-ఎల్ఐ/సీపీఎస్‌సీ-ఎస్‌పీవీల ద్వారా కొనుగోలు చేసే అమృత్‌బాల్ పాలసీలకు గరిష్ఠంగా 20 ఏళ్ల గడువు
- కనిష్ఠంగా రూ.2 లక్షల బీమా. గరిష్ఠ పరిమితి లేదు
- మెచ్యూరిటీ సమయంలో బీమా మొత్తంతో పాటు హామీ ఇచ్చిన అదనపు మొత్తాల చెల్లింపు
- మెచ్యూరిటీ మొత్తాన్ని 5,10,15వ సంవత్సరం వాయిదాల్లో తీసుకునే సౌలభ్యం
- సింగిల్/లిమిటెడ్ పీరియడ్ ప్రీమియం చెల్లింపు ఆప్షన్స్ రెండింటిలో సమ్ అష్యూర్డ్ ఆన్ డెత్ ఆప్షన్

యాక్సిస్ బీఎస్ఈ సెనెక్స్ ఇండెక్స్ ఫండ్


యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ టీఆర్ఐను ఈ ఫండ్ ట్రాక్ చేస్తుంది. లార్జ్ క్యాప్ కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఒకే ఇండెక్స్‌తో వివిధ రంగాల్లోని అవకాశాలు చేజిక్కించుకోవటంతో పాటు ఇన్వెస్టర్లకు దీర్ఘకాలం పాటు మంచి రిటర్నులు అందించే విధంగా దీన్ని తీర్చిదిద్దినట్లు యాక్సిస్ ఎంఎఫ్ వెల్లడించింది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 22. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500.

యూనియన్ బిజినెస్ సైకిల్ ఫండ్

యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్.. యూనియన్ బిజినెస్ సైకిల్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న వ్యాపార వాతావరణానికి అనుగుణంగా ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. మార్కెట్లో చురుగ్గా ఉన్న రంగాలతో పాటు కొద్దిగా వెనుకబడిన రంగాల మధ్య సమతుల్యత పాటిస్తూ ఈ ఫండ్ ఎప్పటికప్పుడు పెట్టుబడులపై నిర్ణయం తీసుకుటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఫిబ్రవరి 27.

బరోడా బీఎన్‌పీ పరిబా ఇన్నోవేషన్ ఫండ్

బరోడా బీఎన్‌పీ పరిబా ఎంఎఫ్.. బరోడా బీఎన్‌పీ పరిబా ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇన్నోవేషన్ థీమ్‌తో తీసుకువచ్చిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. ఇన్నోవేటివ్ కంపెనీలపై ప్రధానంగా దృష్టి పెట్టడంతో పాటు వాటిల్లో పెట్టుబడులు పెట్టి దీర్ఘకాలం మంచి రిటర్నులు అందించటం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 28. కనీస పెట్టుబడి రూ.1,000.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,400 ▲	57,200 ▲	78,000 ▲
ముంబై	61,743 ▲	56,557 ▲	70,922

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ		విజయవాడ	542
హైదరాబాద్	554	విశాఖపట్నం	555
18వ తేదీ		వరంగల్	556
చిత్తూరు	603		
గోదావరి	542	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	గోదావరి	134
వరంగల్	130	విజయవాడ	134
కరీంనగర్	130	గుంటూరు	135
మహబూబ్‌నగర్	130	ఒంగోలు	135
కర్నూలు	130	చిత్తూరు	135
విశాఖపట్నం	122		



జువెలరీ రంగ ప్రముఖుడు, జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్.. తన ఆత్మకథ 'స్ప్రెడింగ్ జాయ్'ను బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులకు అందజేశారు. బ్రిటిష్ సౌత్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ కామర్స్ (బీఎస్ఐసీసీ) లండన్‌లోని గ్రిమాండ్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులు మార్టిన్ డే, వీరేంద్ర శర్మ, స్టీఫెన్ టిమ్స్ సహా బరోనెస్ ఉడ్డీన్‌లకు తన ఆత్మకథను బహూకరించారు. బ్రిటిష్ పార్లమెంటేరియన్స్‌కు నా కథను తెలియజేయటం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జోయ్ అలుక్కాస్ ఈ సందర్భంగా అన్నారు. కాగా ఇటీవల తన ఆత్మ కథను భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా జోయ్ అలుక్కాస్ అందజేశారు.

హైదరాబాద్‌లో తగ్గిన గృహ రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ: జనవరి నెల హైదరాబాద్ రియల్టీకి పెద్దగా కలిసి రాలేదు. గత ఏడాది జనవరితో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్‌లో గృహ రిజిస్ట్రేషన్లు ఒక శాతం తగ్గాయి. గత నెల హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 5,411 గృహ రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా వెల్లడించింది. గత నెల రిజిస్ట్రేషన్లు జరిగిన గృహాల విలువ మాత్రం గత ఏడాది జనవరితో పోలిస్తే 24 శాతం పెరిగి రూ.3,279 కోట్లకు చేరింది. గత నెల రిజిస్ట్రేషన్లు జరిగిన గృహాల్లో 47 శాతం ఇళ్ల సగటు ధర రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల మధ్య ఉంది. రూ.కోటి అంతకు మించిన విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు మాత్రం 8 శాతం నుంచి 14 శాతానికి పెరిగాయి. గత నెల రిజిస్ట్రేషన్లు జరిగిన ఇళ్లలో 71 శాతం ఇళ్ల సగటు విస్తీర్ణం 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల వరకు ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ తెలిపింది.

నాడు దేవాలయం..!
నేడు బొందలగడ్డా?

- మేడిగడ్డ అలా ఎందుకైందో కేసీఆరే చెప్పాలి
- పిల్లర్లు కుంగాక 45 రోజులు సీఎంగా ఉన్నారు
- అప్పుడే నీటిని ఎందుకు ఎత్తిపోయలేదు?
- శాసనసభలో మంత్రి పొంగులేటి సూటి ప్రశ్న



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టును దేవాలయంగా అభివర్ణించిన కేసీఆర్.. నేడు మేడిగడ్డను బొందల గడ్డగా పేర్కొనడం దురదృష్టకరమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేడిగడ్డ బొందల గడ్డ ఎలా అయ్యిందో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఇటీవల నల్లగొండ సభలో మేడిగడ్డ సందర్శనకు వెళ్లిన కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి.. 'బొందలగడ్డను చూడడానికి పోయారా?' అన్న కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి కౌంటర్ ఇచ్చారు. గతంలో దేవాలయమైన ప్రాజెక్టు ఇప్పుడు బొందలగడ్డ ఎందుకైందో చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం శిల్పాన్ని చెక్కిన కేసీఆర్.. సభలో ఉండి ఉంటే బీటలు వారిన పిల్లర్లకు, శిల్పానికి ఒక పరిష్కారం చూపేవారేమోనంటూ ఎద్దేవా చేశారు. సభకు వచ్చి ఎందుకు వివరణ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. గత అక్టోబరులో మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోతే డిసెంబరు 6 వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కేసీఆరే ఉన్నారని.. ఆ 45 రోజుల్లో నీళ్లు ఎందుకు ఎత్తిపోయలేదని పొంగులేటి నిలదీశారు. 2017లో కేసీఆర్ అధ్యక్షతన ప్రగతి భవన్‌లో జరిగిన ఇరిగేషన్ సమావేశంలో ఆ శాఖ మంత్రిగా హరీశ్ కూడా పాల్గొన్నారని, అక్కడే అవినీతికి బీజం పడిందని ఆరోపించారు. ఆత్రుతగా కాకుండా నాణ్యంగా ప్రాజెక్టు కట్టి ఉంటే.. రూ.లక్ష కోట్ల ప్రజాధనం వృథా అయ్యేది కాదన్నారు.



సాగు పెరిగింది సమృద్ధి వర్షాలతోనే

- తొమ్మిదేళ్లలో రాష్ట్రంలో 10 లక్షల బోర్లు తవ్వారు
- వాటి కింద 40 లక్షల ఎకరాల సాగు: తుమ్మల



హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగింది సమృద్ధిగా కురిసిన వర్షాలతోనేని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో వానలు బాగా పడ్డాయని పేర్కొన్నారు. దీంతో భూగర్భ నీటి మట్టం పెరిగిందని తెలిపారు. ఫలితంగా 10 లక్షల పైగా కొత్తగా బోరు బావులను తవ్వారని వివరించారు. ఒక్కో బోరు కింద నాలుగు ఎకరాల చొప్పున అదనంగా 40 లక్షల ఎకరాలు సాగుబడిలోకి వచ్చిందని స్పష్టం చేశారు. తద్వారా పంట దిగుబడులు కూడా పెరిగాయన్నారు. సాగు నీటి రంగంపై శ్వేతపత్రంపై చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014లో 95 లక్షల టన్నులుగా ఉన్న ధాన్యం ఉత్పత్తి నేడు 3.25 లక్షల టన్నుల చేరిందని.. బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై తీసుకున్న చొరవే దీనికి కారణమని తెలిపారు. పల్లా వ్యాఖ్యలకు కౌంటర్‌గా మంత్రి తుమ్మల సాగు పెరిగేందుకు కారణాలను వివరించారు.

తెలంగాణను నట్టేట ముంచారు

గత బీఆర్ఎస్ ప్రభుత్వానివి తప్పుడు విధానాలు.. నీటిపారుదల రంగంలో విధ్వంసక ధోరణి

- 1.81 లక్షల కోట్ల ఖర్చు.. 15.81 లక్షల ఎకరాలకే నీళ్లు
- 2014కు ముందు ఎకరా ఖర్చు 93 వేలు
- గత పదేళ్లలో ఎకరా ఖర్చు 11.45 లక్షలు
- కాళేశ్వరం ప్రాజెక్టులోని పంపులన్నీ తిప్పితే 220 మిలియన్ యూనిట్ల కరెంట్ కావాలి
- రాష్ట్ర వినియోగమే 196 మి. యూనిట్లు
- నీటిపారుదల శాఖపై సర్కారు శ్వేతపత్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులపై బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేళ్లలో అనుసరించిన విధ్వంసక ధోరణి.. తెలంగాణను నట్టేట ముంచిందని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది. గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాలు, భారీ అప్పులు, అవినీతి, అడుగడుగునా జరిగిన అవకతవకలు రాష్ట్రానికి పూడ్చలేనంత నష్టం చేశాయని తెలిపింది. ప్రాజెక్టుల రీ డిజైనింగ్‌తోపాటు కొత్త ప్రాజెక్టుల ప్లానింగ్‌లో లోపాలున్నాయని, పాత ప్రాజెక్టుల నిర్వహణను పట్టించుకోలేదని పేర్కొంది. 2014కు ముందు ఎకరం ఆయకట్టుకు నీరివ్వడానికి జరిగే పనులకు అయిన ఖర్చు రూ.93 వేలు కాగా, గత పదేళ్లలో ఎకరా సాగునీటిని అందించే పనులకు చేసిన ఖర్చు అక్షరాలా రూ.11.45 లక్షలు అని వెల్లడించింది. 2014 దాకా సాగునీటి ప్రాజెక్టులకు రూ.54,234 కోట్లు వెచ్చిస్తే.. ఏకంగా 57.79 లక్షల ఎకరాల భూమి సాగులోకి వచ్చిందని తెలిపింది. కానీ, 2014 నుంచి 2023 దాకా రూ.1,81,067 కోట్లు వెచ్చిస్తే.. 15.81 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సాగులోకి వచ్చిందని వివరించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖపై శనివారం అసెంబ్లీలో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దీనిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని పంపులన్నీ తిరిగితే రోజుకు 220 మిలియన్ యూనిట్ల కరెంట్ అవసరం అవుతుందని, ఇది రాష్ట్ర రోజువారీ సగటు విద్యుత్తు వినియోగం (196.06 మిలియన్ యూనిట్లు) కన్నా అధికమని తెలిపారు. ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వం చేసిన అప్పులు తడిసి మోపడయ్యాయని, ఈ అప్పులకు వడ్డీలు కలిపి రాబోయే పదేళ్లలో రూ.1,35,654 కోట్లు చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. వీటిలో అసలు వాటా రూ.79,343 కోట్లు కాగా.. వడ్డీలు రూ.56,310 కోట్లు అవుతుందని ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో నీటిపారుదల శాఖ వార్షిక రుణభారం16 వేల కోట్లకు చేరుతుందని, ఇది స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో ఒక శాతమని, శాఖ వార్షిక బడ్జెట్ కేటాయింపుల కంటే అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు.



ప్రాజెక్టుల వ్యయంలో 46 శాతం రుణాలే

2014 నుంచి 2023 దాకా ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూ.1,81,067 కోట్లు వెచ్చించగా.. అందులో రూ.84,090 కోట్లు.. అంటే మొత్తం వ్యయంలో 46% రుణ రూపంలో సమీకరించుకున్నవేనని ప్రభుత్వం వెల్లడించింది.

సంవత్సరం	ప్రాజెక్టుల వ్యయం	రుణం
2014-15	5,194	0
2015-16	7,776.01	0
2016-17	14,149	4,84.46
2017-18	23,398.09	10,802.19
2018-19	31,055.57	21,937.92
2019-20	24,019.05	14,531.37
2020-21	19,144.33	10,754.25
2021-22	30,233.89	16,696.94
2022-23	88,83.29	17,345.34
2023-24	8,752.31	0
మొత్తం	1,81,067	84,090

(రూ.కోట్లలో)

తెలంగాణ పాలిట గుదిబండలా కాళేశ్వరం!

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు గుదిబండగా మారిందని ప్రభుత్వం చెప్పింది. ఏడు లింకులు, 28 ప్యాకేజీలుగా, 1500 కిలోమీటర్ల కాలువలు, 200 కిలోమీటర్ల సొరంగాలు, 141 టీఎంసీల సామర్థ్యంతో 15 జలాశయాలు, 3 బ్యారేజీలు, 21 పంప్‌హౌ్‌లు, 19 సబ్‌స్టేషన్లతో రోజుకు 2 టీఎంసీలు తరలించేలా కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు వేగంతో కట్టామని గత ప్రభుత్వం చెప్పుకొన్నదని గుర్తు చేసింది. కానీ, ప్లానింగ్, డిజైన్ల లోపంతో ఈ ప్రాజెక్టు ఐదేళ్లలోనే మూలన పడిందని, అవసరం లేకున్నా అదనంగా మరో టీఎంసీ నీటిని తరలించే ప్రాజెక్టు చేపట్టారని ఆక్షేపించింది. ఐదేళ్లలో కన్నెపల్లి (మేడిగడ్డ), సిరిపురం (అన్నారం), సుందిళ్ల పంప్‌హౌస్‌ల నుంచి 162.36 టీఎంసీల నీటిని ఎత్తిపోయగా.. 51 టీఎంసీలను గోదావరిలో వదిలిపెట్టారని తెలిపింది. మిగిలిన 75 టీఎంసీలు రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ వంటి రిజర్వాయర్‌లలో నిల్వ ఉన్నాయని, 10 టీఎంసీలు ఆవిరి నష్టాలు పోను.. 26 టీఎంసీలు మాత్ర మే సాగుకు అందించారని వెల్లడించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ గతేడాది (2023) అక్టోబరు 21న కుంగిపోయిందని, అంతకుముందే 2022 జూలై 14న గోదావరి వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ రక్షణ గోడ (బ్రెస్ట్ వాల్) కూలిపోయి భారీ నష్టం సంభవించిందని ప్రభుత్వం గుర్తు చేసింది. సిరిపురం(అన్నారం) పంప్ హౌస్ కూడా నీట మునిగిందని తెలిపింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన తర్వాత జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం పరిశీలించి.. ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ లోపాల వల్లే కుంగినట్లు నివేదిక సమర్పించిందని వెల్లడించింది. సీకెంట్ పైల్స్ నిర్మాణంలో నాణ్యత లేకపోవడం, రాఫ్ట్ కటాఫ్‌ల మధ్య ప్లింత్ కనెక్షన్‌లలో లోపం , సీకెంట్ పైల్స్ నిర్మాణంలో ఖాళీలు ఏర్పడి, ఇసుక పైపింగ్ జరిగి.. బ్యారేజీ కుంగినట్లు తేల్చిందని పేర్కొంది. బ్యారేజీని 2019 జూన్‌లో ప్రారంభించగా.. ఆ సంవత్సరమే మేడిగడ్డ బ్యారేజీలో పగుళ్లను గుర్తించడం జరిగిందని, వెయిరింగ్ కోట్‌లో ఉన్న సీసీ బ్లాకులు కొట్టుకుపోయినట్లు గుర్తించారని తెలిపింది. డిపార్ట్‌మెంట్ నిర్దేశిత క్రమపద్ధతిలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం చేపట్టలేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో తేలినట్లు వెల్లడించింది. అగ్రిమెంట్ ప్రకారం ఎల్‌అండ్‌టీ నిర్మాణ పనులు చేయకుండా పెండింగ్‌లో పెట్టినప్పటికీ బ్యాంకు గ్యారంటీలు విడుదల చేశారని ఆక్షేపించింది. ఇక అన్నారం బ్యారేజీలోని పిల్లర్ల కింది నుంచి భారీగా బుంగలు ఏర్పడ్డాయని, అవి కూడా కుంగడానికి సిద్ధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.

ఏటా చెల్లించాల్సిన రుణాలు

కాళేశ్వరం కార్పొరేషన్ కింద రూ.66,871 కోట్లు రుణంగా తీసుకోగా.. దీనికి వడ్డీ 2033-34 దాకా రూ.48,191 కోట్లు చెల్లించాల్సి ఉందని ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ రాష్ట్ర నీటి వనరుల అభివృద్ధి సంస్థ లిమిటెడ్ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీఎల్) కింద రూ.12,472 కోట్లు రుణంగా తీసుకోగా.. వడ్డీల కింద రూ.8119 కోట్లను చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది.

సంవత్సరం	కట్టాల్సిన రుణాలు (వడ్డీ/అసలు కలిపి)
2024-25	16,633
2025-26	16,144
2026-27	15,547
2027-28	14,578
2028-29	14,167
2029-30	13,384
2030-31	12,764
2031-32	11,722
2032-33	10,663
2033-34	9,754
మొత్తం	1,35,654

(రూ.కోట్లలో)

ఇందులో అసలు రూ.79,343 కోట్లు, వడ్డీ రూ.56,310 కోట్లు

నిధులు వెచ్చించినా ఆయకట్టు ఏదీ?

వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కోసం గత ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించినా ఆశించిన స్థాయిలో ఆయకట్టును సాధించలేదని కాంగ్రెస్ ప్రభుత్వం గణాంకాలతో వివరించింది. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 13.22 లక్షల ఎకరాల ఆయకట్టును రూపొందించడానికి ఎత్తిపోతల పథకాలకు రూ.39,119 కోట్లు వెచ్చించగా.. 2014 నుంచి 2023 దాకా రూ.1,33,874 కోట్లను ఎత్తిపోతల పథకాలకు వెచ్చించి... సాధించిన ఆయకట్టు 98,590 ఎకరాలు మాత్రమేనని ప్రకటించింది.

తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉంటాం

కృష్ణా నదీ జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉంటామని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాను సాధించుకుంటామని, గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన కృష్ణా ప్రాజెక్టులను పూర్తిచేసి, దక్షిణ తెలంగాణ ప్రాంతంలో ఆయకట్టుకు నీరందించి రైతులకు అండగా ఉంటామని పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల, రాజీవ్ భీమా ఎత్తిపోతల, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల, కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల, చిన్న కాళేశ్వరం, ఎస్ఎల్‌బీసీ, శ్రీపాద ఎల్లంపల్లి, ఇందిరమ్మ వరద కాలువ, మిడ్‌మానేరు, కుమ్రం భీం, దేవాదుల ఎత్తిపోతల పథకాలను వీలైనంత త్వరగా పూర్తిచేస్తామని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను ఏఐబీపీ-పీఎం కేఎస్‌వై నిధులతో పూర్తిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఈ ఏడాది 9 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపింది.

ప్రాజెక్టులు	నిర్మాణ అంచనా వ్యయం	వెచ్చించిన నిధులు	సాధించిన ఆయకట్టు
కాళేశ్వరం ఎత్తిపోతల	1,27,872	93,872	98,000ఎకరాలు
పాలమూరు-రంగారెడ్డి	55086	27554	0
సీతమ్మ/సీతారామ	21768.08	9204	0
తుపాకులగూడెం	2251	1991	0
చనాకా కొరటా	3236.14	1092.66	0
డిండి ఎత్తిపోతల పథకం	9392.77	2987.23	0

(రూ.కోట్లలో)

అన్నారంలోనూ లీకేజీ

బ్యారేజీలో భారీ బుంగలు పడ్డాయి.. మేడిగడ్డ తరహాలో ఇదీ ప్రమాదంలో ఉంది

- కేసీఆర్, హరీశ్‌కు కమీషన్ల కక్కుర్తి
- చరిత్రలోనే కనీవినీ ఎరుగని అవినీతి
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఒకే టెక్నాలజీతో నిర్మించారు. ప్రస్తుతం అన్నారం బ్యారేజీలోనూ భారీ బుంగలు పడ్డాయి. నిన్నటి నుంచి బ్యారేజీలో వాటర్ లీక్ అవుతోంది. మేడిగడ్డ తరహాలో అన్నారం బ్యారేజీ కూడా ప్రమాదంలో ఉంది" అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీలో శనివారం కాళేశ్వరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ఉత్తమ్ మాట్లాడారు. "లోపభూయిష్టమైన ప్రణాళిక, డిజైన్లతో బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, సబ్ స్టేషన్లు నిర్మించారు. ఇంజినీర్లు వాళ్లే, చీఫ్ ఇంజినీర్లు వాళ్లే అయిపోయి ఇష్టమొచ్చినట్లు ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. వందేళ్లు ఉండాల్సిన బ్యారేజీలు మూడేళ్లకే కుప్పకూలాయి. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయిన తర్వాత నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన నివేదికలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోపాటు 2019లో పనులు పూర్తయితే నాలుగేళ్లపాటు ఇన్‌స్పెక్షన్, మెయింటెనెన్స్ కూడా చేయలేదని చెప్పింది. ఆ నివేదిక ఇచ్చే నాటికి ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. ఈ అంశంపై ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇప్పుడేమో మాకు అప్పజెప్పండి రిపేర్ చేస్తాం! అంటున్నారు. మరో పెద్ద మనిషి ఉచిత సలహాలు ఇస్తున్నారు. నాణ్యత లేకుండా మీరే నిర్మించి... ఇప్పుడు మళ్లీ మీరే అడగడం విడ్డూరంగా ఉంది. శ్రీరాంసాగర్‌కు అనుసంధానంగా శ్రీపాద ఎల్లంపల్లి, లోయర్ మానేరు డ్యామ్, మిడ్ మానేరు ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలోనే పూర్తయ్యాయి. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా ఇచ్చిన గోదావరి నీళ్లనే గత ప్రభుత్వం కాళేశ్వరం నీళ్లుగా ప్రచారం చేసుకుంది. చివరకు వర్షపు నీటిని కూడా కాళేశ్వరం ఖాతాలోనే వేసింది" అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, తప్పుడు విధానాల కారణంగా తెలంగాణలో సాగు నీటి వ్యవస్థ చిన్నాభిన్నమైందని, పూడ్చలేనంత నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

మామా, అల్లుళ్లు సిగ్గుతో తల దించుకోవాలి

స్వతంత్ర భారత చరిత్రలో సాగునీటి రంగంలో ఇంత భారీ అవినీతి ఏ రాష్ట్రంలో జరగలేదు. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్, మంత్రిగా పనిచేసిన హరీశ్ రావు.. కమీషన్లకు కక్కుర్తిపడి దోపిడీకి పాల్పడ్డారు. మామా అల్లుళ్లు సిగ్గుతో తలదించుకోవడమే కాదు.. యావత్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రణాళిక, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్, మెయింటెనెన్స్ అంతా లోపభూయిష్టంగా జరిగింది. డిస్ట్రిబ్యూటరీలు, కాల్వలు నిర్మించాలన్న ఆలోచన లేకుండానే పనులు చేపట్టారు. కేసీఆర్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై పెట్టిన ఖర్చుకు.. దక్కిన సామాజిక, ఆర్థిక ప్రయోజనానికి పొంతనే లేదు. సరైన ప్రణాళిక లేకుండా అనేక ప్రాజెక్టులను ఒకేసారి చేపట్టడంతో అవి అసంపూర్తిగా ఉండి.. చివరి ఆయకట్టు రైతులకు నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టులపై రూ.54,234 కోట్లు ఖర్చు చేసి... తెలంగాణలో 41.76 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించారు. కానీ, రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అంతకు మూడు రెట్లు వ్యయం చేసి కేవలం 38శాతం కొత్త ఆయకట్టునే సృష్టించగలిగింది. 2023- 24 వార్షిక బడ్జెట్‌లో 17.21 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రకటించి.. కేవలం 500ఎకరాల ఆయకట్టుకే కొత్తగా నీళ్లిచ్చారు. ప్రాజెక్టులపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు పెట్టడంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు శరాఘాతం కలిగింది.



కృష్ణాజలాల వాటా సాధనలో విఫలం

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాను సాధించటంలో గత ప్రభుత్వం విఫలమైంది. పరీవాహక ప్రాంతానికి అనుగుణంగా నీటి వాటా కోసం పట్టు పట్టకుండా ఏపీకి 512 టీఎంసీలు ఇవ్వడానికి అంగీకరించింది. ఫలితంగా దక్షిణ తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల రైతుల నోటికాడి ముద్ద లాగేసుకున్నట్లయింది. న్యాయబద్ధంగా తెలంగాణకు దక్కాల్సిన 555 టీఎంసీల(68.5 శాతం) నీటిని తెచ్చుకోవాలనే సోయే ఆ ప్రభుత్వానికి లేకుండా పోయింది. కృష్ణా, గోదావరి బోర్డుల ఏర్పాటు గెజిట్ నోటిఫికేషన్‌కు కూడా కేసీఆర్ అంగీకరించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ఉమ్మడి ప్రాజెక్టుల నిర్వహణను కేంద్రానికి అప్పగించేందుకు ఫైళ్లు కదిపారు. 2020 లో పోతిరెడ్డిపాడు కెపాసిటీ 80 వేల క్యూసెక్కులకు పెంచటంతోపాటు పక్కనే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం జీవో జారీచేస్తే ప్రేక్షక పాత్ర పోషించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు కూడా చేయలేదు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక రైతు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి స్టే తెచ్చేంతవరకు అప్పటి ప్రభుత్వం మొద్దు నిద్ర నటించింది. స్వరాష్ట్రంలోనైనా నీళ్ల దోపిడీ ఆగుతుందని ప్రజలు ఆశించగా.. గత పదేళ్లలో ఏకంగా నాలుగింతలు పెరిగిపోయింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ. 27,812 కోట్లు ఖర్చు పెట్టినా.. ఒక్క ఎకరా కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకురాలేదు. రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టును అకారణంగా ఒక్క టీఎంసీకి కుదించారు. సీతారామ, సీతమ్మ సాగర్ విషయంలోనూ ఇలాగే జరిగింది. డిండి, ఎస్ఎల్‌బీసీ, ఆర్డీఎస్‌ను పూర్తిగా పక్కన పెట్టారు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల భవితవ్యం ప్రమాదంలో పడింది. కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తామంటూ మేము ఎక్కడా సంతకాలు చేయలేదు. అబద్ధాలు చెప్తున్న హరీశ్‌రావు.. తన పేరును గోబెల్స్ హరీశ్‌రావుగా మార్చుకోవాలి. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి... రాష్ట్రానికి పర్మినెంట్ శాపంగా మారింది. ఈ వ్యవహారం మొత్తాన్ని ఎన్‌డీఎస్‌ఏకు అప్పజెప్పి, కూలంకషంగా నివేదిక ఇవ్వాలని అడుగుతాం. గత ప్రభుత్వం చేపట్టిన పనులు తెలంగాణకు గుదిబండలా విగిలిపోనున్నాయి. ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై కాగ్, ఎన్‌డీఎస్‌ఏ, విజిలెన్స్ ఇచ్చిన నివేదికల మేరకు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆర్థిక సంక్షోభానికి అప్పటి అప్పులే కారణం

కాగ్, ఎన్‌డీఎస్ఏ చెప్పిన అభిప్రాయాలను వివరిస్తే... అవి పనికిరాని సంస్థలు అన్నట్లుగా ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతున్నారు. ఎవరు ఏమన్నా... మా ప్రభుత్వం మాత్రం వాటిని చాలా విలువైన నివేదికలుగా పరిగణనలోకి తీసుకుంటుంది. గత ప్రభుత్వం చేసిన అడ్డగోలు అప్పులు, అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలే.. ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి కారణం. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, నేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి పరిస్థితిని నివేదించాం. ఈ రుణాలను తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలుగా మార్చాలని కోరగా నిర్మల ఒప్పుకొన్నారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి షెకావత్‌ను కలిసి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటి కేటాయింపుల గురించి అడిగాం. మొదటి ఫేజ్‌లో మైనర్ ఇరిగేషన్ కింద 45 టీఎంసీలను కేటాయిస్తామని, రెండో ఫేజ్ కింద మరో 45 టీఎంసీలు ఇస్తామని ఆయన చెప్పారు. ఏపీలో పోలవరం మాదిరిగానే... పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వాలని అడిగాం. తొమ్మిదేళ్లగా ఏ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని చెప్పిన షెకావత్.. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజనలోని సత్వర సాగునీటి పారుదల ప్రయోజన కార్యక్రమం(ఏఐబీపీ) 60శాతం ఫండింగ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇక, రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని అందిస్తాం. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కొడంగల్-నారాయణ్‌పేట్, చిన్న కాళేశ్వరం, ఎస్ఎల్‌బీసీ, శ్రీపాద ఎల్లంపల్లి, ఇందిరమ్మ వరద కాలువ, మిడ్‌మానేరు, కుమ్రంభీం, దేవాదుల, గౌరవెల్లి, డిండి (మొత్తం 14)ప్రాజెక్టులను ఫాస్ట్ ట్రాక్‌లో చేపట్టి పూర్తి చేస్తాం.

తప్పుడు పత్రం



(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారని తప్పుబట్టారు. మేడిగడ్డ విషయంలో తప్పు ఎవరు చేసినా తప్పేనని.. త్వరగా విచారణ చేసి బాధ్యులను శిక్షించాలని కోరారు. బ్యారేజీ కూలిపోవాలనే ఉద్దేశంతోనే మరమ్మతులు ఆలస్యం చేస్తున్నారనే సందేహం కలుగుతోందన్నారు. యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చేపట్టి.. వర్షా కాలం వచ్చేలోపు పూర్తిచేసి సేఫ్ జోన్‌కు తీసుకెళ్లాలని.. లేదంటే మొత్తం బ్యారేజీనే పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అసెంబ్లీలో నీటి పారుదల శాఖ శ్వేతపత్రంపై చర్చలో భాగంగా శనివారం పలు దఫాలుగా హరీశ్ మాట్లాడారు. ఈ తరహా (మేడిగడ్డ) ఘటన దేశంలో, రాష్ట్రంలో ఎప్పుడూ జరగలేదన్నట్లు చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కడెం, మూసీ, సింగూరు, తాలిపేరు, వరంగల్ పాలెం వాగు ప్రాజెక్టుల గేట్లు కొట్టుకుపోయిన సంగతిని గుర్తుచేశారు. పుట్టంగండిని ఉదయం సీఎం ప్రారంభిస్తే సాయంత్రానికి మొత్తం కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. దేవాదుల పైపులు పటాకుల్లా పేలిపోయాయని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పోలవరంలోనూ డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని వివరించారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు పంజాగుట్ట ఫ్లైఓవర్ కడుతుండగానే కూలిపోయిందని చెప్పుకొచ్చారు. దురదృష్టవశాత్తు కొన్ని సందర్భాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతుంటాయని వాటిపై విచారణ జరపాలని కోరారు. మిడ్‌మానేరు, ఎల్లంపల్లి ఉమ్మడి రాష్ట్రంలో పూర్తయినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని, ఇక సభలో అడుగుపెట్టనని సవాల్ చేశారు. సాగు నీటి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మూడు రోజులుగా సభకు రాకుంటే, శాఖపై సన్నద్ధమై వస్తారని.. తమ తప్పిదాలు ఎత్తి చూపిస్తారని అనుకుంటే అలాంటిదేం జరగలేదని విమర్శించారు.

అందుకే రీడిజైన్ చేశాం..

దేశంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ 2007-14 మధ్య ప్రాణహితకు ఒక్క అనుమతి కూడా తీసుకురాలేదని హరీశ్ తప్పుబట్టారు. రాష్ట్రం ఏర్పడిన 5 రోజుల్లోనే ప్రాణహితకు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాసినట్లు చెప్పారు. తెలంగాణ రాగానే తుమ్మిడిహెట్టి రీ డిజైన్ కోసం వేసిన కమిటీలో తుమ్మల నాగేశ్వర రావు, ఈటల రాజేందర్ ఉన్న సంగతిని గుర్తుచేశారు. ఉమ్మడి ఏపీలో అనుమతులు లేకుండానే పనులు చేపట్టడాన్ని తప్పుపడుతూ మహారాష్ట్ర సీఎం లేఖ రాశారా? లేదా? అని ప్రశ్నించారు. నీటి లభ్యత, రిజర్వాయర్ల సామర్థ్యంపై కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అభ్యంతరాలు తెలపడంతోనే రీ డిజైన్ చేశామన్నారు. శ్వేతపత్రంపై మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేవనెత్తే అనుమానాలను నివృత్తి చేసే సత్తా తనకుందని, రాత్రి 12 గంటల దాకా సభ పెట్టినా చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. దేశంలో ఏ ప్రాజెక్టును ప్రారంభించినా పూర్తి ఆయకట్టు అప్పటికప్పుడే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉండదని.. ఎస్ఆర్ఎస్పీలో 40 ఏళ్లు, సాగర్‌లో 12 ఏళ్లు, కల్వకుర్తిలో 30 ఏళ్లు పట్టిందని వివరించారు. కాళేశ్వరం కింద 98 వేల ఎకరాలకు, ఆ ప్రాజెక్టు నీటితో 400 చెరువులు నింపి 39 వేల ఎకరాలకు నీళ్లిచ్చామని హరీశ్ చెప్పారు.

నేను మాట్లాడుతుంటే చూపిస్తలేరంటా..

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై గద్దర్, అందెశ్రీ, జయరాజు పాడిన పాటలను తన ప్రసంగంలో హరీశ్ ఉటంకించారు. కాగా, "నేను మాట్లాడుతుంటే కెమెరా నన్ను చూపిస్తలేదంట. నా గొంతే వినబడుతుందంట. కెమెరా మా దిక్కు చూపించండి సార్.. కెమెరా కూడా తిప్పుడేనా? ఇందులోనూ వివక్షేనా? సీఎం, ఉత్తమన్న, లేదంటే స్పీకరే కనిపిస్తున్నారంటా. ఇప్పుడే చిట్టీ వచ్చింది" అని హరీశ్ అన్నారు. దీనికి అలాంటిదేమీ ఉండదని.. సీనియర్ సభ్యులై ఉండి ఇలా మాట్లాడడం సరైంది కాదని స్పీకర్ బదులిచ్చారు. కాగా, మంత్రి ఉత్తమ్ శ్వేతపత్రం చదువుతుండగా, పలుసార్లు హరీశ్ ఫాల్స్.. ఫాల్స్.. ఫాల్స్! అని హరీశ్ గట్టిగా అరిచారు. మరోవైపు కాంగ్రెస్ సభ్యులు, మంత్రులు తనను అడ్డుకునే యత్నం చేయగా రన్నింగ్ కామెంట్రీ లేకుండా చూడాలని స్పీకర్‌ను హరీశ్ కోరారు. 'మీరు ఆపేస్తే వాళ్లు ఆపుతారు. ఉత్తమ్ మాట్లాడుతుండగా మీరు రన్నింగ్ కామెంట్రీ చేయలేదా?' అని స్పీకర్ ప్రశ్నించారు.

కాగ్ నివేదికను కాంగ్రెస్ సీఎంలే కొట్టిపడేశారు..

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ నివేదికను పట్టించుకోవాల్సిన అవసరం లేదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు, వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంలుగా ఉన్న సమయంలో కాగ్ నివేదికను కొట్టిపడేశారని గుర్తుచేశారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు కాగ్ నివేదిక ఓ ఊహాగానంగా అభివర్ణించారని పేర్కొన్నారు. పనులు చేయకుండా, నాలుగు జిల్లాల్లో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టు దేశంలో ఏదైనా ఉంటే.. అది ప్రాణహిత మాత్రమేనని హరీశ్ ఎద్దేవా చేశారు. హెడ్‌వర్క్స్‌ను చేపట్టకుండా.. తోకలు(కెనాల్) చేశారని ఆక్షేపించారు. రూ.6,116 కోట్ల విలువైన పనులు జరిగితే మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద కాంట్రాక్టర్లు రూ.2,300 కోట్లు ఎత్తుకెళ్లారని ఆరోపించారు. కాగా, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పొలాలకు నీళ్లు వచ్చాయని, వ్యవసాయ పనుల కోసం ఇతర రాష్ట్రాల కూలీలు వచ్చారని అన్నారు.

ఏకపక్ష వివరాలతో తప్పుపట్టే యత్నం: పల్లా

కాళేశ్వరం సహా ప్రాజెక్టుల వ్యవహారాల్లో ప్రభుత్వం ఏకపక్ష వివరాలతో తమను తప్పుపట్టే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఐదేళ్లలో మౌలిక సౌకర్యాలను మెరుగుపర్చడంతోనే పంట ఉత్పత్తి పెరిగిందన్నారు. సభలో వివరణాత్మకంగా మాట్లాడే అవకాశం ఇచ్చి ఉంటే కాళేశ్వరంపై మెప్పించే ఒప్పించేవాళ్లమని తెలిపారు. ప్రతిపాదించిన 17 లక్షల ఎకరాల్లో 16 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగిందని వివరించారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రైతులకు అన్యాయం చేయొద్దని కోరారు.

చర్చను త్వరగా ముగించండి

కేసీఆర్ జన్మదిన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా సభలో సాగునీటి ప్రాజెక్టులపై చర్చను త్వరితగతిన ముగించాలంటూ శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. అయితే తమ పార్టీ ఎమ్మెల్యేలే 14 మంది మాట్లాడాల్సి ఉందని, సాయంత్రం ఆరు గంటల తర్వాతే చర్చ ముగుస్తుందని హరీశ్‌కు మంత్రి స్పష్టం చేశారు. శాసనసభలో శనివారం సాగునీటి ప్రాజెక్టుల చర్చ సందర్భంగా భోజన విరామ సమయంలో లాబీల్లోని మంత్రి శ్రీధర్ బాబు చాంబర్లో ఆయనతో హరీశ్‌రావు భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడిన శ్రీధర్‌బాబు ఈ మేరకు వివరాలు వెల్లడించారు.

కుర్చీ వేసుకొని పనులు చేయిస్తానని..
చక్రాల కుర్చీలో కూర్చున్నాడు

» కాళేశ్వరం వద్దని 2018లోనే మొత్తుకున్నా:రాజగోపాల్



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కుర్చీ వేసుకుని కూర్చుని నల్లగొండ జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తానని చెప్పిన కేసీఆర్.. కుర్చీ పోగొట్టుకుని, వీల్‌చైర్‌కు పరిమితం అయ్యాడని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎద్దేవా చేశారు. నీటిపారుదల ప్రాజెక్టులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం, భారీ నిధులతో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణాలు వద్దని 2018లో అసెంబ్లీలో తాను మొత్తుకున్నా.. కేసీఆర్ పట్టించుకోకుండా కమీషన్ల కోసమే వాటిని ప్రారంభించారని విమర్శించారు. ఆయన అవినీతిపై దర్యాప్తు జరుగుతుందని, చేసిన పాపాలకు శిక్ష అనుభవించాల్సిందేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం పేరుతో భారీ వడ్డీలకు అప్పులు తెచ్చి, రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన కేసీఆర్‌కు శిక్ష తప్పదని చెప్పారు. ఆయన్ను బ్రహ్మదేవుడూ కాపాడలేడని అన్నారు.

చలమల కృష్ణారెడ్డి చేరిక చెల్లదు

కాంగ్రెస్‌లో చలమల కృష్ణారెడ్డి చేరిక చెల్లబోదని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరేవరకు తనకూ తెలియదని చెప్పారు. దొంగచాటుగా వెళ్లి దీపాదాస్ మున్షీకి కూడా తెలియకుండా లైన్‌లో నిలబడి కండువా కప్పించుకున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ లాబీలో రాజగోపాల్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. గత ఎన్నికల్లో తనపై పోటీ చేసిన కృష్ణారెడ్డి.. తనకు తెలియకుండా కాంగ్రెస్‌లో ఎలా జాయిన్ అవుతారని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో సికిందరాబాద్, జహీరాబాద్, భువనగిరి సీట్లు బీసీలకు ఇచ్చి గెలిపిస్తామని ప్రకటించారు.

ఏటీఎంలుగా సాగునీటి ప్రాజెక్టులు: అక్బరుద్దీన్

సాగునీటి ప్రాజెక్టులు ప్రభుత్వాలకు ఏటీఎంలుగా మారాయని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. తెలంగాణలో గత పదేళ్లు, అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లలో పాలకులు వీటిని ఏటీఎంలుగా భావించారని విమర్శించారు. ప్రజల అవసరాలు తీర్చడం కోసం కాకుండా.. పాలకుల ధనదాహం తీర్చుకునేందుకే వీటిని నిర్మిస్తున్నట్టుగా అనిపిస్తోందన్నారు. ఇప్పటికే ప్రాజెక్టుల పేరిట రూ.లక్ష కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసినా.. ఆయకట్టు 27 శాతమే ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలంటే 1,75,143 కోట్లు అవసరమని.. ఇంకా అప్పులు చేసి, ప్రజలపై భారం వేసి పూర్తిచేసినా.. వాటితో కలిగే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. "నీటి ప్రవాహం సహజంగానే సాగుతుంది. దానికి విరుద్ధంగా కాళేశ్వరం వద్ద నుంచి నీటిని 500 మీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి 250 కి.మీ. ప్రవహింపజేస్తున్నారు. ఇంత చేసినా ఉపయోగంలోకి వచ్చిన ఆయకట్టు వివరాలు శ్వేతపత్రంలో చూసి ఆందోళన కలుగుతోంది. ఈ అంశాలపై రాజకీయ పార్టీలన్నీ సీరియస్‌గా చర్చించాలి." అని ఒవైసీ అన్నారు.

ఉద్యోగులకు జీతాలివ్వలేని దుస్థితి: కూనంనేని

తెలంగాణ అన్నింటిలో నంబర్ వన్ అని ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి చివరికి ఉద్యోగులకు సకాలంలో జీతాలివ్వలేని దుస్థితికి కారణమైందని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కాళేశ్వరం నిధుల దుర్వినియోగంపై కాగ్ ఇచ్చిన నివేదికను బీఆర్ఎస్ తప్పుబట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగపరమైన సంస్థను ఆటబొమ్మలా భావిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యేసరికి వ్యయం రూ.2 లక్షల కోట్లకు పెరిగినా ఆశ్చర్యం లేదన్నారు.

కాళేశ్వరం కళంకం!

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడారు. నిపుణులు ఏదైనా ఆలోచన చెబితే మార్పులు చేర్పులు చెప్పడం వేరని, కానీ, కేసీఆరే కొంతమంది అధికారుల్ని, విశ్రాంత ఇంజనీర్లని కూర్చోబెట్టి 'ఇదీ నా ఆలోచన, ఇలా ముందుకు వెళ్లాలనుకుంటున్నా, దీనిపై మీ అభిప్రాయాన్ని సాంకేతిక నిపుణులుగా పూర్తిగా పరిశీలించి అన్ని పరిగణనలోకి తీసుకుని నివేదిక ఇవ్వాలి' అని రూట్‌మ్యాప్ డిసైడ్ చేశారన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు కలిసి గోదావరి ప్రాజెక్టులపై విశ్రాంత ఇంజనీర్లతో కమిటీ వేశారని చెప్పారు. కమిటీలో బి.అనంత రాములు, వి.వెంకటరామారావు, ఎస్.చంద్రమౌళి, జి.దామోదర్‌రెడ్డి, ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారని, వారు బ్యారేజీల నిర్మాణంపై 14 పేజీల నివేదిక ఇచ్చారని వెల్లడించారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుల మీద తుమ్మిడిహెట్టి దగ్గర కాకుండా ఇతర ప్రాంతాల్లో నిర్మించడానికి అవసరమైన రీడిజైనింగ్‌కు కేసీఆర్ ఆదేశంతో పునాది పడిందన్నారు. నిపుణులు రియల్, ఫిజికల్, టోపోషీట్స్ సర్వే చేసి నివేదికలో చేర్చారని చెప్పారు. గోదావరి జలాలకు సంబంధించిన చరిత్రను, గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను కూడా ఇందులో పొందుపర్చారన్నారు. ప్రాజెక్టుల్లో జరిగిన వ్యవహారాలను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బరువెక్కిన హృదయంతో సభ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. జరిగిన తప్పులకు క్షమాపణలు కోరాల్సిన విపక్ష నేతలు మంత్రి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌నే తప్పుల తడక అంటూ దూషించి తమ తప్పులను కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నష్టం జరిగిందనే తెలంగాణ ప్రజలు నీళ్ల కోసం కొట్లాడారని రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఆ నీళ్ల కోసమే ప్రత్యేక రాష్ట్రం కోరారన్నారు. నాడు తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని రేవంత్ స్పష్టం చేశారు. పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామితోపాటు సభలో చాలా మంది తెలంగాణ ఎంపీలు పెప్పర్ స్ప్రే దాడికి ఎదురొడ్డి నిలబడి తెలంగాణ బిల్లును కాపాడుకున్నారని చెప్పారు. అదంతా పార్లమెంటు రికార్డుల్లో నమోదై ఉందన్నారు. అసలు బిల్లు పెట్టినపుడు కేసీఆర్ ఎక్కడున్నారని రేవంత్‌రెడ్డి నిలదీశారు.

కేసీఆర్‌కు ఏ దేవుడు చెప్పాడో!

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డంకులు తొలగించడానికి ఆనాటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కలిసి చర్చించి 2012లో బోర్డును కూడా ఏర్పాటు చేశారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. అనుబంధంగా స్టాండింగ్ కమిటీ, సమన్వయ కమిటీలను కూడా వేశారని ప్రస్తావించారు. తెలంగాణ వచ్చాక మహారాష్ట్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు సమావేశమైనపుడు తుమ్మిడి



హెట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ కట్టి ప్రాజెక్టు పూర్తి చేస్తే మహారాష్ట్రలో 1850 ఎకరాల పట్టా భూమి మాత్రమే మునుగుతుందని తేలిందన్నారు. ఇంజనీర్ల కమిటీ నివేదికలో కూడా ఈ విషయం ఉందని గుర్తు చేశారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే 1250 ఎకరాలు మాత్రమే మునుగుతుందని, గ్రామాలకు ఎలాంటి ముంపూ ఉండదని కూడా చెప్పారన్నారు. మేడిగడ్డ దగ్గర బ్యారేజీలు కట్టాలని పురుగు పుట్టిందే కేసీఆర్ బుర్రలోనని చెప్పారు. ఆయనకు ఏ దేవుడు ఏ రాత్రి కలలోకి వచ్చి మేడిగడ్డ వద్ద ప్రాజెక్టులు కట్టమని చెప్పారో తెలియదని, ఆయన ఆదేశాల మేరకే ఇంజనీర్లు నివేదికను ఇచ్చారని స్పష్టం చేశారు. మామ, అల్లుడు కలిసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని, ఇప్పటికైనా వారికి కనువిప్పు కలగాలని కోరుకుంటున్నానని చెప్పారు. స్వయంగా వారు నియమించిన ఇంజనీర్లే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణానికి అన్నిరకాల ప్రయత్నాలు చేయాలని సూచించినా ఆయన పట్టించుకోలేదన్నారు. 151 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మించేందుకు మహారాష్ట్ర సీఎంను ఒప్పించాలని కేసీఆర్‌కు నిపుణులు సూచించారని చెప్పారు. అందుకు ఒప్పుకోకపోతే 150 మీటర్లతో నిర్మించినా ఖర్చులు పెరగకుండా చూసుకోవచ్చని చెప్పారన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఇంజనీర్లే మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టడం వల్ల ఉపయోగం లేదని స్వయంగా కేసీఆర్‌కు నివేదిక ఇచ్చారని రేవంత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్, హరీశ్‌లు ఆ నివేదికను తొక్కిపెట్టి మసిపూసి మారేడుకాయ చేసి, మేడిగడ్డ వద్ద బ్యారేజీ కడితే మేలు జరుగుతుందని చెప్పి, 38,500 కోట్ల ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని అమాంతం లక్ష 47 వేల కోట్ల రూపాయలకు పెంచారని చెప్పారు. అంత ఖర్చు పెట్టినా తెలంగాణలో పచ్చని పంట పండి ఉంటే ఇవన్నీ చెప్పాల్సిన అవసరం లేదన్నారు. తెలంగాణ ఖజానాను కొల్లగొట్టి దోచుకోవాలి, దాచుకోవాలనే ఆలోచనతోనే కేసీఆర్, హరీశ్‌లు ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టారని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ సమాజానికి కళంకంగా మారిందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకుంటున్న నిర్ణయాలు తెలంగాణ సమాజానికి మేలు చేయడం లేదనే అభిప్రాయంతో ఎన్నో ఒడిదుడుకుల్ని ఎదుర్కొని తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని ముఖ్యమంత్రి అన్నారు. పదేళ్లలో తెలంగాణను కొల్లగొట్టారని, ఇందుకు హరీశ్‌రావే బాధ్యుడని రేవంత్ ఆరోపించారు. 2018 వరకు సాగునీటి మంత్రిగా ఉన్న హరీశ్‌ను కేసీఆర్ హఠాత్తుగా ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. తర్వాత కాలంలో పూర్తిగా కేసీఆరే సాగునీటి మంత్రిగా ఉన్నారని, ప్రాజెక్టుల పాపానికి వీళ్లిద్దరే బాధ్యులని చెప్పారు. ఇద్దరూ కలిసి తెలంగాణకు చెదలు పట్టించారన్నారు. చివరికి విజిలెన్స్, కాగ్ నివేదికలను కూడా తప్పనే స్థాయికి దిగజారారని వ్యాఖ్యానించారు. చివరికి కేసీఆర్ వేసిన కమిటీ నివేదికను కూడా తప్పంటారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జరిగిన తప్పులకు హరీశ్ క్షమాపణలు కోరాలన్నారు. సిట్టింగ్ జడ్జి లేదా విశ్రాంత జడ్జి విచారణకు వచ్చినప్పుడు ఎవరి ఒత్తిడి వల్ల ఇలాంటి తప్పిదాలకు సంతకం పెట్టారో వివరించాలని డిమాండ్ చేశారు.

సబితక్క ఎందుకు మాట్లాడరు?

హరీశ్ చెబుతున్నది తప్పని సబితక్క ఎందుకు చెప్పడం లేదని రేవంత్ ప్రశ్నించారు. కేసీఆర్ గోదావరి జలాలను మెదక్ వరకే పరిమితం చేసి రంగారెడ్డి జిల్లాను ఎండబెడితే గతంలో సబితక్క ధర్నా చేసిందని గుర్తు చేశారు. ఈ రోజు ఎదురుగా కూర్చొని హరీశ్ వచ్చి అబద్ధాలు మాట్లాడుతుంటే సొంత జిల్లా కోసం సబితక్క మాట్లాడకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ధర్నాలు, దీక్షలు చేసి, నాడు రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి, మెప్పించి శిలాఫలకాలు వేయించి వందల కోట్ల రూపాయల పనులు చేస్తే, ఆ పనుల్ని కేసీఆర్ సర్కారు అర్థంతరంగా వదిలేస్తే దీక్షలు, ధర్నాలు చేసిన సబితా ఇంద్రారెడ్డి ఈ రోజు మౌనంగా హరీశ్‌ను సమర్థించడం సరికాదన్నారు. తమ్ముళ్లు తప్పు చేస్తే చెప్పడం అక్క బాధ్యతని, హరీశ్ అబద్ధాలను సబిత ఖండించాలని కోరారు. కేసీఆర్ స్కూల్‌లో చేరడంతో సిలబస్ మారిందని, సబిత, కడియం శ్రీహరి లాంటి సీనియర్లే పైనుంచి వచ్చిన పాఠాలను అప్పజెబుతున్నారని రేవంత్ వ్యంగ్యంగా అన్నారు.

పోలవరానికి 2 లక్షల ఎకరాలిచ్చారు..
ప్రాణహితకు 3 వేల ఎకరాలు
తీసుకోలేకపోయారా?

» మీ నిర్వాకంతో శబరి నదిని కోల్పోయాం
» మేడిగడ్డ పిల్లర్లు నిట్టనిలువునా చీలాయి
» అన్నారం, సుందిళ్ల సురక్షితం కాదు: భట్టి
» మేడిగడ్డ బ్యారేజీని కూలగొట్టింది హరీశే
» ఆయన చెబితే వినాల్సి రావడం ఖర్మ: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
» స్మితా సబర్వాల్ లేఖ రాయలేదంటే రాజీనామా: జూపల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రెండు లక్షల ఎకరాలను ఇచ్చిన గత ప్రభుత్వం.. ప్రాణహిత కోసం 3 వేల ఎకరాలు ఎందుకు తీసుకోలేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే మేడిగడ్డ పిల్లర్లు నిట్టనిలువునా చీలాయని, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఏ మాత్రం సురక్షితం కాదని తేలిందన్నారు. నీటి పారుదల శాఖ శ్వేతపత్రంపై అసెంబ్లీలో శనివారం చర్చ సందర్భంగా భట్టి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రాణహితకు రూ.38 వేల కోట్లకు గాను రూ.10 వేల కోట్లు వెచ్చించామని, మిగతా మొత్తమూ ఖర్చు పెట్టి ఉంటే 16 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవని పేర్కొన్నారు. రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్‌కు రూ.1,420 కోట్లు వ్యయం చేస్తే 3.25 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవని, అన్ని ప్రాజెక్టులకు రూ.32,880 కోట్లు పెట్టి ఉంటే 31.30 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేదని గుర్తు చేశారు. రీ డిజైన్ పేరుతో రూ.లక్షల కోట్లు తిన్నారని కాగ్ నివేదిక చెప్పిందన్నారు. కమీషన్లు వస్తే చాలన్న బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుతో శబరి నదిని శాశ్వతంగా కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణహిత కింద రూ.1000 కోట్లు కరెంట్ బిల్లులకు సరిపోయేవని, కాళేశ్వరం కింద రూ.10 వేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కాళేశ్వరం నిర్మాణంలో పొరపాట్లు, అవినీతి జరిగాయని ఒప్పుకోవాలని బీఆర్ఎస్‌ను డిమాండ్ చేశారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌కు హరీశ్‌రావు పోస్ట్‌మన్ అని.. ఆయన చెబితే వినాల్సి రావడం తమ ఖర్మ అని వ్యాఖ్యానించారు. మేడిగడ్డను కూలగొట్టింది ఆయనే అని ఆక్షేపించారు. కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు అంగీకారం తెలుపుతూ.. కేసీఆర్ కార్యదర్శిగా పని చేసిన స్మితాసబర్వాల్ లేఖ రాయలేదని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. ఆరేళ్లపాటు ఏపీ 512 టీఎంసీల కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ సర్కారు అనుమతిచ్చిందని మండిపడ్డారు.

బదిలీల తర్వాతే కొత్త పోస్టింగుల భర్తీ!

» గురుకుల జేఏసీకి హామీనిచ్చిన కార్యదర్శి

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకులాల్లో పదోన్నతులు కల్పించి, బదిలీలు చేపట్టిన తరువాతే కొత్త నియామకాల్లో ఎంపికైన వారికి పోస్టింగులు ఇస్తామని ఎస్సీ, ఎస్టీ గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి గురుకుల జేఏసీకి హామీనిచ్చారు. సీఎం ఆదేశాల మేరకు పదోన్నతులకు, బదిలీలకు ఉన్న అన్ని అడ్డంకులను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె జేఏసీకి తెలిపారు. ఇటీవల ప్రభుత్వం గురుకులాల్లోని పలు పోస్టుల భర్తీకి అవసరమైన సిబ్బందిని నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందించింది. అయితే ఆ నియామక పత్రాల్లో వారు పనిచేయాల్సిన ప్రదేశాల వివరాలు పొందుపర్చలేదు. కనుక వారు పనిచేయాల్సిన ప్రదేశాన్ని నిర్దేశిస్తూ ఉత్తర్వులు ఇవ్వడానికి ముందే గురుకులాల్లో పదోన్నతులు కల్పించి, బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని శనివారం గురుకుల జేఏసీ నాయకులు సెక్రటరీతో భేటీ అయ్యారు. ఈ పనులు పూర్తి చేయకుండా కొత్త నియామకాలు చేపట్టడం వలన కలిగే ఇబ్బందులు, నష్టాలకు సంబంధించిన అంశాలను ఆమెకు వివరించారు.

ఎంపీ సంతోష్‌కుమార్ తండ్రిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 17: సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేశారనే ఫిర్యాదుపై రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ తండ్రి రవీందర్‌రావుతోపాటు మరో నలుగురిపై కేసు నమోదు అయింది. భూకబ్జాకు, బెదిరింపులకు పాల్పడినట్లు ఒక యూట్యూబ్ చానల్ ద్వారా సామాజిక మాధ్యమాల్లో తనపై ప్రచారం చేశారని కరీంనగర్ రాంనగర్‌లో నివాసం ఉంటున్న కూస రవీందర్ ఫిర్యాదు చేశారని కరీంనగర్ రెండో టౌన్ సీఐ వెంకటేష్ తెలిపారు. దీనిపై విచారణ జరిపి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన జోగినిపల్లి రవీందర్‌రావు, గూడ బాలకృష్ణ, ఆవుల నాగరాజు, సంపత్, యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు చిలుక ప్రవీణ్‌లపై కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు.

ఈడీ అటాచ్‌మెంట్‌లోని ఆస్తుల ఆక్రమణ

» హీరా గ్రూప్ వ్యవస్థాపకురాలు, సీఈవో నౌహీరా షేక్‌పై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అటాచ్‌మెంట్‌లో ఉన్న ఆస్తులను ఆక్రమించుకోవడంతో పాటు వాటిలోని ఈడీ బోర్డులు తొలగించినందుకు హీరా గ్రూప్ వ్యవస్థాపకురాలు, సీఈవో నౌహీరా షేక్‌పై కేసు నమోదయింది. షేక్‌పేటలోని సర్వే నెంబరు 41, 174, 177, 178, 179, 180/1, 181, 182, 211 లో ఉన్న కంపెనీ ఆస్తులను 2020 ఫిబ్రవరి 4న ఈడీ అటాచ్ చేసింది. ఆయా స్థలాల్లో ఈడీ పేరిట బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఈ ఏడాది జనవరి 30న ఈడీ అధికారులు ఆ స్థలాలను తనిఖీ చేసి, అక్కడ ప్రహరీ నిర్మాణాలు చేపడుతున్నట్లు గమనించారు. రెండు రోజుల క్రితం ఉన్నతాధికారులు ఆ స్థలాలను పరిశీలించగా అప్పటికే ఈడీ బోర్డులను తొలగించి హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ బోర్డులు పెట్టి ఉన్నాయి. ఈడీ ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ గూటికి మార్క్‌ఫెడ్ ఛైర్మన్ గంగారెడ్డి

నిజామాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్, బీఆర్ఎస్ నేత మార గంగారెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో త్వరలోనే ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్‌కు చెందిన గంగారెడ్డి బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ రెడ్డిలతో చర్చించిన ఆయన జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ద్వారా కాంగ్రెస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గంగారెడ్డి.. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్‌లోనే ఉంటూ మాజీ సీఎం కేసీఆర్‌తో సన్నిహితంగా మెలిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్ష పదవి బాధ్యతల నుంచి తప్పించకపోడంతో కొంత అసంతృప్తితో ఉన్నారు.

గ్రూప్-4లో తక్కువ మార్కులొచ్చాయని ఆత్మహత్య


శిరీష (ఫైల్)

దంతాలపల్లి, ఫిబ్రవరి 17: గ్రూప్-4 పరీక్ష ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారానికి చెందిన గాదరబోయిన బక్కయ్య, బుచ్చమ్మ దంపతులకు కుమార్తె గాదరి శిరీష (24)తో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతులు వ్యవసాయ కూలీ పని చేసుకుంటూ తమ పిల్లలను చదివిస్తున్నారు. పీజీ పూర్తి చేసిన శిరీష ఏడాది క్రితం ఉద్యోగ పోటీ పరీక్షల శిక్షణ కోసం హైదరాబాద్ వెళ్లింది. జవహర్‌నగర్‌లోని ఓ వసతి గృహంలో ఉంటూ పరీక్షలకు సిద్ధమవుతోంది. అయితే ఇటీవల వెలువడిన గ్రూప్-4 ఫలితాల్లో మార్కులు తక్కువగా రావడంతో శుక్రవారం రాత్రి ఆమె హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయిందా?

» అసెంబ్లీలో అబద్ధాలు చెప్పిన హరీశ్, కేటీఆర్

» మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపిన అఖిలపక్ష నేతలు

అక్కన్నపేట, ఫిబ్రవరి 17: గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయకముందే తామే పూర్తిచేశామని శాసనసభలో అబద్ధాలు మాట్లాడిన మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దమ్ముంటే ప్రాజెక్టు వద్ద వచ్చి నిరూపించాలని అఖిలపక్షం, రైతు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద పూర్తికాని కాలువలను పరిశీలించి నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏడేళ్ల క్రితం ప్రారంభించిన రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులను పూర్తి చేశారని.. గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని టీఆర్ఎస్ నేతలను నిలదీశారు.

వచ్చేసారి తెలంగాణలో అధికారం మాదే: నడ్డా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తమ బలం పెంచుకుంటామని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా గెలిచి తీరుతామని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ సమావేశాల సందర్భంగా ప్రారంభ ఉపన్యాసంలో ఆయన తెలంగాణ గురించి ప్రస్తావించారు. తెలంగాణలో 7 శాతంగా ఉన్న తమ ఓటు బ్యాంకు 14 శాతానికి పెరిగిందని అన్నారు. గతంలో ఒక ఎమ్మెల్యే ఉంటే ఇప్పుడు 8 మంది ఎన్నికయ్యారని నడ్డా తెలిపారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని బీజేపీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి అన్నారు. ఇతర పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందని కొంత మంది జోకర్లు చెప్పే మాటలను పట్టించుకోవాల్సిన పనిలేదని అన్నారు. తెలంగాణలో జనసేనతోనూ పొత్తు ఉండదని చెప్పారు.

బీజేపీ రథయాత్రలకు ముగ్గురు సీఎంలు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ ఈ నెల 20 నుంచి ప్రారంభించనున్న రథయాత్రల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ముగ్గురు ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. వారు ఎవరన్నది నేడో, రేపో స్పష్టత రానుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా 5 పార్లమెంటు క్లస్టర్లలో ఒకేసారి ఈ విజయ సంకల్ప యాత్ర(రథయాత్ర)లు ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు మరో కేంద్ర మంత్రి ఈ యాత్రల ప్రారంభోత్సవాలకు హాజరుకానున్నారు. ఈ యాత్రలు వచ్చే నెల 4 వరకు కొనసాగుతాయని బీజేపీ వర్గాలు తెలిపాయి.

లేఅవుట్ పనులు నిలిపివేత

కొత్త లేఅవుట్ రద్దుకు నోటీసులు.. హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల విచారణ

» కుంట్లూర్ చిన్న చెరువు శిఖం పరిశీలన

» రికార్డులకెక్కని రిజిస్టర్డ్ భూములపై ఆరా

» చర్చనీయాంశంగా ధరణి గోల్‌మాల్


కుంట్లూర్ చిన్న చెరువు శిఖం భూమిలోని డబుల్ లేఅవుట్

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌కు సమీపంలోని కుంట్లూర్‌లో ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని డబుల్ రిజిస్ట్రేషన్లతో ఆగమేఘాల మీద ఏర్పాటు చేస్తున్న కొత్త లేఅవుట్ అభివృద్ధి పనులను రెవెన్యూ అధికారులు నిలిపేశారు. ఏసీబీ దాడుల్లో వందల కోట్ల ఆస్తులతో పట్టుబడిన శివబాలకృష్ణ గత ఏడాది హెచ్ఎండీఏ నుంచి బదిలీ అయిన సమయంలోనే కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఈ లేఅవుట్ ముసాయిదాకు అనుమతించిన విషయమై హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు ఆరా తీశారు. వెంటనే విచారణ జరిపి సంబంధిత డెవలపర్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. ధరణి లోపాలు సామాన్యుడి గొంతు కోస్తున్నాయని, దశాబ్దాల పాటు రిజిస్టేషన్ కార్యాలయాల్లో జరిగిన ప్లాట్ల రిజిస్టేషన్లను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం రెవెన్యూ రికార్డుల ఆధారంగా ధరణి పోర్టల్ అప్‌డేట్ చేయడంతో చాలామంది ఇళ్ల ప్లాట్ల యజమానులు అన్యాయమైపోతున్నారని 'ధరణితో గోల్‌మాల్' శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. 40 ఏళ్ల క్రితం లేఅవుట్ చేసి విక్రయించిన ప్లాట్లను ధరణి పోర్టల్‌ను అడ్డుగా పెట్టుకొని తిరిగి భూ యజమాని కబ్జా చేయడం, మరో మాజీ ఎమ్మెల్యే కొనుగోలు చేయడం, ఆ వెంటనే హెచ్ఎండీఏ అనుమతులిచ్చిన అంశాలన్నీ రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాలతో శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ ఆర్ఐ నిజాముద్దీన్ కుంట్లూర్‌లోని చిన్న చెరువు శిఖం పట్టా, చెరువు శిఖం భూములను పరిశీలించారు. లేఅవుట్ పనులను నిలిపివేయించారు. శిఖం పట్టా, చెరువు శిఖం భూముల రికార్డులను పరిశీలించారు. అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి నివేదికను అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. ధరణి పోర్టల్ ఆధారంగా జరిగిన రిజిస్ట్రేషన్లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కుంట్లూర్, పసుమాముల, తట్టిఅన్నారం, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారంలో, పెద్దఅంబర్‌పేట్, పిగ్లీపూర్ తదితర గ్రామాల్లో పెద్ద సంఖ్యలో డబుల్ లేఅవుట్లు అయ్యాయి. వాటన్నింటిపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పాత లేఅవుట్‌లోనే కొత్తగా 8.05 ఎకరాల్లో డ్రాఫ్ట్ లేఅవుట్ అనుమతులు నెల రోజుల్లోనే పొందడం హెచ్ఎండీఏ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వివాదస్పదమైన భూమిలో లేఅవుట్ అనుమతులు ఎలా వచ్చాయనే దానిపై ప్రభుత్వం సీరియస్ అయినట్లు సమాచారం. హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు సంబంధిత ఫైల్‌ను, పొందుపరిచిన పత్రాలను తెప్పించుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేశారు. డెవలపర్‌కు డ్రాఫ్ట్ లేఅవుట్‌ను రద్దు చేయడానికి షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు తెలిపింది. గతంలో ప్లాట్లుగా రిజిస్ట్రేషన్లు జరిగిన తర్వాత పార్ట్ బీ ఏవిధంగా అనుమతులిచ్చారని ఈ సందర్భంగా సంబంధిత తహశీల్దార్‌ను ప్రశ్నించిన్నట్లు తెలిసింది. హెచ్ఎండీఏ డైరెక్టర్ హోదాలో ఉన్న శివబాలకృష్ణ బదిలీ జరిగిన రోజు అనుమతులు ఇవ్వడం కోసం కింది స్థాయి అధికారులు ఆగమేఘాల మీద ఫైల్‌ను పంపినట్లు గుర్తించారు. షోకాజ్ నోటీసు అనంతరం డ్రాఫ్ట్ లేఅవుట్‌ను రద్దు చేస్తామని 'ఆంధ్రజ్యోతి'కి హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు తెలిపారు.

తప్పుడు రికార్డులతో రిజిస్ట్రేషన్‌కు వస్తే క్రిమినల్ చర్యలు

గతంలో లేఅవుట్ అయి భూ రికార్డులో తొలగించని భూములకు ధరణిలో రిజిస్టేషన్లు చేసేది లేదని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు తెలిపారు. తప్పుడు రికార్డులతో పట్టాదారు పాసు పుస్తకాలు, ధరణి రిజిస్టేషన్‌లు చేయించుకోవాలనుకునే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ధరణి రిజిస్ట్రేషన్లు చేస్తామమని స్పష్టం చేశారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్‌ది విష ప్రచారం

» వాస్తవాలు ఇవిగో అంటూ బీఆర్ఎస్ ఫాక్ట్‌షీట్ విడుదల

» కాళేశ్వరం సమగ్ర స్వరూపం, రీఇంజనీరింగ్ కారణాలు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేసిన నేపథ్యంలో తమపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని బీఆర్ఎస్ మండిపడింది. వాస్తవాలు ఇవిగో అంటూ ఆ పార్టీ శనివారం ఫాక్ట్ షీట్ విడుదల చేసింది. కాళేశ్వరం సమగ్ర స్వరూపానికి సంబంధించిన వివరాలు వెల్లడించింది. రీఇంజనీరింగ్‌కు కారణాలను వివరించింది. మేడిగడ్డ వద్ద బ్యారేజ్ నిర్మాణం, మేడిగడ్డ, ఎల్లంపల్లి మధ్య మరో రెండు బ్యారేజీలు.. అన్నారం, సుందిళ్ల నిర్వహణ, కెనాళ్లు, టన్నెళ్లు, లిఫ్ట్ సిస్టమ్, రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ ద్వారా గతంలో ప్రతిపాదించిన 16.40 లక్షల ఎకరాలకు బదులుగా 19.63 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేలా మార్పు చేసినట్లు అందులో తెలిపారు. పలు కొత్త ప్రతిపాదనల కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగిందని, దేనికోసం ఎంతమేర అంచనా వ్యయం పెరిగిందన్న దానికి సంబంధించిన వివరాలను ఫాక్ట్ షీట్‌లో పేర్కొన్నారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అవసరాలకు తగినంత నీటి లభ్యత తుమ్మిడిహెట్టి వద్దలేని కారణంగా భవిష్యత్తులో సమస్యలు ఎదురుకాకూడదని.. నీటి లభ్యతపై సమీక్ష జరపాలని కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) రాసిన లేఖ, ప్రాజెక్టు అవసరాలకు తగినంతగా జలాశయాల సామర్థ్యాన్ని పెంచుకోవాలని, కొత్త జలాశయాలు నిర్మించుకోవాలని సీడబ్ల్యూసీ చేసిన సూచనల కాపీని అందులో పొందుపర్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుకు లభించిన అనుమతులు, కాళేశ్వరం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,33,572 ఎకరాలకు సాగునీరు అందించినట్లు వివరించారు. కాళేశ్వరం పరిధిలోని వివిధ ప్రాజెక్టులు, పంపు హౌస్‌లు, టన్నెళ్ల ఇతరాలకు సంబంధించిన వివరాలు, ఫొటోలను అందులో పొందుపర్చారు.

8 రోజులు.. 45.32 గంటలు!

» బడ్జెట్ సమావేశాలు జరిగిన తీరిది

» 2 తీర్మానాలు, 3 బిల్లులకు ఆమోదం

» ఇరిగేషన్‌పై శ్వేతపత్రం అంశమ్మీద చర్చ

» సభా నాయకుడి కన్నా మజ్లిస్ సభాపక్ష నేత తీసుకున్న సమయమే ఎక్కువ

» సభను ఫుల్‌గా వాడేసుకున్న కూనంనేని

» సభ నిరవధిక వాయిదా



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శాసన సభ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. సభను శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నిరవధికంగా వాయిదా వేశారు. ఈ నెల 8న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు.. సెలవు దినాలు మినహా శనివారం నాటికి ఎనిమిది రోజులు కొనసాగాయి. సభ మొత్తం 45.32 గంటల పాటు నడిచింది. వివిధ పార్టీలకు చెందిన 59 మంది సభ్యులు వివిధ అంశాలపై ప్రసంగాలు చేయగా.. 64 మంది సభ్యులు జీరో అవర్‌లో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణ అప్పగించేది లేదంటూ తీర్మానం.. కులగణన సర్వే తీర్మానం పైన చర్చించిన సభ.. వాటిని ఆమోదించింది. బడ్జెట్ అప్రాప్రియేషన్ సహా 3 బిల్లులు ఆమోదం పొందాయి. మొత్తం ఎనిమిది రోజుల సభలో సీఎం, మంత్రులు కలిసి 15.56 గంటల సమయం తీసుకున్నారు. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి.. 3.10 గంటల పాటు మాట్లాడారు. అత్యధికంగా మజ్లిస్ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ 4:56 గంటల పాటు ప్రసంగించారు. సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు 2:55 గంటల పాటు, బీజేపీ సభ్యులు 3:48 గంటల పాటు మాట్లాడారు. కాంగ్రెస్ సభ్యులు 8:43 గంటలు, బీఆర్ఎస్ సభ్యులు 8:41 గంటల సమయాన్ని వినియోగించుకున్నారు.

గత ప్రభుత్వం చేసిన నష్టాలను వివరించాం: శ్రీధర్‌బాబు

గత సర్కారు సాగునీటి ప్రాజెక్టులు సహా తెలంగాణ ప్రజలకు చేసిన నష్టాన్ని సభ ద్వారా వివరించామని, వీటికి సంబంధించి తమ ప్రభుత్వం ఏం చేయబోతోందో తెలియజేశామని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి ఎలా ఉందో తెలియజేయడానికే శ్వేతపత్రాలను విడుదల చేసినట్లు చెప్పారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒక స్థానం గెలిస్తే ఎక్కువేనన్నారు. తాము డబుల్ డిజిట్ సీట్లను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అవినీతి ఏ స్థాయిలో ఉందో కాగ్ నివేదిక చూస్తేనే తెలుస్తుందన్నారు. నిపుణుల సూచన తర్వాతే మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల మరమ్మతులు చేపడతామని చెప్పారు.

దంపతులను చిదిమేసిన క్రెడిట్ కార్డు!

» వాయిదాలు కట్టకపోవడంతో వడ్డీతో కలిపి రూ.8లక్షలు

» విషం తాగి భార్య.. ఉరేసుకొని భర్త ఆత్మహత్య

» అనాథలుగా ఇద్దరు చిన్నారులు..


రాగుల సురేశ్, భాగ్యలక్ష్మి (ఫైల్)

కీసర రూరల్, ఫిబ్రవరి 17: ఒక వ్యాపారం నుంచి మరో వ్యాపారానికి మారినా రెండింట్లోనూ అతడికి నష్టాలే ఎదురయ్యాయి! తప్పనిసరి పరిస్థితిలో ఓ చిన్న ఉద్యోగంలో చేరి భార్య, ఇద్దరు కుమారులను పోషించుకుంటున్నాడు. అయితే.. వ్యాపారాల కోసం మునుపు క్రెడిట్ కార్డు మీద తీసుకున్న మొత్తం, బ్యాంకు రుణం కట్టకపోవడంతో ఆ అప్పు.. వడ్డీతో కలిపి లక్షల్లో పేరుకుపోయింది. నెలవారీ ఖర్చులకే సరిపోయే జీతంతో అంత అప్పు ఎలా తీర్చగలం అన్న మనోవేదనకు గురై భార్యతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫలితంగా వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. మృతులు హైదరాబాద్ లాలాపేట్‌కు చెందిన రాగుల సురేశ్ (46), భాగ్యలక్ష్మి (44) దంపతులు. మేడ్చల్ జిల్లా కీసరలో ఈ ఘటన జరిగింది. సీఐ వెంకటయ్య, స్థానికుల కథనం ప్రకారం సురేశ్, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు.. సురేశ్ నాలుగేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కీసరకొచ్చాడు. అక్కడే మొబైల్ దుకాణం నిర్వహించగా నష్టమొచ్చింది. ఆ తర్వాత కీసర మండల పరిధి తిమ్మాయిపల్లిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నడిపాడు. అందులోనూ నష్టం రావడంతో చెర్లపల్లిలోని ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిలోకి చేరాడు. అంతకు ముందు వ్యాపార నిమిత్తం సురేశ్ క్రెడిట్ కార్డు ద్వారా కొంత, ఇంతర బ్యాంకుల్లో రుణాలు తీసుకోగా అది వడ్డీతో కలిపి రూ.8 లక్షలైంది. క్రెడిట్ కార్డు నిర్వాహకులు కీసరలోని ఇంటి వద్దకొచ్చి అప్పు తీర్చాలంటూ సురేశ్‌పై ఒత్తిడి తెచ్చారు. బంధువుల ఇంట్లో ఫంక్షన్ ఉండటంతో కుటుంబంతో కలిసి సురేశ్ శుక్రవారం నాగారం మునిసిపాలిటీ రాంపల్లి ఆర్ఎల్‌నగర్‌లోని తన అత్తగారింటికి వెళ్లాడు. ఫంక్షన్‌కు తాము తర్వాత వస్తామని చెప్పి అత్తను, తన కుమారులను అక్కడి నుంచి పంపించేసి.. సురేశ్, భాగ్యలక్ష్మి ఇంట్లోనే ఉండిపోయారు. ఇద్దరూ ఆదే రోజు రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఫంక్షన్‌కు వెళ్లిన అత్త, కుమారులు శనివారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉండటం.. ఎంత పిలిచినా పలకపోవటంతో, తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లారు. బెడ్‌రూంలో పురుగుల మందు తాగి భాగ్యలక్ష్మి, మరో గదిలో ఉరేసుకున్న స్థితిలో సురేశ్ విగతజీవులుగా కనిపించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని, చెల్లించలేని పరిస్థితి నెలకొందని.. ఫలితంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వరంగల్ మంత్రి పీఏపై వేటు!


» ఇటీవల భద్రాచలం వద్ద లారీల పట్టివేత

» వాటిని వదిలేయాలని అధికారులకు ఫోన్లు

» దీనిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

» మరో మంత్రి అనుచరుడిపైనా ఆరోపణలు

» రంగంలోకి ఇంటెలిజెన్స్.. సీఎంకు నివేదిక



హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా నిరోధం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా వ్యవహరిస్తోంది. ఏ మాత్రం నిర్లక్ష్యానికి తావు లేకుండా చూస్తోంది. అక్రమ రవాణానే కాదు.. దానికి మద్దతుగా నిలిచే వారినీ ఉపేక్షించిందేది లేదంటోంది. ఈ క్రమంలో ఇటీవల భద్రాచలం వద్ద పట్టుకున్న 17 లారీలను వదిలేయాలంటూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి పీఏ, ఖమ్మం జిల్లా మంత్రి అనుచరుడు ఒకరు అధికారులకు ఫోన్లు చేసినట్లు తెలియగా.. తీవ్రంగా పరిగణించింది. వరంగల్ జిల్లా మంత్రి పీఏను సస్పెండ్ చేసినట్లు సమాచారం. అంతేగాక, ఇంటెలిజెన్స్‌ను కూడ రంగంలోకి దింపినట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ అధికారులు మొత్తం వ్యవహారానికి సంబంధించిన అన్ని కోణాల్లో వివరాలు సేకరించారు. లారీలను పట్టుకునేందుకు వెళ్లిన మైనింగ్ అధికారులు, పోలీసుల వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు చెబుతున్నారు. వీరితో పాటు ఖమ్మం జిల్లా మంత్రి అనుచరుడి స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సమాచారం. ఈ వివరాలన్నింటిని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. వరంగల్ మంత్రి పీఏపై వేటు పడగా.. ఖమ్మం జిల్లా మంత్రి అనుచరుడి విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

కొత్త విధానంపై సీఎం దృష్టి

రాష్ట్రంలో ఇసుక అమ్మకాలకు సంబంధించి కొత్త విధానం తీసుకొస్తామని ఇటీవల అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్ ప్రకటించారు. అక్రమ రవాణాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత విధానం అవినీతికి కేంద్రంగా మారిందని, అన్ని స్థాయుల్లోనూ అక్రమాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంతో పాటు, ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త విధానం రూపొందించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తూ జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఎంబీఏ

ఐఐటీ జోధ్‌పూర్‌లో..

జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజే)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఎస్ఎంఈ)- 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌ని రెండు మోడ్‌లలో నిర్వహిస్తున్నారు. మొదటి మోడ్ ప్రకారం- ప్రోగ్రామ్ మొదటి ఏడాది కోర్సుని ఐఐటీజేలోను, రెండో ఏడాది కోర్సును యూఎస్‌ఏలోని ఎస్‌యూఎన్‌వై అల్బేనీలో చదువుకోవచ్చు. అల్బేనీ విద్యార్థులకు 5000 డాలర్ల స్కాలర్‌షిప్, మూడేళ్ల ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు అనుమతిస్తూ ఎఫ్-1 స్టూడెంట్ వీసా, అల్బేనీ అసిస్టెంట్‌షిప్ అందిస్తారు. ఈ మోడ్‌లో చదివిన వారికి ఐఐటీజే నుంచి 'ఎంబీఏ ఇన్ ఫిన్‌టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ' డిగ్రీ, ఎస్‌యూఎన్‌వై అల్బేనీ నుంచి 'ఎంఎస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్' డిగ్రీ లభిస్తాయి. రెండో మోడ్ ప్రకారం ప్రోగ్రామ్ రెండేళ్లూ ఐఐటీజేలోనే చదువుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్/ఎంటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. క్యాట్ 2023/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఎంటెక్ అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ అభ్యర్థులకు జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. అభ్యర్థులందరికీ దరఖాస్తు నాటికి ఐటీ/బ్యాంకింగ్/ఫైనాన్షియల్ సర్వీసెస్/ఇన్సూరెన్స్/సైబర్‌సెక్యూరిటీ తదితర విభాగాల్లో కనీసం రెండేళ్ల ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. ఇంటర్న్‌షిప్‌లు; కోచింగ్ సెంటర్లు, స్మాల్ స్కేల్ బిజినెస్ సంస్థలు, రిటైల్ స్టోర్స్, కిరాణా స్టోర్స్, ఎన్‌జీఓ సంస్థలు, పెట్రోల్ పంప్ సంస్థలు, గ్యాస్ స్టేషన్‌లలో పనిచేయడాన్ని అనుభవం కింద పరిగణించరు.

ఎంపిక: క్యాట్ 2023/గేట్/జీఆర్ఈ/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. జాతీయ పరీక్ష స్కోర్/అకడమిక్ మెరిట్, ఇంటర్వ్యూ స్కోర్, అనుభవం, జెండర్ డైవర్సిటీ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** iitj.ac.in



ఐఐటీ మండీలో..

మండీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)కి చెందిన స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎస్ఓఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 80 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: రెండు కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. మొదటి కేటగిరీ అడ్మిషన్స్‌కు సీఎఫ్‌టీఐ గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 65 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 60 శాతం మార్కులు ఉండాలి. వీరికి క్యాట్ వ్యాలిడ్ స్కోర్ అవసరం లేదు. రెండో కేటగిరీ అడ్మిషన్స్‌కు ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. అభ్యర్థులందరికీ క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. రెండు కేటగిరీలకు చెందిన అభ్యర్థులూ ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్స్ అండ్ మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారికి మొదటి కేటగిరీ కింద ప్రవేశాలు కల్పిస్తారు. ఎన్ఆర్ఐ, విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ 2023 స్కోర్ ఉండాలి.

ఎంపిక: మొదటి కేటగిరీ అభ్యర్థులను అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా; రెండో కేటగిరీ అభ్యర్థులను క్యాట్ 2023 స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. తరవాత సెలెక్షన్ కమిటీ నిర్ణయం ప్రకారం ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2400; దివ్యాంగులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200; సార్క్ దేశస్థులకు 100 యూఎస్‌డీలు; నాన్ సార్క్ దేశస్థులకు 200 యూఎస్‌డీలు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 26
- **పర్సనల్ ఇంటర్వ్యూ సెంటర్లు:** ఢిల్లీ, బెంగళూరు, ముంబై, హైదరాబాద్, కోల్‌కతా
- **వెబ్‌సైట్:** iitmandi.ac.in

Indian Institute of Technology Mandi

ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాషన్ అండ్ డిజైన్

ఆర్మీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ(ఏడబ్ల్యూఈఎస్) బెంగళూరులో నిర్వహిస్తున్న ఆర్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ డిజైన్(ఏఐఎఫ్‌డీ)- బీఎస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫ్యాషన్ అండ్ అప్పారెల్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ అండ్ డెకరేషన్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌ని ఆర్మీ విభాగాలకు చెందిన ఉద్యోగులు/విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేకించారు. రిటెన్ అడ్మిషన్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా హాస్టల్స్ ఉన్నాయి.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల్లో ఒకరికి ఆర్మీ ఉద్యోగిగా కనీసం పదేళ్ల సర్వీస్ ఉండాలి. పరమ్ వీర్ చక్ర, అశోక్ చక్ర, శౌర్య చక్ర తదితర అవార్డులు; సేవా మెడల్స్ సాధించిన వారి పిల్లలకు నిర్దేశిత వెయిటేజీ ఇస్తారు.

రిటెన్ అడ్మిషన్ టెస్ట్: దీనిని మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ టెస్ట్, జనరల్ అవేర్‌నెస్ టెస్ట్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ కాంపిటెన్సీ అండ్ కాంప్రహెన్షన్ టెస్ట్ ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మార్చి 31
- **రిటెన్ అడ్మిషన్ టెస్ట్:** ఏప్రిల్ 14
- **ఫలితాల విడుదల:** ఏప్రిల్ 30
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 21
- **తరగతులు ప్రారంభం:** జూలై మూడో వారం నుంచి
- **వెబ్‌సైట్:** aifd.edu.in

ఐఐపీలో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ (సీపీఈ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుకు ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ (ఏపీఎఫ్) సహకారం అందిస్తోంది. ఇందులో ప్రధానాంశం 'ప్యాకేజింగ్'. ఇంజనీర్లకు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌ను జూలై నుంచి అక్టోబరు వరకు, రెండో సెమిస్టర్‌ను నవంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు, మూడో సెమిస్టర్‌ను వచ్చే ఏడాది మార్చి నుంచి జూన్ వరకు నిర్వహిస్తారు. సాయంత్రం వేళల్లో, వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. మొదటి రెండు సెమిస్టర్లలో కాంటాక్ట్ క్లాసెస్ ఉంటాయి. ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం ల్యాబొరేటరీ డెమాన్‌స్ట్రేషన్స్ నిర్వహిస్తారు. వీటికోసం అభ్యర్థులు చెన్నై సెంటర్‌లో హాజరు కావాల్సి ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ విజిట్స్, ఇండస్ట్రియల్ విజిట్స్, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. చివరి సెమిస్టర్‌లో నాలుగు నెలలపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటుంది. ప్రతి సెమిస్టర్ చివరలో ఫైనల్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం, మొత్తమ్మీద 50 శాతం మార్కులు ఉంటేనే సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి ఆటోమొబైల్ సంస్థలు, టెక్స్‌టైల్ హబ్‌లు, ఫైర్ వర్క్స్ ఇండస్ట్రీలు, ఎఫ్ఎంసీజీ మాన్యుఫాక్చరింగ్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రింటింగ్ టెక్నాలజీ/ప్యాకేజింగ్ టెక్నాలజీ/పాలిమర్ ఇంజనీరింగ్/పాలిమర్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/బయో టెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ టెక్నాలజీ/పేపర్ ఇంజనీరింగ్/పేపర్ టెక్నాలజీ/ప్లాస్టిక్స్ టెక్నాలజీ/ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఇతర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ప్యాకేజింగ్‌పై ఆసక్తి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.83,190
- **అడ్మిషన్ సమయంలో చెల్లించాల్సిన సెమిస్టర్ ఫీజు:** రూ.35,990
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500+18% జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 5 నుంచి
- **కాంటాక్ట్ క్లాసెస్ సెంటర్లు:** ముంబై, చెన్నై, ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్
- **చిరునామా:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్, ప్లాట్ నెం 169, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సెకండ్ మెయిన్ రోడ్, పెరుంగుడి, చెన్నై- 600096
- **వెబ్‌సైట్:** www.iip-in.com



జాబ్ కార్నర్

ఏఆర్‌వో విశాఖపట్నం పరిధిలో అగ్నివీరులు

విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్.. అగ్నిపథ్ పథకం కింద 2024-25 సంవత్సరం నియామకాలకు సంబంధించి అగ్నివీరుల ఎంపిక కోసం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఈ నియామకాలకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులు.

కేటగిరీలు:

1. అగ్నివీర్ జనరల్ డ్యూటీ(ఆల్ ఆర్మ్స్)
2. అగ్నివీర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
3. అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్(ఆల్ ఆర్మ్స్)
4. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(టెన్త్ పాస్)(ఆల్ ఆర్మ్స్)
5. అగ్నివీర్ ట్రేడ్స్‌మన్(8వ తరగతి ఉత్తీర్ణత)(ఆల్ ఆర్మ్స్)

వయోపరిమితి: 17 1/2 - 21 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థి 2003 అక్టోబరు 1 నుంచి 2007 ఏప్రిల్ మధ్య జన్మించి ఉండాలి.

అర్హత: పోస్టును అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి/మెట్రిక్యులేషన్, 10+2/ఇంటర్మీడియట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ లేదా ఆర్ట్స్, కామర్స్, సైన్స్), సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎత్తు(సెం.మీ.లలో): అగ్నివీర్ జీడీ/ట్రేడ్స్‌మన్-166, అగ్నివీర్ టెక్నికల్-165, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్-162.

ఛాతీ కొలత: గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ విస్తరణతో 77 సెం.మీ. ఉండాలి

పరీక్ష ఫీజు: రూ.250

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిక్రూట్‌మెంట్ ర్యాలీ(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్/ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్), వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 22

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: ఏప్రిల్ 22

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

INDIAN ARMY

ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో టెక్నీషియన్స్

ఖాళీలు 100

న్యూఢిల్లీలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజనీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్... వివిధ విభాగాల్లో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(మెయింటెనెన్స్/ఒవర్‌హాల్, ఏవియానిక్స్)
2. ఎయిర్‌క్రాఫ్ట్ టెక్నీషియన్(ఏవియానిక్స్ ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటల్/రేడియో)
3. టెక్నీషియన్(ఫిట్టర్/షీట్ మెటల్, కార్పెంటర్, వెల్డర్)
4. టెక్నీషియన్(ఎక్స్-రే/ఎన్‌డీటీ)

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, ఇంజనీరింగ్ సర్టిఫికెట్, బీటెక్ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 35 ఏళ్లు

జీతం: నెలకు రూ.28,000

ఎంపిక ప్రక్రియ: స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్, టెక్నికల్ అసెస్‌మెంట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 23

వెబ్‌సైట్: https://www.aiesl.in/

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు



ఖాళీలు 80

ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)... రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): **23 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): **51 పోస్టులు**
3. మేనేజర్(సెక్యూరిటీ అనలిస్ట్): **3 పోస్టులు**
4. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(అప్లికేషన్ సెక్యూరిటీ): **3 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం తప్పనిసరి.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్

గరిష్ఠ వయోపరిమితి: అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 30 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్‌కు 35 ఏళ్లు; మేనేజర్‌కు 38 ఏళ్లు; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు 42 ఏళ్లు మించకూడదు.

పని ప్రదేశం: ముంబయి, నవీ ముంబయి

జీతభత్యాలు: అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.36,000- రూ.63,840; డిప్యూటీ మేనేజర్‌కు రూ.48,170 - రూ.69,810; మేనేజర్‌కు రూ.63,840- రూ.78,230; అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌కు రూ.89,890 - రూ.1,00,350.

దరఖాస్తు ఫీజు: రూ.750. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది **ఎంపిక:** అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 4

వెబ్‌సైట్: https://www.sbi.co.in/

లిటిల్స్



ఒకరిని మించి మరొకరు..


అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యాన్ని కర్కల్ అనే రాజు పాలించేవాడు. అతనికి శిల్పాలంటే మహా ఇష్టం. ఆ రాజ్యంలోనే అమరుడు అనే ఓ గొప్ప శిల్పి ఉండేవాడు. అతని గొప్ప ప్రతిభ విని రాజ్యానికి పిలిపించి రాచమర్యాదలు చేశాడు. అమరుడికి అర్థం కాలేదు. ఆ తర్వాత రాజు ఇలా అన్నారు.. 'అమరుడా.. నీ శిల్ప చాతుర్యం తెలుసు. ఈశ్వరుడి విగ్రహం 25 అడుగులు కావాలి' అని అడిగాడు. 'ఓస్ అదెంతపని' అన్నాడు. ధనం ఇస్తూనే శిల్పి ఇంటికి వెళ్లిపోయి ఆ పనిలో పడ్డాడు. రాత్రిం పగలు కష్టపడ్డాడు. పరమేశ్వరుడి విగ్రహాన్ని అందంగా చెక్కాడు. కొన్ని నెలల కష్టం అతనిది. ఆ విగ్రహాన్ని చూసి రాజుగారు మురిసిపోయారు. 'ఇంతటి గొప్ప వ్యక్తి నా దేశంలో ఉండటం గర్వకారణమే' అంటూ పొగిడాడు. ఆ శిల్పాన్ని చూసి ఇంత ఎత్తు అయిన శిల్పం చెక్కడం కష్టం.. పరమశివుడు ఎంత బావున్నాడో.. అంటూ జనాలు పొంగిపోయారు. రాజుగారికి పేరు రావటంతో.. మరింత సొమ్ము బంగారు నాణేలను ఇచ్చాడు ఆ శిల్పికి. ఇక సెలవని శిల్పి బయలుదేరాడు.



శిల్పి బయలుదేరగానే రాజుగారికి దుర్బుద్ధి పుట్టింది. ఇతడు ఈ విగ్రహం కంటే పెద్దది చేస్తే ఎలా? అనుకున్నాడు. వెంటనే భటులను పంపించి అతని కుడిచేయి తీయించాడు. ఇచ్ఛితంగా కుడిచేయి లేకుంటే పని చేయలేడని రాజుగారి ఆలోచన. రాజుగారి ద్రోహాన్ని చూసి శిల్పికి ఒళ్లు మండింది. కోపంతో రగిలిపోయాడు. మంచికి కాలం లేదనుకున్నాడు. వెంటనే కర్కల్‌కు శత్రువు అయిన కుమారుడు అనే రాజు దగ్గరకు వెళ్లాడు. తన బాధను వెళ్లగక్కాడు. 'చేయి లేదా?' అన్నాడు రాజు. 'నా సత్తువ పోదు. ఎడమ చేయి ఉంది కదా?' అన్నాడు శిల్పి. రాజుమీద కోపం కక్కాడు. 'అయితే నాకు ముప్ఫయి అడుగుల కాళికాదేవి విగ్రహం కావాలి' అన్నాడు. శిల్పి 'సరే' అన్నాడు. అందుకు తగిన డబ్బును ఇచ్చాడు రాజుగారు. ఇంటికి పోయి మరింత రెట్టించిన ఉత్సాహంతో.. ఎప్పటిలానే తన తోటి శిల్పుల సహాయంతో అందంగా చెక్కాడు విగ్రహాన్ని. ఆ విగ్రహం చెక్కుతూనే అందరూ అక్కడికి వచ్చి వేనోళ్ల పొగిడారు. గొప్ప విజయంగా భావించాడు రాజు. శిల్పి ఆనందానికి అవధుల్లేవు.

ఈ కాళికా విగ్రహం చూడటానికి విదేశాల నుంచి వస్తామని కబురొచ్చింది. రాజుగారు గర్వపడ్డారు. వారం దాటిన తర్వాత రాజుగారికి కర్కల్ రాజులానే ఆలోచన వచ్చింది. ఇంతకంటే పెద్ద విగ్రహాన్ని కడితే ఎలా? అనుకున్నాడు. భటులను పంపించి.. శిల్పిగారి ఎడమ చేతిని కూడా తీయించాడు. దీంతో శిల్పికి మరింత కోపం వచ్చింది. రాజులనేమీ చేయలేడు కదా. ఏడుస్తూ కూర్చున్నాడు. నిద్రపట్టలేదు. రాజుల ద్రోహం ఇలా ఉంటుందా? ప్రతిభకు పట్టం కట్టరా? అంటూ రాత్రంతా మేల్కొన్నాడు. ఉదయాన్నే వింధ్య ప్రాంతం వైపు వెళ్లాడు. అక్కడ శేషుడు అనే రాజు ఉన్నాడు. అతని దగ్గరకు పోయి తన బాధను వెళ్లగక్కాడు. 'ఇంకేమి చేయగలవు' అన్నాడు. 'నా చేతులు పోయాయి కానీ బుర్ర ఉంది కదా..' అన్నాడు. వెంటనే శేషుడు ఇలా అన్నాడు.. 'శివపార్వతుల శిల్పాలు కావాలి. అది కూడా యాభై అడుగులు కావాలి' అన్నాడు. ఆ ఇద్దరు రాజులు చేసిన ద్రోహానికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. రాజుగారి దగ్గర నుంచి అనుమతి తీసుకుని వెళ్లి నెలల పాటు శ్రమించి అద్భుతమైన శివపార్వతుల విగ్రహాలు చెక్కాడు. ఆ యాభై అడుగుల విగ్రహం చూడటానికి జనాలు తండోపతండాలుగా వస్తున్నారు. దీంతో శేషుడు కూడా మునుపటి రాజుల్లానే ఆలోచించాడు. యాభై అడుగుల విగ్రహం నా రాజ్యంలోనే ఉండాలనుకున్నాడు. వెంటనే భటులను ఆజ్ఞాపించి ఆ శిల్పి శిరస్సును ఖండించమన్నాడు. అలా శిల్పి కథ ముగిసింది.

10 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 233

	6		4					
		8		9		2		
7	1			3	8	9		
3		1	5					
5								9
					9	3		7
		3	1	7			6	2
		4		6		7		
					4		9	

సుడోకు - 232 సమాధానం

2	6	1	5	8	7	4	3	9
4	7	5	6	3	9	2	8	1
8	3	9	4	1	2	7	5	6
9	4	2	1	5	3	8	6	7
6	5	3	7	9	8	1	2	4
7	1	8	2	6	4	5	9	3
5	8	4	9	7	6	3	1	2
3	2	6	8	4	1	9	7	5
1	9	7	3	2	5	6	4	8


ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 18 ఫిబ్రవరి 2024



ఇటీవల సతీమణి సురేఖ సమేతంగా అమెరికా వెళ్లిన మెగాస్టార్ చిరంజీవి తన స్నేహితుడు కుమార్ కోనేరు కుమారుడు కిరణ్ వివాహ వేడుకలో పాల్గొన్నారు. కొత్త దంపతులు కిరణ్, శైలశ్రీలను ఆశీర్వదించారు. విక్టరీ వెంకటేశ్ దంపతులు, నిర్మాతలు అల్లు అరవింద్, డాక్టర్ కె.ఎల్.నారాయణ, నవీన్ యర్నేని తదితరులు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

పుష్ప 3 పై అల్లు అర్జున్ క్లారిటీ



అల్లు అర్జున్ కెరీర్‌లోనే అతి పెద్ద విజయం సాధించిన చిత్రం 'పుష్ప ది రైజ్'. దీనికి కొనసాగింపుగా వస్తున్న 'పుష్ప ది రూల్' చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. దీనికి మూడో భాగం కూడా వస్తుందనే వార్తలు వినిపిస్తున్న నేపథ్యంలో అల్లు అర్జున్ ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. బెర్లిన్ 74వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనడం కోసం ఆయన జర్మనీ చేరుకున్నారు. 'పుష్ప ది రైజ్' చిత్రాన్ని ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. ఈ వేడుకలో అల్లు అర్జున్ మాట్లాడుతూ పుష్ప కథను కొనసాగించాలని అనుకుంటున్నాం. 'పుష్ప ' పార్ట్ 3 తప్పకుండా ఉంటుంది. దానిని తెరపైకి ఎక్కించేందుకు అద్భుతమైన ఆలోచనలు ఉన్నాయి' అని స్పష్టం చేశారు. 'విదేశాల్లోని ప్రేక్షకులు 'పుష్ప'చిత్రాన్ని ఎలా ఆదరిస్తారో చూడడానికే ఇక్కడకి వచ్చా. ఇక్కడి వారికి ఎలాంటి సినిమాలు కావాలో, వారి ఆలోచనలు ఎలా ఉంటాయో చూడాలి. మొదటి భాగం కంటే 'పుష్ప' రెండో భాగంలో పాత్రలు, వాటి మధ్య ఘర్షణ బలంగా ఉంటుంది. ముఖ్యంగా ఎర్రచందనం స్మగ్లర్ పుష్పరాజ్, పోలీస్ ఆఫీసర్ షెకావత్‌ల పాత్రలు, వాటి మధ్య సంఘర్షణ థ్రిల్లింగ్‌గా ఉంటాయి' అని అల్లు అర్జున్ తెలిపారు.

వాటితో మరింత గుర్తింపు

ప్రియమణి

'జవాన్', 'ది ఫ్యామిలీ మ్యాన్' చిత్రాల తర్వాత ఉత్తరాదిలో తనకు మరింత గుర్తింపు వచ్చిందని నటి ప్రియమణి చెప్పారు. గతంలో కంటే మంచి అవకాశాలు తనని వెదుక్కుంటూ వస్తున్నాయని అన్నారు. ప్రతిభకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందనీ. ఎక్కడున్నా అవకాశాలు వస్తాయనీ తన విషయంలో మరోసారి రుజువైందని ఆనందంతో చెప్పారు ప్రియమణి. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఇంతకుముందు మణిరత్నం 'రావణ్', షారుఖ్ ఖాన్ 'చెన్నై ఎక్స్‌ప్రెస్'లో నటించాను. అయితే 'ది ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్‌తో ఉత్తరాది ప్రేక్షకులకు దగ్గర కాగలిగాను. అలాగే ఇటీవల వచ్చిన 'జవాన్' సినిమా కూడా నాకు మంచి పేరు తెచ్చింది. చాలా మంది 'నువ్వు ప్రియమణివి కదూ' అని గుర్తు పట్టడం ఆనందాన్ని కలిగిస్తోంది' అని చెప్పారు. మంచి పాత్రల ఎంపికలో జాగ్రత్త పడుతున్నాననీ, హిందీలోనే కాదు మిగిలిన భాషల్లో కూడా విభిన్న పాత్రలు పోషించాలను కుంటున్నాననీ ప్రియమణి తెలిపారు. ప్రస్తుతం 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' సిరీస్‌తో పాటు 'ఆర్టికల్ 370', 'మైదాన్' హిందీ చిత్రాల్లో నటిస్తున్నట్లు ఆమె చెప్పారు. హీరోయిన్ యామి గౌతమ్ భర్త ఆదిత్య ధర్ నిర్మించిన 'ఆర్టికల్ 370' ఈ నెల 23న విడుదల కానుంది. అజయ్ దేవగణ్ 'మైదాన్' చిత్రం ఏప్రిల్ 10న విడుదలవుతుంది. 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' సిరీస్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని ప్రియమణి చెప్పారు.



కొత్త కలయిక ఖాయమా?

తెర మురిసేలా కలయిక కుదిరేనా
కొత్త ఏడాదిలో కథానాయికల సినిమాల కబుర్లు చాలానే వినిపిస్తున్నాయి.
ఫలానా హీరోతో జోడీ కట్టబోతున్నారంటూ వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి.
అయితే హీరోయిన్లు మాత్రం ఈ ప్రచారంపై పెదవి విప్పడం లేదు.
అధికారిక ప్రకటన మాత్రమే రావాల్సి ఉందంటున్న కలయికలు ఇవే





డీజే టిల్లు చిత్రంతో కథానాయికగా యువతలో ఫాలోయింగ్ పెంచుకోవడతో పాటు ఘన విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు నేహాశెట్టి. ఆ తర్వాత ఆమె నటించిన రెండు సినిమాలు పెద్దగా ప్రేక్షకాదరణ పొందలేకపోయాయి. ప్రస్తుతం ఆమె ఆశలన్నీ విష్వక్‌సేన్ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం పైనే. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని తర్వాత ఆమె చేయబోయే సినిమాలపై ఇప్పటివరకూ స్పష్టత రాలేదు. కానీ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన 'టైసన్ నాయుడు' చిత్రంలో ఆమె



నటించబోతున్నారని టాక్. ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌లో కథానాయిక ఎవరనేది చిత్రబృందం ఇప్పటివరకూ ప్రకటించలేదు. ఈ సస్పెన్స్‌కు తెరదించుతూ నేహా హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తారా, లేదా అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే.

అవకాశం అందుకున్నారా?

టాలీవుడ్‌లో ఇప్పుడు టాప్ హీరోయిన్ అంటే ముందు గుర్తుకొచ్చే పేరు రష్మిక మందన్న. అటు బాలీవుడ్‌లోనూ రాణిస్తోన్న ఈ ముద్దుగుమ్మ అగ్రహీరోలందరితో నటిస్తూ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్నారు. బాలీవుడ్‌లో రష్మిక నటించిన చిత్రాలు అన్నీ బాక్సాఫీసు దగ్గర ప్రభావం చూపలేకపోయాయి. అయితే 'పుష్ప' చిత్రం ఉత్తరాదిన ఇరగదీయడంతో రష్మికకు అక్కడ కూడా మంచి గుర్తింపు దక్కింది. దానికి కొనసాగింపుగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వం వహించిన 'యానిమల్' చిత్రం సూపర్‌హిట్ అవ్వడంతో ఈ అమ్మడికి పాన్ ఇండయా హీరోయిన్‌గా మార్కెట్ ఏర్పడింది. ప్రస్తుతం 'పుష్ప 2'తో పాటు రష్మిక టాలీవుడ్‌లో 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్‌బో' అనే రెండు హీరోయిన్ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్నారు. ఇప్పుడు మరో అరుదైన అవకాశం రష్మిక చెంతకు చేరినట్లు తెలుస్తోంది. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా రష్మికను ఎంపిక చేశారనీ, ఆమె కథ కూడా విన్నారని టాక్ నడుస్తోంది. ఒకవేళ ఇది నిజమైతే రష్మిక ప్రభాస్‌తో నటించే ఛాన్స్‌ను మిస్ చేసుకునే అవకాశం దాదాపు లేనట్లే.

జేజమ్మ తెలుగు సినిమా?

గ్యాప్ తర్వాత 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో హిట్ కొట్టారు అనుష్క శెట్టి. ప్రస్తుతం 'కథనార్' అనే మలయళ చిత్రం చేస్తున్నారు. అయితే అనుష్క తెలుగు సినిమాపై సస్పెన్స్ ఇంకా కొనసాగుతోంది. గతంలో క్రిష్ దర్శకత్వంలో 'వేదం' చిత్రంలో అనుష్క నటించారు. ఆయన దర్శకత్వంలో జేజమ్మ ఓ హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ చేస్తున్నారనే టాక్ నడుస్తోంది. ఇప్పటికే కొంత చిత్రీకరణ పూర్తి చేశారని కూడా చెబుతున్నారు. కానీ యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా రాలేదు.



'సామజవరగమన' చిత్రంతో టాలీవుడ్‌లో కథానాయికగా గుర్తింపు దక్కించుకున్నారు రెబా మోనికా జాన్. ప్రస్తుతం ఆమె తమిళ, మలయాళ చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'మ్యాడ్' చిత్రంతో ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన దర్శకుడు కల్యాణ్ శంకర్ - శర్వానంద్ కాంబినేషన్‌లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో కథానాయికగా రెబా మోనికా జాన్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే 'సామజవరగమన' చిత్ర దర్శకుడు రామ్ అబ్బరాజు, శర్వానంద్ కలయికలో ఓ చిత్రం ప్రకటించారు. ఏకే ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. ఇందులో ఇద్దరు హీరోయిన్లు శర్వాతో జంట కట్టబోతున్నారు. సంయుక్తా మీనన్, సాక్షి వైద్య పేర్లు వినిపిస్తున్నాయి. కథ నచ్చడంతో వారు కూడా ఎస్ చెప్పారని టాక్.

కోలీవుడ్‌పై కన్నేశారా?


'సీతారామం' హీరోయిన్‌గా ప్రేక్షకులకు గుర్తిండిపోయే నటన కనబరిచారు మృణాల్ ఠాకూర్. తర్వాత నాని సరసన నటించిన 'హాయ్ నాన్న' ఆమెకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. ప్రస్తుతం మృణాల్ విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీస్టార్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఓ హిందీ చిత్రం ఉంది. తెలుగులో కొత్త చిత్రం ఇప్పటివరకూ ఖరారు కాలేదు. అయితే హీరోయిన్‌గా తమిళ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చేందుకు మృణాల్ సిద్ధమవుతున్నారని కోలీవుడ్ వర్గాల సమాచారం. 'అయలాన్' దర్శకుడు రవికుమార్ రాఘవ లారెన్స్‌తో ఓ చిత్రం చేస్తున్నారు. అలాగే దర్శకుడు రమేశ్ వర్మ కూడా లారెన్స్‌తో ఓ చిత్రం చేస్తున్నారు. ఈ రెండింటిలోనూ హీరోయిన్‌గా మృణాల్ పేరు బలంగా వినిపిస్తోంది. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న 'విశ్వంభర'లోనూ ఓ హీరోయిన్‌గా మృణాల్ కనిపించనున్నారని టాక్. మరి వీటిలో ఏ సినిమాకు ఆమె సై అంటారో చూడాలి.


▸▸ టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా తిరుగులేని ఆధిపత్యం చెలాయించారు పుజాహెగ్డే. ఇప్పుడు మాత్రం ఇక్కడ ఆమె పేరే పెద్దగా వినిపించడం లేదు. ఒక్కటే సినిమా ఆమె చేతిలో ఉంది. తెలుగులో ఆమె నటించిన చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవ్వడంతో బాలీవుడ్ సినిమాలపై దృష్టిపెట్టారు. అక్కడా కాలం కలసిరాలేదు. దాంతో ఇప్పుడు ఆమె చూపు మళ్లీ దక్షిణాది చిత్రాలపై పడిందని టాక్. తెలుగు, తమిళ చిత్రాల్లో నటించేందుకు పుజా కొత్త కథలు వింటున్నారట. తమిళ దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహిస్తున్న హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రంలో నటించేందుకు అంగీకరించారని టాక్. పూజా ప్రస్తుతం బాలీవుడ్‌లో షాహిద్ కపూర్ సరసన 'దేవా చిత్రంలో నటిస్తున్నారు.

▸▸ శ్రీదేవి తనయ జాన్వీకపూర్ త్వరలోనే



తెలుగు తెరపై సందడి చేయనున్నారు. 'దేవర' చిత్రంతో ఎన్టీఆర్‌కు జోడీగా కనిపించనున్నారు. దీంతో పాటు ఆమె కోలీవుడ్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది. రాకేశ్ ఓం ప్రకాశ్ మెహ్రా దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా 'కర్ణ' అనే చిత్రం తెరకెక్కుతోంది. మహా భారతంలోని కర్ణుణి పాత్ర ఆధారంగా రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో సూర్యకు జోడీగా జాన్వీని ఎంపికచేసినట్లు తెలుస్తోంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అవతార్: ది లాస్ట్ ఎయిర్‌బెండర్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 22
బరీడ్ ట్రూత్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 23
ఆర్టికల్ 370	హిందీ చిత్రం	ఫిబ్రవరి 23
అమెజాన్ ప్రైమ్		
అపార్ట్‌మెంట్ 404	కొరియన్ సిరీస్	ఫిబ్రవరి 23
పోచర్	తెలుగు డబ్బింగ్ సిరీస్	ఫిబ్రవరి 23
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
విల్ ట్రెంట్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 21
మలైకొట్టై వాలిబన్	మలయాళ చిత్రం	ఫిబ్రవరి 23
ఆపిల్ టీవీ ప్లస్		
ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 21



బాపు దృశ్య కావ్యం సీతా కల్యాణం

బాపు, రమణలకు శ్రీరాముడంటే ఎంత అభిమానమో! శోభన్‌బాబు నటించిన 'సంపూర్ణ రామాయణం' చిత్రంతోనే బాపు పౌరాణిక చిత్రాలకు శ్రీకారం చుట్టారు. ఆయన చివరి చిత్రం శ్రీరామ రాజ్యం కూడా రామకథే కావడం గమనార్హం. ఈ రెండు చిత్రాలకు మధ్యలో ఆయన తీసిన మరో అద్భుత చిత్రం సీతా కళ్యాణం. నిజం చెప్పాలంటే ఇదొక సాహసిక ప్రయోగం. పాత్రలను అవసరమైనంత వరకే వాడుకోవడం, సంభాషణలను అవసరమైనంత వరకే చెప్పించడం.. . ఈ సినిమా ప్రత్యేకత. ఇందులో పాటల్లోని మాటలు బాగుండడమే కాకుండా కొన్ని మాటలు పాటల్లా ఉండడం ఒక విశేషం. అందుకేనేమో మొదట్లో అంటే 1976 జూలై 11న విడుదలైన 'సీతా కల్యాణం' క్లాస్ ఆడియన్ బాగుందని మెచ్చుకున్నారు కానీ మాస్ ఆడియన్స్ మాత్రం ఆ సినిమా జోలికి పోలేదు. థియేటర్ లో సినిమా నడుస్తుంటే జనం..'సౌండ్ సౌండ్..డైలాగులు లేవు రోయ్' అని కేకలు పెట్టారు .ఎందుకంటే పౌరాణిక చిత్రం అనగానే అందరికీ అలవాటయిన సుదీర్ఘమైన సంభాషణలు ఈ చిత్రంలో లేవు. అన్నీ పాటలే. సంగీత మయమే. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదొక సంగీత రూపకం. దృశ్య కావ్యం. ఈ సినిమా కోసం రచయిత ముళ్ళపూడి వెంకట రమణ పది పన్నెండు పేజీలకు మించి డైలాగులు రాయలేదు. విదేశీయులు కళ్లకు అద్దుకున్నారు

ఆ ఏడాదే చెన్నైలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగింది. ఎమ్జీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయమది. ఈ ముఖ్యమంత్రి ఎన్నో చిత్రాల్లో హీరోగా నటించారని విని ఆశ్చర్యపోయిన విదేశీ సినీ ప్రముఖులు ఆయన సినిమా ఏదన్నా చూడాలని ముచ్చట పడ్డారు. ఎమ్జీ రామచంద్రన్ సినిమా ఏదన్నా చూపించమని ఫిల్మ్ ఫెస్టివల్ ఆర్గనైజర్‌ను అడిగారు. ఆ ఆర్గనైజర్ ఉత్తరాది వాడు. విదేశీ ప్రముఖులు రాముల వారి సినిమా చూడాలనుకుంటున్నారని పొరపడి, రాముల వారి సినిమా ఏదన్నా ఉంటే పంపించమని ఫిల్మ్ ఛాంబర్‌కు కబురు చేశారు. దాంతో ఛాంబర్ ప్రతినిధులు రామాయణ గాథను తీసిన ప్రతి ఒక్క నిర్మాతకు ఫోన్ చేశారు. కానీ ఎవరి దగ్గరా ప్రింట్లు రెడీగా లేవు. ముళ్లపూడి వెంకట రమణకు కూడా ఫోన్ వచ్చింది. ఆయన వెంటనే 'సీతా కల్యాణం' ప్రింట్ పంపించారు.



ఆ మర్నాడు విదేశీ సినీ ప్రముఖులకు 'సీతా కల్యాణం' సినిమా ప్రదర్శించారు. ఆ దృశ్య కావ్యం చూసి ప్రతి ఒక్కరికీ మతి పోయింది. 'ఇంత మంచి సినిమాను ఎందుకు చూపించలేదు' అంటూ ఆర్గనైజింగ్ కమిటీని ప్రశ్నించారు. లండన్ 'గార్డినర్' అనే పత్రికలో సినిమా సెక్షన్ ఎడిటర్‌గా డెరిక్ మాల్ కమ్ ఉండేవారు. ఆయన దర్శకుడు బాపుని కలుసుకుని 'ఆరు నెలల్లో లండన్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతుంది. మీ సినిమాను పంపించండి. మేం కూడా మీ ప్రభుత్వానికి లెటర్ రాస్తాం' అని చెప్పారు.అలా లండన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'సీతా కల్యాణం' చిత్రాన్ని ప్రదర్శించారు. సినిమా పూర్తి కాగానే థియేటర్‌లో ఉన్న వారంతా లేచి నిలబడి కరతాళ ధ్వనులతో దర్శకుడు బాపుని అభినందించారు. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రవి, సీతగా జయప్రద, రావణుడిగా సత్యనారాయణ నటించారు. కె.వి మహదేవన్ తన సంగీతంతో ఈ సినిమాకు ప్రాణం పోశారు.



బెర్లిన్‌లో 'ది ఫాబల్'కు అద్భుత స్పందన

మనోజ్ వాజ్‌పేయి ప్రధాన పాత్ర పోషించిన 'ది ఫాబల్' చిత్రాన్ని బెర్లిన్‌లో జరుగుతున్న 74 వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో శుక్రవారం ప్రదర్శించినప్పుడు అద్భుతమైన స్పందన వచ్చిందని దర్శకుడు రామ్‌రెడ్డి చెప్పారు. 16 ఎం.ఎం. ఫార్మెట్‌లో ఉత్తరాఖండ్‌లో ఈ చిత్రాన్ని రూపొందించారు. 'బెర్లిన్‌లో జరిగిన ఫెస్టివల్‌లో మా చిత్ర ప్రదర్శనకు వచ్చిన స్పందన అద్భుతం. తొలి ప్రదర్శన టికెట్లు గంటలోనే అమ్ముడవగా, రెండో రోజు కూడా దాదాపు వెయ్యి టికెట్లు అమ్ముడవడం చాలా ఆనందాన్ని కలిగించింది. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది' అని మీడియాకు చెప్పారు రామ్‌రెడ్డి. ఆయనకు 'ది ఫాబల్' రెండో సినిమా. మొదటి చిత్రం 'తితి' కూడా జాతీయ అవార్డ్ సాధించడమే కాకుండా అంతర్జాతీయంగా ప్రశంసలు పొందింది.